www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం



సంపుటి : 66 సంచిక : 267 | మంగళవారం 20-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupati, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

# ఢిల్లీ దద్దరిల్లాలి..

**హోదా కోసం దశల వారీ ఉద్యమం**

- 22న జాతీయ రహదారుల దిగ్బంధం
- 13 జిల్లాల్లో హోదా సాధన సమితి జేసీలు
- పార్టీలకు అతీతంగా సమష్టి ఆందోళనలు
- ఉద్యమకారులపై సీఎం కేసులు తొలగించాలి - టీడీపీ ఉద్యమంలోకి రావాలి
- ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నేత కె.రామకృష్ణ



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్, పక్కన కె.రామకృష్ణ, కొణతాల, శివాజీ, ముప్పాళ్ల, మధు, తులసిరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు తదితరులు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ప్రత్యేక హోదా మలిదశ ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా దేశ వ్యాప్తంగా హోరెత్తాలా నిర్మిద్దామని, ఢిల్లీకి పెద్ద షాక్‌గా ఆ ఉద్యమం నిలవాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర నేత, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన విజయవాడలో సోమవారం రౌండుటేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి రాజకీయ శ్రేణులు, ప్రత్యేక హోదా సాధన సమితి, విద్యార్థి, యువజన, మేధావులు, న్యాయవాదులు తదితర సంఘాల నుంచి 35మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిందేనని, తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని వారు అభిప్రాయం వ్యక్తంచేశారు. రామకృష్ణ ప్రసంగం కొనసాగిస్తూ, ఇది రాష్ట్ర సమస్య కాదనీ, జాతీయ సమస్యగా మారిందని స్పష్టం చేశారు. నాలుగేళ్ల నుంచి రాష్ట్రానికి బీజేపీ నేతలేం చేశారో చెప్పాలని కోరారు. సాధన సమితి ఉద్యమ ప్రభావంతోనే నేడు అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టే పరిస్థితులు వచ్చాయని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతీయ పార్టీలను మభ్యపెట్టి అవిశ్వాసం నుంచి గట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖర్ని నిరసిస్తూ మలిదశ ఉద్యమం ఒక ఉప్పెనలా కొనసాగాలని, ఢిల్లీలోని ప్రతి గల్లీకి సెగ తగిలేలా ఉద్యమించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లోనూ నిరసనలు ఉధృతం కావాలని, రైళ్లు, విమానాలను నిలిపేసేలా ఉద్యమాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 'సీఎం చంద్రబాబునాయుడుకు నిజంగా ప్రత్యేక హోదాపై మమకారం వుంటే..ఈ ఉద్యమానికి

- మిగతా 11 లో



## పెళ్లి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- మ్యారేజ్ ఆఫీసర్లుగా జిల్లా, సబ్ రిజిస్ట్రార్లు
- మ్యారేజ్ చట్టం - 2002 అమలు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**విశాలాంధ్రబ్యూరో - అమరావతి** పెళ్లి రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. మ్యారేజ్ చట్టం - 2002ను రాష్ట్రంలో పక్కాగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చట్టాన్ని తక్షణం అమలులోకి తీసుకువస్తున్నట్లుగా ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. వివాహాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలుగా జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లను మ్యారేజ్ ఆఫీసర్లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీ సాంబశివరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని జిల్లాల్లోని జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్ల వద్ద వివాహాల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు

- మిగతా 2 లో

# 43% అర్హులు

**ఏపీ టెట్ ఫలితాల విడుదల**

- పేపర్-1(ఎస్జీటీలు) అత్యధికంగా 57.88శాతం
- పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)-37.26శాతం
- పేపర్-2లో (సోషల్)-38.22శాతం
- పేపర్3 (లాంగ్వేజెస్) 42.60శాతం ఉత్తీర్ణత
- పరీక్షలు రాసిన వారు-4,14,120 మంది
- అర్హత సాధించిన అభ్యర్థులు-1,94,086



ఫలితాలు విడుదల చేస్తున్న మంత్రి గంటా

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)-2017 ఫలితాలలో 43శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. సోమవారం విజయవాడ గేట్ వే హోటల్‌లో పాఠశాల విద్యాశాఖ కమిషనరు సంధ్యారాణి, కన్వీనరు సుబ్బారెడ్డితో కలిసి మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు టెట్ ఫలితాలను మీడియాకు విడుదల చేశారు. టెట్ పేపర్-1లో 57.88శాతం, పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్) - 37.26శాతం, పేపర్-2 (సోషల్) - 38.22శాతం, పేపర్-342.60శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు.-ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి 2 వరకూ ఏపీ టెట్ పరీక్షను 190 కేంద్రాలలో నిర్వహించారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన పేపర్-1,2,3 పరీక్షలకు మొత్తంగా 4,14,120 మంది(92.67శాతం) అభ్యర్థులు పరీక్ష రాశారు.అందులో 1,94,086 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.విభాగాల వారీగా పేపర్-1 అభ్యర్థులు-1,73,861(96శాతం), పేపర్-2కు 1,81,734 (89.07శాతం), పేపర్-3కు 58,525 (94.29శాతం) మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాల్లో అన్ని పేపర్ల నుంచి 90మార్కులకుపైగా మార్కులను 25 శాతం

- మిగతా 2 లో

## మీ వాళ్లే లీక్ చేశారు

- టీడీపీ ప్రభుత్వ అవినీతిపై పవన్ సంచలన వ్యాఖ్యలు
- కేంద్రం దర్యాప్తు చేయించాలి



**విశాలాంధ్ర - హైదరాబాద్ :** టీడీపీ ప్రభుత్వంలో అవినీతిని గురించి 40 మంది ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలే తనకు సమాచారమిచ్చారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మరో సంచలన అంశాన్ని బయట పెట్టారు. ఆయన ఒక ఇంగ్లీషు ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై తాను చేసిన ఆరోపణలపై పవన్ స్పందిస్తూ, తాను అకస్మాత్తుగా ఇప్పుడు ఆరోపణలు చేయడం లేదని..గత నాలుగేళ్లుగా తాను ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని చెప్పారు. కానీ సీఎం చంద్రబాబు ఈ సమస్యను ఏనాడూ తీవ్రంగా తీసుకోలేదని... ప్రభుత్వంలో జరుగుతోన్న అవినీతి ఆయనకు తెలుసునని చెప్పారు. దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో అవినీతి జరుగుతున్నట్లు తనకు చెప్పారని..తాను ముఖ్యమంత్రికి సమస్యను వివరించాలని వారు భావించారని..తాను అదే చేశానన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలంటూ డిమాండు చేశారు. పోలవరం ప్రాజెక్టును ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించడం వెనక కూడా ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తంచేశారు.

ప్రధాని నరేంద్ర మోడీ చాలా దగ్గరిగా తెలుసునని, కానీ తన పరిమితులు తనకున్నాయన్నారు. తన వ్యాఖ్యల వెనక బీజేపీ ఉందంటూ టీడీపీ నేతలు మాట్లాడుతున్నారని,

- మిగతా 2 లో

# అవిశ్వాసంలో డ్రామా..!

- వైసీపీ, టీడీపీ ఎంపీల అల్లరి
- సభ నేటికి వాయిదా
- చర్చకు సిద్ధమేనన్న రాజ్‌నాథ్
- మళ్లీ నోటీసులు ఇచ్చిన వైసీపీ

**విశాలాంధ్రబ్యూరో - న్యూఢిల్లీ :** ప్రత్యేక హోదా విషయంలో నమ్మక ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ సర్కారుపై ఏపీ ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చి తీర్మానం చర్చకు రాకుండా ఏపీ ఎంపీలే అల్లర్లతో అడ్డుకున్నారు. ఈ చర్య ద్వారా అసంతృప్తితో రగిలిపోతున్న ఐదు కోట్ల ఆంధ్రుల మనోభావాలను దెబ్బతీశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ జనం అటు వైసీపీ, ఇటు టీడీపీని ఈసడించుకునే పరిస్థితి ఏర్పడింది. సభ సజావుగా జరిగితేనే అవిశ్వాసం చర్చకు వస్తుందన్న విషయం తెలిసీ నోటీసులు ఇచ్చిన పార్టీలే వెల్‌లోకి దూసుకువెళ్లి సభ సాక్షిగా వాయిదా డ్రామాకు తెరతీశాయంటే కేవలం ఆరోపణ కాదు. గత శుక్రవారం వైసీపీ అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వగా ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో చర్చకు రాలేదు. అదే రోజున టీడీపీ ఎంపీ తోట నరసింహం 19న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలని నోటీసు ఇచ్చారు. అప్పటికే స్పీకర్ సభను సోమవారానికి వాయిదా



వేశారు. కనీసం సోమవారం సభను సజావుగా జరగనీయకుండా సభ ఆరంభ దశలోనే టీడీపీ, వైసీపీ ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లారు. మరో వైపు రిజర్వేషన్ కోటాపై టీఆర్ఎస్, కావేరీ యాజమాన్య బోర్డు

- మిగతా 2 లో

**'మోడీ ముక్త్ భారత్'**
రాజ్‌థాకరే పిలుపు

**లాలూకు మరో దెబ్బ**
నాలుగో కేసులోనూ దోషి

**ఢిల్లీ హైకోర్టుకు 2జీ కుంభకోణం కేసు**
సవాలు చేసిన ఈడీ

**అవినీతి, విభజన రాజకీయాలపై రాజీ లేదు**
నితీష్‌కుమార్ సుద్దులు

వివరాలు 9లో



## ఇటుకల్లా.. రద్దయిన నోట్లు

**న్యూఢిల్లీ:** పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో పాత రూ.500, 1,000 నోట్లను చీలికలుగా చేసి, ఇటుకల్లా మార్చుతున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఓ పీటీఐ ప్రతినిధి దాఖలు చేసిన పిటిషన్‌కు ఆర్బీఐ ఈ మేరకు వెల్లడించింది. ఈ నోట్ల పరిశీలన, ప్రామాణికత, లెక్కింపు తదితర సేవల కోసం దేశవ్యాప్తంగా వివిధ ఆర్బీఐ కార్యాలయాల్లో 59 కరెన్సీ వెరిఫికేషన్ ప్రాసెసింగ్ సిస్టమ్ (సీవీపీఎస్) మెషీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ నోట్లను

- మిగతా 2 లో

## ఎవరికీ దక్కని వేల కోట్లు

**బ్యాంకుల్లో మూలుగుతున్న రూ.11,300 కోట్ల 'అన్‌క్లెయిమ్డ్' డబ్బు**



**బెంగళూరు:** బ్యాంకుల వద్ద రూ. 11,300 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డబ్బు ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) తెలిపింది. కాగా, బ్యాంక్ ఖాతాదారులకు చెందిన ఈ డబ్బు అంతా 64 బ్యాంకుల్లోని 3కోట్ల ఖాతాల్లో ఉన్నదని వివరించింది. ఇందులో అధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వద్ద రూ.1,262 కోట్లు ఉండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) వద్ద రూ.1,250 కోట్లు ఉన్నాయి. వీటితో పాటు ఇతర జాతీయ బ్యాంకుల్లో రూ. 7,040 కోట్లు ఉన్నాయని ఆర్‌బీఐ తెలిపింది. 'అన్‌క్లెయిమ్డ్' డబ్బులో

- మిగతా 2 లో

**ఇదీ లోకం!**



# మామిడికి గడ్డుకాలం

- కాపులేక తగ్గనున్న దిగుబడి
- ధర రాక ప్రత్యామ్నాయం వైపు రైతులు
- ఆలస్యంగా ప్రారంభంకా'నున్న' మార్కెట్
- ఉగాదికి దస్త్రం కూడా పెట్టని వ్యాపారులు



**విశాలాంధ్రబ్యూరో - అమరావతి** రాష్ట్రంలో మామిడి సంక్షోభం ప్రారంభమైంది. ఈ ఏడాది మామిడి పూత లేకపోవటం, సీజన్ ఆరంభమైనా నేటికీ ఎక్కడా తోటల్లో మామిడి కాయలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీనికితోడు మామిడికి ధర నిర్ణయించే అధికారం ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో ఉండటంతో మార్కెట్‌లో రైతులు దగా పడుతున్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం రాకపోవటంతో, రైతులు కూడా మామిడి తోటల నిర్వహణపై పెద్దగా దృష్టి సారించటంలేదు. మరోవైపు పదుల సంవత్సరాల క్రితం వేసిన తోటలను రైతులు నరికేసి, ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో నాణ్యమైన మామిడికి కొరత ఏర్పడటంతో ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలకూ ఎగుమతులు క్రమంగా పడిపోతున్నాయి. దిగుబడి ఎక్కువగా ఉన్నపుడు గిట్టుబాటు ధర లేకపోవటం, ధర ఉన్నపుడు కాయలు లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ ఏడాది మామిడికి గడ్డు పరిస్థితులే దర్శనమిస్తున్నాయి. ఏటా ఉగాదికి మామిడికి ప్రసిద్ధి చెందిన కృష్ణాజిల్లా నుంచి సుమారు వెయ్యి టన్నుల వరకు మామిడి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేది. అలాంటిది అడపా దడపా ఒకటీ రెండు టన్నులకు మించి మామిడి విక్రయాలు జరగలేదంటేనే పండ్ల రారాజుకు ఎంతటి గడ్డుకాలం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో కృష్ణా, ఉభయ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో సుమారు 3.20 లక్షల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. గతేడాది గణాంకాల ప్రకారం

- మిగతా 2 లో

## మాది ప్రజాఫ్రంట్..

- అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెస్తాం
- బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయం అవసరం
- మమతతో కేసీఆర్ భేటీ

11 లో

## వెనిజులాలో కొత్త కరెన్సీ




కారకస్ : వెనిజులా నగరం ఎలోర్జలో కొత్తగా స్వంత కరెన్సీని విడుదల చేసారు. బ్యాంకుల మధ్య లావాదేవీలు వేగంగా జరిగేందుకుగాను ఈ కరెన్సీని విడుదలచేసినట్లు నగర మేయర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కరెన్సీ నోట్లకొరత ఏర్పడిన నేపథ్యంలో నగరపాలకసంస్థ ప్రజలకు తేలికగా ఉండేందుకుగాను స్వంత కరెన్సీని విడుదల చేసినట్లుగా తెలియజేసింది. పౌరులు, ఇరత ప్రాంతాలనుండి వచ్చే వ్యాపారులు, సందర్శకులు, కొత్తకరెన్సీని వినియోగించుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఈ కొత్తకరెన్సీ బ్యాంకుల ద్వారా మేయర్ కార్యాలయానికి వస్తుంది. అంతేకాని ఇతర ప్రాంతాలకు ఇది విస్తరించదు. స్థానిక వాణిజ్యానికి ఈ కరెన్సీ తేలికగా ఉంటుంది.

## పుతిన్ ఘన విజయం



మాస్కో : రష్యా అధ్యక్షుడిగా వ్లదిమిర్ పుతిన్ ఘనవిజయం సాధించారు. 99 శాతం ఓట్లు లెక్కించే సమయానికి పుతిన్‌కి 76.6 శాతం ఓట్లు లభించాయి. పుతిన్ 4వసారి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల ఫలితాలను రష్యా ఎన్నికల కమిషన్ ఛైర్మన్ ఎల్లాఫామ్‌ఫిలోవ ప్రకటించారు. పుతిన్ 2024వరకు పదవిలో కొనసాగుతారు. రెండవస్థానంలో 11.01 శాతం ఓట్లతో గ్రుడినిన్ నిలిచారు. మూడవస్థానంలో 5.66 శాతం ఓట్లతో జిరినొవొస్కి ఉన్నారు. సబాక్ 1.67 శాతం ఓట్లతో 4వ స్థానంలో నిలిచారు. ఎన్నికల కమిషన్ ఛైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ పూర్తి ఫలితాలను ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక వెల్లడిస్తానని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎలాంటి అవకతవకలు జరిగినట్లు వెల్లడైనా ఎన్నికను రద్దు చేస్తామని అన్నారు. అయితే అలాంటి సంఘటన ఏమీ తన దృష్టికి రాలేదన్నారు. ఏ రాజకీయపక్షం కూడా తీవ్రమైన ఫిర్యాదులేమీ చేయలేదని చెప్పారు. పోలింగ్ సందర్భంగా 4,74,500 మంది పరిశీలక సిబ్బంది పనిచేశారు. 10,500 మంది మీడియా ప్రతినిధులు ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాల్లో పనిచేశారు. 1513మంది 115 దేశాల నుంచి పరిశీలకులుగా పాల్గొన్నట్టు తెలియజేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

# చైనాలో వేగవంతమైన అభివృద్ధి

### ఐదేళ్లలో 54 ట్రిలియన్ యువాన్లకు చేరిన ఆర్థికరంగం



బీజింగ్ : అధ్యక్షుడు జిన్‌పింగ్ పాలనాకాలంలో చైనాలో అభివృద్ధి గత ఐదేళ్లలో వేగవంతమయ్యింది. 52 ట్రిలియన్ యువాన్లనుంచి ఐదేళ్లలో ఆర్థికరంగం 54 ట్రిలియన్ యువాన్లకు చేరింది. జిడిపి వృద్ధి రేటు ఏడాదికి సగటున 7.1 శాతం నమోదవుతోంది. పట్టణ, నగర ప్రాంతాలలో 66 మిలియన్ల ఉద్యోగాలను ఈ కాలంలో సృష్టించారు. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ బలంగావుంది. ప్రపంచంలోనే రెండవ బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందింది. వస్తువుల సరఫరా విషయంలో చైనా ముందుంది. ప్రజల వినిమయం వృద్ధికి మరింతగా దోహదంచేసే దిశలో సాగింది. గత ఏడాది జరిగిన ఆర్థిక వృద్ధిలో వినిమయం వాటా 58.8 శాతం ఉంది. సేవలరంగం వాటా 45.3 శాతం నుంచి 51.6 శాతానికి పెరిగింది. ప్రజలు మరింత సుఖమైన జీవనాన్ని అనుభవిస్తున్నారు. 68 మిలియన్ల ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు.వ్యక్తిగత ఆదాయం సగటున ఏడాదికి 7.4 శాతానికి పెరిగింది. ఆయుఃప్రమాణం 76.7 సంవత్సరాలకు పెరిగింది. అభివృద్ధి చెందిన దేశాలలో ఈ అంశంలో చైనా గణనీయమైన వృద్ధిని సాధించింది. నీరు, భూమి, వాయు కాలుష్యాలను గణనీయంగా తగ్గించారు. ప్రధాన నగరాల్లో అత్యంత భారీగా ఏర్పడే కాలుష్య దినాలను దాదాపుగా పరిష్కరించారు. సంస్కరణల ద్వారా ఈ వృద్ధిని సాధించారు. ఈ పురోగతి వెనుక జిన్‌పింగ్ ఆలోచనలే ఎక్కువుగా ఉన్నాయి. అయిదేళ్లకాలంలో 1500 సంస్కరణ చర్యలను చేపట్టారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వాతావరణ రంగాలు, జాతీయరక్షణ, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం తదితర రంగాలలో ఈ సంస్కరణలను అమలు చేశారు. ప్రభుత్వ యంత్రాంగంలో రెడ్‌టేపిజాన్ని దాదాపుగా నిర్మూలించారు. విదేశీ పెట్టుబడులు అత్యధికంగా వస్తున్నాయి. కఠినమైన శ్రమ ద్వారానే సంతోషం వస్తుందని జిన్‌పింగ్ కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభలో చెప్పారు. ప్రభుత్వం ప్రజల సంతోషం కోసమే ఈ సంస్కరణలను చేపట్టిందని ఆయన అన్నారు. ప్రజలను అసంతృప్తికి గురిచేసే అంశాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని జిన్‌పింగ్ పార్లమెంటు సమావేశాలలో మాట్లాడుతూ చెప్పారు. ఆయన తన 15వ ఏటనే పార్టీలో చేరారు. పట్టణ ప్రాంత జీవనానికి స్వస్తిపలికి గ్రామీణ ప్రాంతాలలో పార్టీ నిర్మాణం కోసం పనిచేసి రైతులనుంచి ఎంతో నేర్చుకున్నానని జిన్‌పింగ్ అన్నారు.

# లండన్‌లో భారీ ఫాసిస్టు వ్యతిరేక ర్యాలీ

### పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యాసవల్లే పెరిగిన ద్వేషం




లండన్ : బ్రిటన్ నగరాలు లండన్, గ్లాస్‌గోవ్, కార్డిఫ్‌లలో ఫాసిస్టు వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. లండన్‌లోనే 20వేల మందికి పైగా పాల్గొని ఫాసిజాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఐరోపా అంతటా జాతి వివక్ష పెరిగిందని పెట్టుబడిదారి వ్యవస్థ అత్యాసవల్లనే ఇతర జాతులపట్ల ద్వేషం పెరిగిపోయిందని ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వీటిని నియంత్రించాలని ప్లకార్డులు ధరించిన ప్రదర్శకులు నినాదాలు చేశారు. ఐక్యరాజ్యసమితి జాతి వివక్ష వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శనలు జరిగాయి. ఐరోపాలోని అనేక దేశాలలో జాతి వివక్ష వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. జాతి వివక్ష, ద్వేషంతో జరిపే దాడులను తక్షణం నిలిపివేయాలని వలసకారులను, శరణార్థులను దేశంలోకి అనుమతించాలని ప్రదర్శకులు నినదించారు. జాతి వివక్ష, ద్వేషం పెరగడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యాసే కారణమని ప్రదర్శకుల సుద్దేశించి మాట్లాడిన వక్తలు విమర్శించారు. ముస్లింలను శిక్షించాలన్న ప్రచారం నేపథ్యంలో అనేకమంది ముస్లిం ఎంపీలను, గృహస్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు సాగించారని ఇస్లాం వ్యతిరేక ప్రచారం నిర్వహిస్తున్న వారిని శిక్షించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇస్లాం వ్యతిరేకతను సృష్టిస్తున్న వారికి వ్యతిరేకంగా పోరాడాలని వారు కోరారు. ప్రదర్శన నిర్వాహకులలో ఒకరైన లేబర్ పార్టీనేత డియనిఅబాట్ మాట్లాడుతూ ముస్లింలను శిక్షించాలని ప్రచారం నిర్వహిస్తున్న వారిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్కాట్‌లాండ్ లేబర్ పార్టీ నేత రిచర్డ్‌లియోనార్డ్ గ్లాస్‌గోవ్‌లో జరిగిన ప్రదర్శనసుద్దేశించి మాట్లాడారు.

## చైనాలో కొత్త ఆర్థిక బృందం ఎన్నిక

బీజింగ్ : చైనా అధ్యక్షుడిగా రెండవసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన జిన్‌పింగ్‌కు కొత్త ఆర్థిక బృందం ఎన్నికయ్యింది. రుణాల తగ్గింపు, ఆర్థిక రిస్కులను తగ్గించేందుకు ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని నూతన ఆర్థిక బృందం పనిచేస్తుంది. చైనా వస్తువులపై దిగుమతి సుంకాన్ని విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించిన నేపథ్యంలో జిన్‌పింగ్‌కు విశ్వాసపాత్రుడైన ప్రముఖ ఆర్థికవేత్త లియుహే (66) ను ఎంచుకున్నారు. పార్లమెంటు ఆయన ఎన్నికను ధృవీకరించింది. ఆయన హార్వర్డ్ యూనివర్శిటీలో చదువుకున్నారు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధాన్ని నివారించే ప్రయత్నాలలో ఇటీవల ఆయన వాషింగ్టన్‌ను సందర్శించారు. పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా నూతన అధ్యక్షుడుగా ఈగాంగ్‌ను ఎంపికచేసే అవకాశాలున్నాయి.

ప్రస్తుతం ఆయన బ్యాంకు ఉపగవర్నర్‌గా పనిచేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద బ్యాంకులలో ఒకటైన చైనా బ్యాంక్ ద్రవ్య విధానాన్ని కొనసాగించేందుకు ఈగాంగ్ కృషి చేస్తారని భావిస్తున్నారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలను విలీనంచేసి ఈగాంగ్‌కు వాటి నిర్వహణ బాధ్యత అప్పగించనున్నారు. నూతన ఆర్థిక బృందంలో చైనా బ్యాంకింగ్ రెగ్యులేటరీ కమిషన్ ప్రస్తుత ఛైర్మన్ గువొషుకింగ్ కూడా ఉంటారు. ఆహార నియంత్రణ, భద్రత వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఆయా వ్యవస్థల రెగ్యులేటర్లు, మంత్రులలో పని సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు వ్యవస్థలను పటిష్టం చేయాలని జిన్‌పింగ్ నిర్ణయించారు. ఈ దిశలో ఆయన పలు చర్యలను తీసుకోనున్నారు.

## చైనా ప్రధానిగా లీ కెకియాంగ్

### రెండవసారి ఎన్నిక



బీజింగ్ : చైనా ప్రధానిగా లీ కెకియాంగ్‌ను 13వ జాతీయ పీపుల్స్‌కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యులు ఎన్నుకు న్నారు. ఆయనకు 2,964 ఓట్లురాగా, ఆయనకు వ్యతిరేకంగా రెండు ఓట్లు పోలయ్యాయి. చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ రెండవసారి ఎన్నికైన తర్వాత ఒకరోజు వ్యవధిలో లీ కెకియాంగ్‌ను పార్లమెంటు ఎన్నుకుంది. అలాగే అవినీతి వ్యతిరేక చర్యల కమిటీ పరిశీలక కమిషన్ డైరెక్టర్‌గా యాంగ్ గ్జియాడు ఎన్నికయ్యారు. కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిషన్ ఈ కమిటీని ఏర్పాటుచేసింది.

# చైనాపై సుంకాలు విధించవద్దు

### ట్రంప్‌కి 45 వాణిజ్య గ్రూపుల వినతి

వాషింగ్టన్ : చైనా నుంచి దిగుమతి చేసుకునే స్టీలు, అల్యూమినం వస్తువులపై విధించాలని నిర్ణయించిన సుంకాలను విధించవద్దని అమెరికాలో భారీ కంపెనీలకు చెందిన 45 వాణిజ్య సంఘాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి విజ్ఞప్తి చేశాయి. ఈ సుంకాలు విధించడంవల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు, వినిమయదారులకు హాని జరుగుతుందని ఆ గ్రూపులు హెచ్చరించాయి. ఈ మేరకు అన్ని గ్రూపులు కలిసి ట్రంప్‌కి లేఖ రాశాయి. అమెరికా దిగుమతులపై సుంకాలు విధించడంవల్ల ఆ దేశం వినిమయవస్తువుల ధరలను పెంచుతుందని, అప్పుడు మన దేశంలో ఉద్యోగాలు ఊడిపోతాయని, ఆర్థిక మార్కెట్లు కల్లోలానికి గురవుతాయని వాణిజ్య గ్రూపులు హెచ్చరించారు. వాణిజ్య విధానాలపైన ట్రంప్‌కి, వాణిజ్య గ్రూపులకు మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయి. దేశీయ పరిశ్రమను రక్షించేందుకుసుంకాల విధింపు అవసరమని ట్రంప్ వాదిస్తున్నారు. పారిశ్రామికరంగం సమర్థంగా పనిచేసేందుకు వ్యాపార వృద్ధికి వాణిజ్యవర్గాలతో కలిసి పనిచేయాలని సుంకాలు మాత్రం విధించవద్దని ఆ గ్రూపులు విజ్ఞప్తి చేశాయి. చైనా తన విధానాలను మార్చుకునేందుకు, వాణిజ్యవర్గాలతో కలసి పనిచేయాలని ఆ వర్గాలు కోరాయి. ఏకపక్షంగా సుంకాలు విధించినట్లయితే ఇతర దేశాలలోని వాణిజ్యవర్గాలతో తీవ్ర విభేదాలు వస్తాయని ఆ గ్రూపులు హెచ్చరించాయి.చైనా, ఐటీ కంపెనీలు, టెలికాం, వినిమయ వస్తువులపైన కూడా సుంకాలు విధించాలని ట్రంప్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటున్నది.

## గడ్డుకాలం (మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో 3.36 లక్షల హెక్టార్లలో తోటలు ఉన్నాయి. ఇక మామిడి దిగుబడి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు, చిత్తూరు, కడప కేంద్రాల నుంచి ఇతర ప్రాంతాలకు మామిడి ఎగుమతి అవుతోంది. మామిడి దిగుబడిలో ఉత్తరప్రదేశ్ దేశ:లోనే ప్రథమస్థానంలో ఉండగా, రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. వాస్తవానికి తోటలపరంగా చూస్తే ఏపీ నంబర్ వన్ స్థానంలో ఉంది. యూపీలో 2.64 లక్షల హెక్టార్లలో మామిడి తోటలుండగా, ఏపీలో 3.20 లక్షల హెక్టార్లలో తోటలు ఉన్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయియి.. ఇదిలావుండగా, ప్రస్తుతం టన్ను బంగినపల్లి ధర రూ.48 వేలుగా ఉంది. అయితే కాపు లేకపోవటం, ఉన్న కాయలు కోతకు రాలేదు. తమ కాయలు మార్కెట్‌కు వచ్చేంత వరకు ఇదే ధర ఉండకపోవచ్చని రైతులు చెబుతున్నారు. అన్ని పంటలకు ధరను నిర్ణయించే ప్రభుత్వం, మామిడి విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటం వల్లే తాము నష్టపోతున్నామని వారు వాపోతున్నారు.

**నున్న మార్కెట్ కుదేల్**

విజయవాడ సమీపంలోని నున్నలో ఉన్న ఆసియాలోనే పెద్దదైన మామిడి మార్కెట్ కుదేలవుంతోంది. ఏటా మార్కెట్‌లో వ్యాపారం తగ్గిపోతుండగా, వ్యాపారులు కూడా ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. సుమారు 23.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మార్కెట్‌లో 85 మంది వ్యాపారులు ఉన్నారు. వారిలో గత సంవత్సరం 50 మందే షాపులను ఓపెన్ చేయగా, ఈ ఏడాది 25 మంది కూడా వ్యాపారం చేసే అవకాశాలు కనిపించటంలేదు. గతంలో మార్కెట్ నుంచి ఏటా 30 వేల టన్నుల మామిడి మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. అలాగే రైతులు నేరుగా పూణే, ముంబై, చెన్నై, నాగపూర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ధర విషయంలో రైతులకు అన్యాయం జరుగుతుండటంతో నున్న మార్కెట్ నుంచి మామిడి ఎగుమతి క్రమంగా పడిపోతున్నాయి. గత సీజన్‌లో 25 వేల టన్నుల మేర ఎగుమతులు జరగ్గా, సుమారు రూ.40 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయి. 2010 నుంచి 2012 వరకు నున్న మార్కెట్‌లో సుమారు రూ.200 కోట్ల విలువైన మామిడి లావాదేవీలు జరగ్గా, 2016కు అది రూ.50 కోట్లకు పడిపోయింది. కాపు సరిగా లేకపోవటంతో ఈ ఏడాది వ్యాపారం మరింత మందగించే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కృష్ణా, ఖమ్మం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో లోకల్ మండీలను ఏర్పాటు చేయటం వల్ల కూడా మామిడి మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బయ్యర్లు నేరుగా అక్కడకే వెళ్లి కాయలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో కమీషన్ గోలను తాళలేక రైతులు కూడా స్థానికంగా ఉన్న మార్కెట్‌లోనే కాయలను విక్రయిస్తుండటంతో మార్కెట్ ఈ ఏడాది నెల రోజుల ఆలస్యంగా ఆరంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఉగాదికి వ్యాపారులు కనీసం దస్త్రం కూడా పెట్టకపోవటం గమనార్హం.

**విదేశీ ఎగుమతులు నిల్**

ఒకపుడు భారీగా విదేశాలకు మామిడికాయలు ఎగుమతవ్వగా, ఇపుడు అవి జీరోస్థాయికి చేరాయి. విజయవాడ సమీపంలోని గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో విదేశాలకు ఎగుమతి చేసేందుకు అనువైన సౌకర్యాలు ఉన్నప్పటికీ, నాణ్యతలేని కాయలు వల్ల విదేశాల్లో డిమాండు గణనీయంగా పడిపోయింది. విజయవాడ నుంచి హాంకాంగ్, మలేషియా, దుబాయ్, ఖతార్, లండన్, కువైట్ తదితర దేశాలకు 50 వేల టన్నుల వరకు మామిడి ఎగుమతి అయ్యేది. అలాంటిది దశాబ్దకాలంగా ఒక్కటంటే ఒక్క టన్ను కూడా మామిడి ఎగుమతులు జరగటంలేదు. వ్యాపారులు కొందరు చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి మామిడిని ఎగుమతి చేస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో ఎయిర్‌పోర్టు సౌకర్యం లేకపోవటంతో వ్యాపారులు విదేశీ ఎగుమతులపై దృష్టి సారించలేదు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి కార్గో సర్వీసులు అందుబాటులోకి రానున్నందున మామిడి ఎగుమతులపై దృష్టి సారిస్తే తప్ప రాష్ట్రంలో కాయలకు మంచి ధర లభించని పరిస్థితి నెలకొంది.

## అవిశ్వాసంలో డ్రామా..!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు డిమాండుతో ఏఐడీఎంకే ఎంపీలు ఆందోళన చేశారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ 30 సెకనుల వ్యవధిలోనే సభను 12 గంటల వరకూ వాయిదా వేశారు. వాస్తవానికి టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. సోమవారం దీనిపై లోక్‌సభలో చర్చ జరుగుతుందని అనుకున్నారు. సోమవారం వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కూడా అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చారు. అవిశ్వాస తీర్మానానికి ఇప్పటికే సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల సహా విపక్షాలు మద్దతు తెలిపాయి. ఈ స్థితిలో ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే వైసీపీ, టీడీపీ, టీఆర్‌ఎస్ అన్నాడీఎంకే సభ్యులు వివిధ డిమాండ్లతో ఆందోళన దిగారు. దీంతో సభను 12 గంటలకు వాయిదా వేశారు. గంట తర్వాత సభ ప్రారంభమయ్యాకా అదే పరిస్థితి నెలకొంది. కావేరీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే, రిజర్వేషన్ల పెంపు అంశంపై టీఆర్‌ఎస్ సభ్యులు, అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపాలని ఏపీ ఎంపీలు స్పీకర్ వెల్‌లోకి ప్రవేశించి నినాదాలు చేశారు. ఎంపీల ఆందోళన మధ్యే స్పీకర్ కాసేపు ప్రశ్నోత్త రాలు నిర్వహించారు.

అయినా ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని.. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు సభ్యులు వీలు కల్పించాలని స్పీకర్ కోరారు. కానీ ఎంపీలు వినిపించుకోలేదు. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేస్తు న్నట్లు స్పీకర్ ప్రకటించారు. అంతకుముందు అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. విపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఇదిలా ఉంటే, అరారియా, భగల్పూర్, దర్భాంగ్‌ల్లో ఇటీవల చోటు చేసుకున్న మతఘర్షణలపై ఆర్జేడీ ఎంపీ జేపీ యాదవ్ వాయిదా తీర్మానం ఇచ్చారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడుతూ, ఏపీ ఎంపీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంతో తమ ప్రభుత్వానికి ఎలాంటి భయం లేదని, సభ లోపల, బయట తమ ప్రభుత్వంపై విశ్వాసం ఉందని అన్నారు. ప్రత్యేక హోదా కోసం వైసీపీ, కాంగ్రెస్ ఆందోళన చేస్తున్న నేపథ్యంలోనే టీడీపీ ఎన్డీయే నుంచి బయటకు వెళ్లిందన్నారు. టీడీపీ ఎంపీ తోట నరసింహం మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి వైసీపీ డ్రామాలాడుతోందని ఆరోపించారు. సీపీఐ ఎంపీ డి.రాజా మాట్లాడుతూ ఇప్పటికే మోడీ సర్కారుపై ప్రజల్లో అవిశ్వాసం వ్యక్తమవుతోందని, ప్రస్తుతం సభలోనూ అవిశ్వాసం ప్రకటించే సమయం ఆసన్నమైందన్నారు. పార్లమెంటు ఆవరణలో అటు వైసీపీ, ఇటు టీడీపీ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ బృహన్నల వేషంలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి టీడీపీ ఎంపీల ఆందోళనకు మద్దతు తెలిపారు. శివసేన ఎంపీ అరవింద్ సావంత్ మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి మద్దతు ఇవ్వటం లేదని, అదే విధంగా అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేది లేదన్నారు. సభలో తటస్థ వైఖరితో ఉంటా మన్నారు. శిరోమణి అకాలీదళ్ ఎంపీ ప్రేమ్‌సింగ్ చందూ మాజ్ర మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా విషయాన్ని ఏకీభవిస్తామని, కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయబోమన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం కోరిన పార్టీలే సభను అడ్డుకుంటున్నాయని వైసీపీ, టీడీపీని తూర్పారబట్టారు. అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటు సాక్షిగా టీడీపీ రాజకీయ డ్రామాలాడుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ విమర్శించారు. రాజకీయ జిమ్మిక్కులు చేయటంలో చంద్రబాబు నాయుడు తనకు తానే సాటి అని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే ఇన్నాళ్లు తాము టీడీపీతో కలిసి ఉన్నామన్నారు. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం చర్చ రాకుండా ఏఐడీఎంకే అల్లరి చేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి ఏఐడీఎంకే చెంచాగిరి చేస్తోందని సమాజ్‌వాది పార్టీ ఎంపీ రామ్ యాదవ్ విమర్శించారు.

అటు రాజ్యసభలోనూ ఆందోళనలు కొనసాగాయి. వివిధ అంశాలపై విపక్ష పార్టీలు ఆందోళన చేయడంతో సభ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటించారు. 'పార్లమెంటు నవ్వుల పాలవుతోంది. అదే పనిగా వాయిదాలతో సభ కార్యక్రమాలు నిలిచిపోవటంతో ఎవరికి ప్రయోజనం, దేశానికి ప్రయోజనం లేదు. కనీసం పార్లమెంటుకూ ప్రయోజనం లేదు. అన్ని అంశాలపై చర్చకు అనుమతిస్తామంటున్నాం. చర్చకు సిద్ధమని ప్రభుత్వం చెబుతోంది. మరి విపక్షాల సమస్య ఏమిటో. ప్రజలు ఇప్పటికే విమర్శిస్తున్నారు. ఈ పరిస్థితి ఇంకెంత కాలం' అని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు.

**వైసీపీ మళ్లీ నోటీసు**

అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనందున వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మళ్లీ అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చారు. మంగళవారం అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపాలని డిమాండు చేశారు. ఈ అంశంపై చర్చ జరిగే వరకూ నోటీసులు జారీ చేస్తూనే ఉంటామని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

## రద్దయిన నోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రీసైక్లింగ్ చేయడం లేదని స్పష్టం చేసిన ఆర్బీఐ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెషీన్ల ద్వారా చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి, ముద్దలు చేసి ఇటుకల్లా మార్చుతున్నట్లు వివరించింది. రద్దు సమయంలో ఉన్న కరెన్సీలో 99 శాతం ఈ పెద్ద నోట్లే ఉండగా, వీటి విలువ రూ.15.44 లక్షల కోట్లుగా ఉందని, నిరుడు జూన్ 30 నాటికి డిపాజిట్ల రూపంలో రూ.15.28 లక్షల కోట్లు వచ్చాయని బ్యాంకు తెలిపింది.

## ఎవరికీ దక్కని వేలకోట్లు

(మొదటిపేజీ తరువాయి)

చాలా డిపాజిట్లు మృతి చెందిన ఖాతాదారులవి, అనేక బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉన్నవారివేనని ఆర్బీఐ మాజీ ఉన్నతాధికారి బి. చరణ్ వ్యాఖ్యానించారు. ఇలాంటి వాటిలో బినామీ ఖాతాలూ ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలోని సెక్షన్-26 ప్రకారం పదేం డ్లుగా ఎలాంటి లావాదేవీలు జరపని ఖాతాల వివరా లను అన్ని బ్యాంకులు ఆర్బీఐకి సమర్పించాలి. అయితే సెక్షన్-26ఏ ప్రకారం పదేండ్లు దాటినా కూడా ఖాతా రద్దు కాకుండా క్రియాశీలకంగా ఉండటంతో పాటు ఖాతా దారు లేదా నామినీలకు బ్యాంకింగ్ కంపెనీలు డబ్బును తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకింగ్ చట్టం-2012 ప్రకారం సుదీర్ఘ లావాదేవీలు జరపని బ్యాంక్ ఖాతాల్లోని డబ్బును డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌లో నిల్వ చేస్తారు. యాక్సిస్, డీసీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఇండస్ ఇండ్, కోటక్ మహీంద్ర, ఎస్‌బ్యాంక్ వంటి ఏడు ప్రయివేటు బ్యాంకుల్లో రూ. 824 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉండగా, పన్నెండు ఇతర ప్రయివేటు బ్యాంకుల్లో రూ. 592 కోట్లు ఉన్నాయి. దీంతో ప్రయివేటు బ్యాంకుల్లో మొత్తం రూ. 1,416 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డబ్బు పోగై ఉందని ఆర్బీఐ తెలిపింది. ఇందులో ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 476 కోట్లతో, కొటక్ మహీంద్ర బ్యాంక్ రూ. 151 కోట్లతో అత్యధికంగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు కలిగి ఉన్నాయి. కాగా, విదేశీ బ్యాంకుల్లో రూ. 332 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉండగా హెచ్‌ఎస్‌బీసీలోనే రూ. 105 కోట్లు ఉండటం గమనార్హం.

## 43% అర్హులు

(మొదటిపేజీ తరువాయి)

మంది అభ్యర్థులు సాధించారు. 84 మంది అభ్యర్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో వుంచామనానరు. 2013లో నిర్వహించిన టెట్ ఫలితాల కంటే..2017 టెట్‌లో 35శాతం మంది అత్యధికంగా అర్హత సాధించారు. 150 మార్కులకు నిర్వహిచించిన టెట్‌లో ఓసీలు-60 బీసీ-50, ఎస్సీ-40శాతం చొప్పున మార్కులు సాధించిన వారిని అర్హులుగా నిర్ణయించారు.

**టెట్ పరీక్షల ఫలితాల వివరాలివీ..**

ఏపీ టెట్ పేపర్-1(ఎస్జీటీ)లో హిందీ, కన్నడ, తెలుగు, ఉర్దూ, ఒరియా, తమిళ్ మీడియాలకు చెందిన అభ్యర్థులు మొత్తంగా 1,73,861 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. వారిలో 1,00,638(57.88శాతం) మంది అర్హత సాధించారు.

పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)లో అన్ని మాధ్యమాల నుంచి మొత్తంగా 97,649 మంది పరీక్షలు రాశారు.వారిలో 36,389 మంది(37.26శాతం) అర్హత సాధించారు. పేపర్-2 (సోషల్ స్టడీస్)లో మొత్తం 84,085 మంది పరీక్ష రాయగా, వారిలో 32,138 మంది(38.22శాతం) అర్హత సాధించారు.

పేపర్-3(లాంగ్వేజెస్) ఫలితాల్లో భాగంగా 58,525 మంది పరీక్షలు రాశారు.ఇందులో 24,931 మంది(42.60శాతం) అర్హత సాధించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక 2014లో టెట్ కమ్ టీఆర్టీ పద్ధతిలో డీఎస్సీ నిర్వహించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం టెట్ నిర్వహణ తప్పనిసరని కేంద్ర ప్రభుత్వం సూచించడంతో ఈ విడత టెట్‌ను వేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టెట్ ఫలితాల ప్రక్రియ ముగియడంతో డీఎస్సీ, మోడల్ టీచర్ల పోస్టుల భర్తీ ప్రకటనకు ప్రభుత్వం నిమగ్నమైంది.ఈ ఫలితాల విడుదలలో రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావుతోపాటు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

టెట్‌లో అత్యధికంగా స్కోరింగ్ మార్కులు:

టెట్ పేపర్-1(ఎస్జీటీ) తెలుగు మీడియంలో 150 మార్కులకుగాను 141 మార్కులు, ఉర్దూ మీడియం-127, ఒరియా-116, తమిళ్-104, కన్నడ-103, హిందీ-98 అత్యధిక మార్కులు వచ్చాయి.

పేపర్-2 (మ్యాథ్స్ అండ్ సైన్స్) తెలుగు మీడియంలో 150 మార్కులకుగాను తెలుగు మీడియంలో 132(150) మార్కుల వరకూ సాధించారు. ఉర్దూ మీడియం-120, తమిళ్-99, హిందీ-91 అత్యధికంగా మార్కులు వచ్చాయి. పేపర్-2 (సోషల్ స్టడీస్)లో తెలుగు మీడియం-117, ఉర్దూ-108, ఒరియా-101, తమిళ్-97, సంస్కృతం-92 విభాగాలలో అత్యధికంగా మార్కులు వచ్చాయి.

త్వరలో డీఎస్సీ: మంత్రి గంటా

రాష్ట్రంలో త్వరలో ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష(డీఎస్సీ)ని నిర్వహిస్తామని మానవ వనరులశాఖ మంత్రి గంట శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం హోటల్ గేట్‌వేలో నిర్వహించిన విలేకరుల మసావేశంలో ఆయన మాట్లాడుతూ, దాదాపు 10వేలకుపైగా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఆర్థిక శాఖకు నివేదిక అందజేశామని, అనుమతిరాగే డీఎస్సీ ప్రకటన్ని విడుదల చేస్తామని చెప్పారు.ఈ వారంలోనే డీఎస్సీ ప్రకటన వచ్చే అవకాశముందని తెలిపారు.తొలిసారిగా టెట్ పరీక్షలను ఆన్‌లైన్లో విజయవంతంగా నిర్వహించామన్నారు.

## మీ వాళ్లే లీక్ చేశారు (మొదటిపేజీ తరువాయి)

ఆశ్చర్యకరంగా గతంలో తన వెనక చంద్రబాబు ఉన్నాడంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపించారని గుర్తుచేశారు. వాస్తవానికి వారిద్దరూ చెప్పేది తప్పు, తన వెనక ప్రజలు ఉన్నారని అన్నారు. బీజేపీతో రాజీ కుదిరే అవకాశం లేదని పవన్ స్పష్టం చేశారు. ఏపీ ప్రజలు ఆ పార్టీ తీరుపై చాలా ఆగ్రహంగా ఉన్నారు. వారు ఆ పార్టీని విశ్వసించడం లేదు. హోదా డిమాండ్ కేవలం భావోద్వేగాలతో ముడిపడినదే కాదు అవసరం కూడా. ఉత్తరప్రదేశ్‌లో బుందేల్‌ఖండ్‌లోని మాదిరిగా ఏపీలోని ఏడు జిల్లాలు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. ఈ జిల్లాల్లో పరిస్థితులు చక్కదిద్దాలంటే కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రావాల్సి ఉంది. మేము సొంత దారిలో వెళుతున్నాం. ఎన్నికల సమయంలో కూటమి అవసరమా లేక సొంతంగా పోటీ చేయాలా అనేది నిర్ణయిస్తాం అని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు వివిధ రాష్ట్రాల్లోని స్థానిక సమస్యలను అర్థం చేసుకోలేకపోయాయని ఆయన చెప్పారు. థర్డ్ ఫ్రంట్ పురుడు పోసుకునే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలు సైతం జాతీయ సమస్యలపై ఆలోచించాలన్నారు. తాను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశానని.. థర్డ్‌ఫ్రంట్ గురించి ఆయనకు చెప్పానని చెప్పారు. పాలనలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు కేసీఆర్‌కు పదిలో ఎన్ని పాయింట్లు ఇస్తారని ప్రశ్నించగా.. చంద్రబాబు 2.5 మార్కులు, కేసీఆర్‌కు 6 మార్కులు వేస్తానంటూ బదులిచ్చారు.

## ఖలీదాజియా బెయిల్ రద్దు

ఢాకా : బంగ్లాదేశ్‌లో ప్రతిపక్షనేత ఖలీదా జియా బెయిలును సుప్రీంకోర్టు సోమవారం రద్దు చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాలక, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సంక్షోభం మరింత తీవ్రతరమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. హైకోర్టు ఖలీదాజియాను బెయిలుపై విడుదల చేసేందుకు ఇచ్చిన అనుమతిని సుప్రీంకోర్టు నిలిపివేసింది. దీంతో ఖలీదా న్యాయవాదులు ప్రధానమంత్రి షేక్‌హసీనా చేస్తున్న ప్రచారంలో భాగమే ఈ బెయిలు రద్దు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ న్యాయచరిత్రలో ఇది అసాధారణమైన చర్య అని వారు పేర్కొన్నారు.

## తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే పెళ్లి కానుకలను ప్రకటించింది. వివాహం రోజునే ఆ కానుకలను అందజేయనున్నట్లు అసెంబ్లీలో ఇటీవలే సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే చట్టం ప్రకారం పెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికే ఈ కానుకలను అందజేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే ఇందుకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి షరతులను ప్రభుత్వం ప్రకటించలేదు.

చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి పెళ్లి కానుక పొందాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే. అందులో భాగంగానే ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

విశాలాంధ్ర



## 24న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ దాసరి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్పలు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, వారి హక్కులు హరించబడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు గత మూడేళ్ళలో జరిగిన అనేక ఉదాహరణలే నిదర్శమన్నారు. వీటిపై చర్చించి దళిత హక్కుల పరిరక్షణ కోసం చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఈ కార్యవర్గం చర్చిస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఈసమావేశానికి హాజరవుతారని, కార్యవర్గసభ్యులంతా సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

## జంబ్లింగ్‌తో గందరగోళం : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్ విధానం వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆయా మండలాల పరిధిలోని టీచర్లకు అదే మండల పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో విధులు కేటాయించేవారని పేర్కొన్నారు. విద్యా రంగంలో నూతన విధానాలను అమలు చేస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంతోనే ఇలాంటి గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. విద్యా రంగంలో నూతన విధానాలను అమలు చేస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల్లో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు.




## గేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు సీఎం అభినందన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2018 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన పునుకొల్లు భువన్‌చంద్రను సీఎం చంద్రబాబు అభినందించారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం తిప్పనగుంట గ్రామానికి చెందిన భువన్ చంద్ర మద్రాస్ ఐఐటీలో బీటెక్ పూర్తి చేసి గేట్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. సోమవారం భువన్‌చంద్ర తన తల్లిదండ్రులతో కల్సి సీఎం చంద్రబాబుని సచివాలయంలో కలిశారు. చంద్రబాబు భువన్‌చంద్రకు బుద్ధుని మెమెంటోను అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఆలిండియాస్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించడం తెలుగువారందరికీ గర్వకారణమని కొనియాడారు. ప్రభుత్వ ప్రోత్సాహం ఎల్లవేళలా వుంటుందని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టించాలని భువన్‌చంద్రను సీఎం ఆశీర్వదించారు. నీ ఆశయమేంటని సీఎం ప్రశ్నించగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తనకు ఆదర్శమని, డిఆర్‌డీఓ ఇస్రోలో చేరి పరిశోధనలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు.

## లాలూచీ రాజకీయాలు చేసేవారికి

# డిపాజిట్లు కూడా రావు

- ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ ప్లీనరీలో చెప్పింది
- బీజేపీకి అభ్యంతరం ఏమిటి?
- జగన్ కుట్రలను ప్రజలకు వివరించండి
- కేంద్రంపై ధైర్యంగా పోరాడండి
- ఎంపీలు, నేతలతో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-అమరావతి : లాలూచీ రాజకీయాలు చేసే ద్రోహులు ఎవరికీ డిపాజిట్లు కూడా రావని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తప్పుడు పనులు చేసే వారు దొంగాట ఆడుతున్నారని, రెడ్ హ్యాండెడ్‌గా ఫొటోలతో సహా దొరికి పోయారంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై సీఎం విరుచుకుపడ్డారు.

జగన్ కుట్ర రాజకీయాల గురించి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలంటూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో వ్యాఖ్యానించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సోమవారం పార్లమెంట్‌లో అవిశ్వాసం గురించి మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. ఏపీకి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల మద్దతు తీసుకుంటున్నామని, జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందన్నారు. మన హక్కుల కోసం ఎంపీలు వీరోచితంగా పోరాడుతున్నారు. ఇది కీలక సమయం అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరూ అధైర్య పడవద్దు అంటూ ఎంపీలకు ధైర్యం చెప్పారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని కాంగ్రెస్ కూడా ప్లీనరీలో చెప్పిందని, అటువంటప్పుడు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటో చెప్పాలన్నారు. కేసుల మాఫీ కోసం జగన్ అప్పుడు కాంగ్రెస్‌తో లాలూచీ పడి, ఇప్పుడు బీజేపీతో లాలుచీ పడుతున్నాడన్నారు. ఒక పార్టీతో అవిశ్వాసం పెట్టించడం, మరో పార్టీతో గొడవ చేయించడం, సభ వాయిదా వేసుకుని పోవాలని చూస్తున్నారు. ఇది లాలూచీ రాజకీయాలకు పరాకాష్టని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర పెద్దలను పదే పదే కలవడం, పీఎంవోలో విజయసాయిరెడ్డి తిష్టవేయడం ఇంతకన్నా రుజువులు ఏమీ కావాలి. వీళ్ల కేసుల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతారా అని వైసీపీపై విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ యూ టర్న్ ఎందుకు తీసుకున్నాడో అందరికీ తెలుసునని, నాలుగేళ్లుగా విమర్శించని వ్యక్తి ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నాడని అన్నారు. అన్ని నియోజక వర్గాలలో బైక్ ర్యాలీలు, ఇంటింటికీ ప్రచారం చేయాలని పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. విభజన చట్టంలోని 19 అంశాలు, పార్లమెంట్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయి వచ్చే వరకు కేంద్రం చేయూత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండు చేశారు.

**ఎంపీలు, నేతల వ్యాఖ్యలు**

ఈ కాన్ఫరెన్స్‌లో లోక్‌సభ పక్ష నేత తోట నరసింహం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వివిధ పార్టీల అభిప్రాయాలను ముఖ్యమంత్రికి వివరించారు. తృణముల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ, ఇతర పార్టీ నేతలు మద్దతు ప్రకటించారని చెప్పారు. ఎంపీ గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ప్రాంతీయ పార్టీ వైదొలగడం జాతీయ స్థాయిలో కుదుపు సృష్టించిందన్నారు. ఈ పరిస్థితుల్లో అవసరమైతే జాతీయ రాజకీయాలలో క్రియాశీలకంగా మారతానని చెప్పడం సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు.

నల్లగట్ల స్వామిదాస్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిధులు రాబట్టడం కోసం ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నాలను, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ టీడీపీ అవిశ్వాసం తీర్మానంపై, ఇతర పార్టీల ఎంపీల సంతకాలు కూడా తీసుకుని వేరే నోటీసులు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ సభ సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించమని వేరే పార్టీలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ కుట్ర రాజకీయాల గురించి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కాపుల రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ ఇంత వరకు చర్యలు తీసుకోని విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు.

వర్ల రామయ్య మాట్లాడుతూ కేంద్రం వైఖరికి నిరసనగా అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద మానవ హారాలు ఏర్పాటు చేస్తామని పేర్కొనగా ముఖ్యమంత్రి అందుకు ఆమోదం తెలిపారు. ఎమ్మెల్సీ సునీత మాట్లాడుతూ కేంద్రం నుంచి వైదొలగడం, మంత్రుల రాజీనామాల పట్ల దళితులు, ముస్లింలలో మంచి స్పందన వచ్చిందన్నారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ సోమవారం ఒక ఆంగ్ల దినపత్రికలో ఏపీకి జరిగిన అన్యాయంపై టీడీపీ పోరాటం గురించి పేర్కొన్నట్లు చెప్పారు. వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మాట్లాడుతూ వెయ్యి మోటార్ సైకిళ్లతో బైకు ర్యాలీలు నిర్వహించినట్లుగా తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రతి నియోజకవర్గంలో సైకిల్ ర్యాలీలు, బైక్ యాత్రలు చేపట్టాలన్నారు.

**చంద్రబాబును కలిసిన ముస్లింలు**

బీజేపీకి రాం రాం చెప్పినందుకు సీఎం చంద్రబాబు నాయుడును ముస్లిం నేతలు పలువురు ఉండవల్లిలోని ఇంటి వద్ద కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు కేంద్రంపై పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రికి, పార్టీ ఎంపీలకు సంఘీభావం తెలిపారు.

## వ్యవసాయ కుటుంబంలో వికసించిన ఆణిముత్యం

విశాలాంధ్ర-పెళ్లకూరు : 2018 గేట్ ఫలితాలలో గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ (గేట్) పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన సన్నకారు వ్యవసాయ కుటుంబంలో ఆరూరు అంకయ్య, సుగుణమ్మలకు జన్మించిన సంతానంలో ఒకరైన ఆరూరు అఖిల్ పేద కుటుంబంలో జన్మించి జాతీయ స్థాయిలో 18 లక్షల మంది గేట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ పరీక్షల్లో పాల్గొనగా అందులో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన నెల్లూరు జిల్లా వాసి 55వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని వారి తల్లిదండ్రులు తెలిపారు. ఇటువంటి ఫలితాల్లో మా పేద కుటుంబానికి చెందిన వ్యక్తి ఈ ఫలితంను సాధించడం మేదస్సుకు తారతమ్యాలు లేవని ఆ గ్రామ ప్రజలు కొనియాడారు.

తెలివితేటలు, ధనిక, పేదరికంకు సంబంధిచినవి కావని, చదువులో పిల్లలు క్రమశిక్షణతో నడుచుకొని విద్యను అభ్యసిస్తే మరెన్నో సాధించవచ్చని ఆరూర్ అఖిల్‌ను యుక్తవయస్సు విద్యార్థులందరు ఆదర్శంగా తీసుకొని అఖిల్ కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని మండల ప్రజలు, మండల విద్యాశాఖాధికారి, తహశీల్దార్ కోరారు. 55వ ర్యాంకు రావడం సంతోషంగా ఉందని అఖిల్ తల్లిదండ్రులు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థినీవిద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి వారి ఆనందాన్ని తోటి గ్రామస్థులతో పాలుపంచుకున్నారు.

# వాహనాలను తగలబెట్టిన మావోయిస్టులు

## కాంట్రాక్టర్ కుమారుడి హత్య





విశాలాంధ్ర-చింతూరు/చర్ల : చత్తీస్‌గడ్ బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు పంజా విసిరారు. తుంనార్ కోయిట్ పల్లి మధ్య రోడ్డు నిర్మాణంలో ఉన్న వాహనాలను తగులబెట్టారు. దీంతోపాటు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ కుమారుడు విశాల్ కుమార్‌ను హత్య చేశారు. గత నెలలో రోడ్డు పనులను ఆపాలని మావోయిస్టులు హెచ్చరించారు. దీనిలో భాగంగా గత నెలలో బస్తర్ జిల్లా మారుడూమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన మంత్రి సడక్ నిర్మాణ యోజనలో భాగంగా రోడ్డు నిర్మాణంలో ఉన్న 10 ట్రాక్టర్లను, మరికొన్ని ఇతర వాహనాలను తగులబెట్టారు. మొదకాపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భటపల్లి సంకనపల్లి రహదారి మధ్యలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం కోసం పని చేస్తున్న ఒక మిక్సర్, 9 ట్రాక్టర్లను తగులబెట్టారు. ఈ ఘటనలో 100 మందికి పైగా మావోయిస్టులు పూర్తి స్థాయి ఆయుధాలతో పాల్గొన్నట్లు సమాచారం. అయితే గత నెలలో బస్తర్ జిల్లాలో సుమారు 20కి పైగా వాహనాలను తగలబెట్టడంతోపాటు రోడ్డు నిర్మాణ కార్మికులను పని చేయవద్దని హెచ్చరించారు. అలాగే సుకుమా జిల్లా ఎర్రబోరు పరిధిలోని జాతీయ రహదారి 30 వద్ద టిప్పర్ వాహనాన్ని తీసుకెళ్లి తగలబెట్టి రోడ్డు నిర్మాణం ఆపేయాలని డిమాండు చేశారు. అయినా మరోసారి రోడ్డు నిర్మాణం కొనసాగడంతో మావోయిస్టులు ఈ చర్యకు దిగినట్లు సమాచారం.

**10 మంది మావోయిస్టుల లొంగుబాటు**

చత్తీస్‌గడ్ కొండగావ్ పరిధిలోని ధనోరా పోలీస్ స్టేషన్‌లో 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు

## పవన్‌కు ఇక్కడేం పని : కేఈ

విశాలాంధ్ర-అమరావతి : ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో రచ్చ జరుగుతుంటే.. ఇక్కడ రచ్చ చేయడానికి పవన్ కళ్యాణ్ ఆలోచన చేస్తున్నారని, అవిశ్వాసానికి మద్దతు కూడగడతానన్న పవన్ ఢిల్లీకి పోకుండా ఇక్కడ ఏమి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి కే.ఈ క్రిష్ణమూర్తి ప్రశ్నించారు. సోమవారం తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. మూడు నెలలకోసారి వచ్చి బురద జల్లుడు కార్యక్రమాలు చేయడం సరికాదన్నారు. తమిళనాడులో ఉండే సినీ తరహా రాజకీయాలు ఏపీలో చెల్లవని, ఏపీలో అదే తరహా రాజకీయాలు చేద్దామనుకుని గతంలో చిరంజీవి బొక్క బోర్లా పడ్డారని మంత్రి గుర్తు చేశారు. పోలవరంలో జరిగిన అవినీతేంటో పవన్ చెప్పాలన్నారు. ఆధారాలతో అవినీతి ఆరోపణలను రుజువు చేస్తే చర్యలు తీసుకునే ధైర్యం మా ప్రభుత్వానికి ఉందన్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ మా మీద విమర్శలు చేయడం సరికాదని మంత్రి హితవు పలికారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ముఖ్యమంత్రి కుటుంబం, టీడీపీ పై పవన్ చేసిన వ్యాఖ్యలతో ఆయన ఇమేజ్ నాశనం అయిందన్నారు. ఏ మాత్రమైనా ఇంగితం ఉంటే పవన్ అలా మాట్లాడి ఉండే వారు కాదన్నారు. అధికారంలో లేని రాజకీయ నిరుద్యోగుల దగ్గర సలహాలు తీసుకుంటే పవన్ కళ్యాణే నష్టపోతారన్నారు. ప్రత్యేకహోదా కోసం దీక్ష చేస్తానన్న పవన్ ఇప్పుడు మాట మారుస్తున్నారని మంత్రి విమర్శించారు. రాష్ట్రానికి ఏమైనా మేలు చేయాలనుకుంటే ఢిల్లీ వెళ్లి చేయాలని మంత్రి సూచించారు. నిధులు ఇవ్వడం లేదు కాబట్టే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చామని, రాష్ట్రాన్ని మరింత ఇబ్బంది పెట్టేలా కేంద్రం వ్యవహరించే అవకాశం లేకపోలేదన్నారు.



## హోదా నిరసన అడ్డుకున్న పోలీసులు

### ఆందోళన తీవ్రతరం చేస్తామన్న నేతలు

విశాలాంధ్ర అమరావతి : హోదా సాధనే లక్ష్యంగా నిరసన తెలియ చేసేందుకు ప్రయత్నించిన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో విజయవాడ ఐవి ప్యాలస్ లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆయా పార్టీల నేతలు రోడ్డు పైకి వచ్చి నిరసన తెలియ చేసేందుకు ప్రయత్నించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ రోడ్డుమీద నిరసన తెలియచేస్తూ ర్యాలీ చేసే ప్రయత్నం చేశారు. అయితే ర్యాలీతో ఇబ్బందులు ఎదురవుతాయని పోలీసులు వారించి ఆందోళన చేస్తున్న నాయకులను వెనక్కి తిప్పి పంపించారు. అయితే ఈ క్రమంలో పోలీసులకు నిరసన తలపెట్టిన వారికి నడుమ స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇరు పక్షాల సమన్వయంతో ఆందోళన సద్దుమణిగింది. కాగా ఇంతలోనే ఐవి ప్యాలెస్ ముందే ప్రధాని చిత్రం ఉన్న పేపర్లు తగల బెట్టేందుకు ప్రయత్నించగా మరోసారి పోలీసులు అడ్డుకున్నారు. దీనితో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన వారు మోడీ చిత్రమున్న పేపర్లు చించివేసి ప్రత్యేక హోదా సాధించి తీరుతామని నినదించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతో హోదా సాధించే వరకు పోరాటం చేసి తీరుతామని స్పష్టంచేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన విద్యార్థి యువజన ,మహిళ ,ప్రజా సంఘాలతో పాటు ఇతర సంఘాలను కలుపుకొని విభజన హామిల సాధన సమితి నేతృత్వంలో ఉద్యమం ఉద్ధృతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ , సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు , వైసీపీ నాయకులు పార్థసారథి , మల్లాది విష్ణు , ఇతర సంఘాల , రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఇప్పుడు ఆ లడ్డూలే కావాలంటున్నారు

### మంత్రి అమర్‌నాథ్ రెడ్డి

విశాలాంధ్ర-అమరావతి : ప్రత్యేక హోదా గురించి సీఎం చంద్రబాబు కేంద్రాన్ని అడిగితే.. ప్రత్యేక హోదా ఏ రాష్ట్రాలకు ఇవ్వడంలేదని, ఇచ్చిన రాష్ట్రాలకు కాలపరిమతి అయిపోతే ఇంకా పొడిగించేది లేదని కేంద్రం స్పష్టం చేసిందని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీకి హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని అనాడు కేంద్రం స్పష్టం చేసిందని, అందుకు చంద్రబాబు కూడా అంగీకరించారని అన్నారు. అయితే హోదా ఉన్నరాష్ట్రాల కాలపరిమితి అయిపోయినా పొడిగించడంతో ఏపీకి కూడా హోదా ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు. ఇదే విషయమై జనసేన అధినేత పవన్ చాలా సార్లు మాట్లాడారని, ప్రత్యేక ప్యాకేజీ పాచిపోయిన లడ్డూలని విమర్శించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. సోమవారం పవన్ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మళ్లీ పాచిపోయిన లడ్డూలే కావాలని మాట్లాడుతున్నారంటే... ఆయనతో ఎవరైనా అలా మాట్లాడిస్తున్నారా? లేక పవన్ అభిప్రాయమా అన్నది ప్రజలు అర్థం చేసుకోవాలని అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పవన్ వెనుక బీజేపీయే అలా మాట్లాడిస్తోందని స్పష్టంగా అర్థమవుతోందని మంత్రి అన్నారు. తమిళనాడులో బీజేపీ ఏ రాజకీయం చేస్తోందో అలానే ఏపీలో కూడా చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనబడుతోందన్నారు. హోదా విషయంలో పవన్ ఎందుకు యూ టర్న్ తీసుకున్నారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం రాకుండా బీజేపీ కుట్ర చేస్తోందని, వాళ్లకు అనుకూల పార్టీలతో కావేరి అంశాల్లాంటివి తీసుకువచ్చి సభను వాయిదా వేయిస్తోందని మంత్రి అమర్‌నాథ్ రెడ్డి ఆరోపించారు. అసలు నేతలకు మార్కులు వేసే స్థాయి పవన్‌కు ఉందా అని ప్రశ్నించారు. పవన్ వెనక బీజేపీ ఉందన్న వాస్తవం వెల్లడయిందని, పాచిపోయిన లడ్డూ అని చెప్పిన పవన్ ఇప్పుడు హోదా కంటే ప్యాకేజీ ఇస్తేనే బాగుంటుందని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసిందని, ఇదంతా బీజేపీ ఆడిస్తున్న నాటకమని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి వ్యాఖ్యానించారు

# ఐటీ సంస్థకు భూకేటాయింపులు రద్దు చేయాలి

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ డిమాండు

### భూములను పరిశీలించిన సీపీఐ నేతలు





విశాలాంధ్ర-పి.ఎంపాలెం(విశాఖపట్నం) : విశాఖ జిల్లా మధురవాడ సర్వే నెం.309లో 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కారుచౌకగా ఐటీ కంపెనీలకు కట్టబెట్టే చర్యను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఐ బృందం డిమాండు చేసింది. సోమవారం ఉదయం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి నేతృత్వంలోని బృందం సభ్యులు మధురవాడలో కారుచౌకగా కట్టబెడుతున్న ప్రభుత్వ భూములను పరిశీలించింది. అనంతరం అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. జేవీ సత్యనారాయణమూర్తి మీడియాతో మాట్లాడుతూ రూ. 400కోట్ల విలువైన 40 ఎకరాల ప్రభుత్వ భూమిని రూ. 13కోట్లకు ప్రభుత్వం కట్టబెట్టడం వెనుక కోట్లాది రూపాయలు చేతులు మారాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండు చేశారు. ఫ్రాన్క్లిన్ టెంపుల్‌టన్ ఇన్వెస్ట్‌మెంట్‌కు 25 ఎకరాలు, ఇన్నోవాకు 15 ఎకరాలు, ఎకర రూ. 32లక్షలు చొప్పున కారుచౌకగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కట్టబెట్టడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏజే స్టాలిన్ మాట్లాడుతూ ఐటీ కంపెనీల శంకుస్థాపనకు ఈ నెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో విశాఖలో అత్యంత ఖరీదైన రుషికొండ ప్రాంతంలో ఉన్న కొండపై సముద్రానికి అభిముఖంగా ఉండే ఈ భూమి కారుచౌకగా కట్టబెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అవినీతి ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. కేటాయించిన భూమిలో నిబంధనలు పాటిం చకపోయినా, భూమిని వెనకకు తీసుకోకూడదనే నిబంధన అనేక అనుమానాలకు దారి తీస్తున్నదని, ఆ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రికి, ఆయన తనయుడు లోకేష్‌కు ఉందని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి మరుపిల్లి పైడిరాజు మాట్లాడుతూ పరిశ్రమలకు , కంపెనీలకు ప్రభుత్వ భూముల కేటాయింపునకు తాము వ్యతిరేకం కాదని, నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా భూములను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, నగర సహాయ కార్య దర్శులు సత్యాంజనేయ, జేడి నాయుడు, సన్నిపాత్రుడు, వేళాంగిణిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీసెట్ నోటిఫికేషన్ విడుదల

### మార్చి 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఏపీసెట్ 2018 అర్హత పరీక్ష నోటిఫికేషన్‌ను సోమవారం విడుదలైంది. మార్చి 26వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపిసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు తెలిపారు. మే 2వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరిస్తారని చెప్పారు. రూ 1000 అపరాధ రుసుంతో మే 10వ తేదీ వరకు, రూ 2 వేల అపరాధ రుసుంతో మే 21వ తేదీ వరకు, రూ 5 వేల అపరాధ రుసుంతో జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. రూ 5 వేలు అపరాధ రుసుంతో పరీక్షకు దరఖాస్తు చేసిన వారికి విశాఖపట్నంలో మాత్రమే పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ఏపిసెట్ పరీక్షను జూలై 1న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో రూ 1000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి, బీసీ అభ్యర్థులు రూ 800, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్, విహెచ్ అభ్యర్థులు రూ 500 దరఖాస్తు రుసుంగా చెల్లించాలి. దరఖాస్తు రుసుంను ఆన్‌లైన్‌లో డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ విధానంలో చెల్లించవచ్చును. పరీక్ష ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు మొదటి పేపర్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండో పేపరు పరీక్ష జరుగుతుందన్నారు. మొదటి పేపరులో 50 ప్రశ్నలకు వంద మార్కులు, రెండో పేపరులో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయన్నారు. పూర్తి సమాచారం కోసం ఏయూ వెబ్‌సైట్, ఏపిసెట్ వెబ్‌సైట www.apset.net.in, www.andhrauniversity.edu.inలను సందర్శించాలన్నారు. సిలబస్, నమూనా ప్రశ్నాపత్రాలు తదితర వివరాలు ఏయూ వెబ్‌సైట్, ఏపిసెట్ వెబ్‌సైట్‌లలో పొందుపరచడం జరిగిందన్నారు.

# అనంతలో కొరియన్ ఆటోమొబైల్ క్లస్టర్

### కియా అనుబంధ సంస్థ హ్యూండై మొబిస్‌తో ఏపీ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీలో కొరియాకు చెందిన 16 ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కియా అనుబంధ సంస్థలైన 'హ్యూండై మొబిస్'తో ప్రాథమిక అవగాహనా ఒప్పందం కుదు ర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ అరోకియా రాజ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిశ్రమల మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో ఒప్పందపత్రంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లా డుతూ తమ విధానాలతో నిబద్ధతతో కూడిన పెట్టుబడిదారులు వచ్చి రూ.24,600 కోట్లు (3.7 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టారని అభినందించారు. అనంత`పురము నుంచి నెల్లూరు వరకు చిత్తూరు మీదుగా ఆటో కారిడార్‌గా తయా రవుతుందన్నారు. రూ.4,790 కోట్ల పెట్టుబడులతో కొరియన్ కంపెనీలు 6.,583 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకోసం అనంతపురము జిల్లా ఎర్ర మంచి దగ్గర తాము దక్షిణ కొరియా క్లస్టర్ కు 534 ఎకరాలు, గుడిపల్లిలో 71 ఎకరాలు, , అమ్మవారిపల్లి గ్రామం దగ్గర 131 ఎకరాలు కేటా యించామని సీఎం వివరించారు. తాను గతనెలలోనే కియా మోటార్స్ ఫ్రేమ్ వర్క్ వ్యవస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నానని, ఇప్పుడు ప్రాజెక్టు ప్రాంగణంలో పురోగతిని చూశాక చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఆటోమొబైల్ అనుబంధ సంస్థలతో కలసి ఏర్పాటు చేస్తున్న ఈ క్లస్టర్ భారత్‌లోనే అతి పెద్ద ఎఫ్‌డీఐగా అభివర్ణిం చారు. రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగ అభివృద్ధి వాతావరణం ఏర్పడుతుందని, ఎంఎస్ఎంఈ యూనిట్లు గణనీయంగా పెరుగుతున్నాయని, దీంతో ఏపీకి సకారాత్మక బ్రాండ్ ఇమేజి వస్తుందని అన్నారు. తాము మూడేళ్ల క్రితం దేశంలో అత్యుత్తమమైన ఆటో మొబైల్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. అనంతపురము బెంగళూరు విమానాశ్ర యానికి దగ్గరగా ఉందని, త్వరలో ఓర్వకల్లులో ఒక విమానాశ్రయం రానుందని, ఇప్పటికే తిరుపతి, పుట్టపర్తిలో విమానాశ్రయాలున్నాయని తెలిపారు. కియా మోటార్స్ సహా ఆంధ్రప్రదేశ్‌లో దిగ్గజ కంపెనీలైన ఇసుజు మోటార్స్-అనుబంధ సంస్థలు, హీరో మోటార్స్, అశోక్ లేల్యాండ్, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ కంపెనీలు తమ ఉత్పాదక యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయని, తెలిపారు. దక్షిణ కొరియాకు, ఆంధ్రప్రదేశ్ కు జనాభా రీత్యా, భౌగోళిక రీత్యా సారూప్యత, ఉన్నాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ' ఏ సమయంలో ఎటువంటి సమస్య వచ్చినా వెను వెంటనే పరిష్కరించడానికి నేను సిద్ధం' అని ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు.

ఈనెల ముగిసే లోగానే తొలి కారును విడుదల చేయాలని, ఏటా 3 లక్షల వాహనాలను ఉత్పత్తి చేయాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి జి. సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. నరేంద్రమోడీ మూడున్నరేళ్ల పాలనలో సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు మితిమీరాయి. ఎప్పుడైతే ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లుతుందో అది అంతిమంగా నియంతృత్వానికి దారితీస్తుంది. పాలనాపరంగా అధికార పగ్గాలన్నీ ఒకే వ్యక్తిచేతిలో కేంద్రీకృతమవుతాయి. అడ్డూ ఆపులేకుండా సాగిపోతున్న అవినీతితో సహా తన దుశ్చర్యలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజాస్వామ్య విలువలతో సహా ఏ సంస్థనైనా నాశనం చేయడానికి తన పాలనను శాశ్వతీకరించేందుకు మోడీ ఎంత దూరమైనా వెళతాడని.. ఎంతకైనా బరితెగించడానికి వెనుకాడబోడని సామన్య ప్రజలు సైతం గుర్తెరగడం మొదలైంది. 2017లో భారీ కుంభకోణాలు జరగడం ఒకసారి గుర్తుచేసుకోవాలి. ఈ కుంభకోణాలు, మోసాలకు పాల్పడిన పాలకులకు సన్నిహితంగావుండే వ్యక్తులు జాతీయ బ్యాంకులనుండి వేలకోట్ల రూపాయలు రుణాలుగా దోచుకున్న తరువాత వారు దేశం విడిచి పారిపోవడానికి ప్రధానమంత్రితోసహా కేంద్రంలో కీలకమంత్రి పదవులు అలంకరించినవారు దోహదం చేశారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ద్వితీయార్ధంలో ఈ కుంభకోణాలు, మోసాలన్నీ చర్చకు వస్తాయని, మోడీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడతారని భావించారు. మొదటి ఏడు రోజులూ ఎట్టి కార్యకలాపాలు జరుగకుండా సమావేశాల సమయం వృధా అయిపోయింది. ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరును గమనించినట్లయితే, సమావేశాల మిగతా రోజులు కూడా వృధాగా గడిచిపోతాయని స్పష్టమవుతోంది. ప్రభుత్వ దుశ్చర్యలను ప్రతిపక్షాలు బహిర్గతం చేయడానికి అవకాశం కల్పించకుండా అణచివేసేందుకు అన్ని నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘిస్తున్నది. నిన్నటి వరకు మిత్రులుగా వున్న వారు, ఎఐడిఎంకే వంటి పార్టీల ద్వారా మొదటి వారం రోజుల పార్లమెంట్ సమావేశాల విఘాతానికి పాలక పార్టీయే కారణమైంది. అసహేతుకంగా పార్టీ సమావేశాల విచ్ఛిన్నానికి ప్రతిపక్ష పార్టీలను నిందించింది. వాస్తవంగా అన్ని దుశ్చర్యలకు, తప్పులకు గత ప్రభుత్వాలను నిందించడం మోడీ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. అందుకు వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఉదంతం ఒక ఉదాహరణ. జాతీయం చేసిన బ్యాంకులను ప్రత్యేకించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)నూ రూ.20 వేల కోట్ల మేరకు మోసగించిన అనంతరం నీరవ్ మోడీ ఆయన మేనమామ మెహల్ చోక్సీ దేశం విడిచి పారిపోయారు. పీఎన్‌బీ కుంభకోణం 2011లోనే ప్రారంభమైందని అందువల్ల ప్రస్తుత ప్రభుత్వ బాధ్యత ఏమీ లేదని, చెప్పుకోవడానికి తొలుత ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ తరువాత దోచుకున్న ధనంలో 80 శాతం 2016-17లో తీసుకున్నట్లు అది కూడా నకిలీ లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్‌ఓయు)ల ద్వారా తీసుకున్నారని ఆ తరువాత ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పుడు పార్లమెంట్‌లో ఈ బ్యాంకు మోసకారులపై చర్చను నివారించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులను మోసం చేసి, విదేశాలకు పారిపోయిన వారికి ప్రభుత్వం పూర్తి వత్తాసు వున్నట్లు స్పష్టమవుతోంది. ఫ్రాన్స్‌తో రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం కూడా ఇటువంటిదే. "జాతీయ ప్రయోజనం" ఇమిడి వున్న దృష్ట్యా ఫ్రెంచి కంపెనీకి చెల్లించిన విమాన ధరను పార్లమెంటుకు వెల్లడించకూడదని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సెలవిచ్చారు. విమాన ధరను వెల్లడించకపోవడానికి జాతీయ ప్రయోజనాలు ఏమి ఇమిడి వున్నాయో ఎవరికీ అర్థం కానిది. దీనికి సంబంధించిన లోగుట్టు ఏలికలకే ఎరుక. రాఫెల్ విమాన ఒప్పందంలో భారీగా అవినీతి ఇమిడి వున్నదని స్పష్టమవుతోంది ఇది అవినీతి రహిత పాలన మోడీ నినాదంలోని చిత్తశుద్ధి లేమి పట్టిస్తోంది. యుపిఏ-2 ప్రభుత్వ హయాంలోనే రాఫెల్ ఒప్పందంపై సంప్రదింపులు జరిగాయి. ఒక్కో విమాన ధర రూ. 5 కోట్లుగా ఖరారు చేసుకున్నారు. అయితే మోడీ ప్యారిస్ వెళ్ళి, తిరిగి సంప్రదింపులు జరిపి ఇంతకుముందు ఖరారు చేసుకున్న విమాన ధరకు మూడు రెట్లు అధికంగా చెల్లించడానికి అంగీకరించి, ఒప్పందం కుదుర్చుకోవడంలో చిదంబర రహస్యం ఏమిటో ఏలికలే దేశ ప్రజలకు చెప్పవలసిన అవసరం... బాధ్యత ఉంది. ధర పెంచడం ఎవరికో భారీగా ముడుపులు చెల్లించడానికే అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయలు కమీషన్‌గా పొందే వ్యక్తి ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా ఈ ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞాన భాగాన్ని ప్రభుత్వ రంగ కంపెనీ హెచ్‌ఏఎల్‌కు అప్పగించాలని యూపిఏ ప్రభుత్వం భావించింది. దాన్ని కూడా మోడీ ప్రభుత్వం రద్దు చేసి, తన ఫ్రాన్స్ పర్యటనకు కొద్ది రోజులు ముందు నెలకొల్పిన అనిల్ అంబానీ కంపెనీకి కాంట్రాక్టును అప్పగించింది. ఇది కూడా ఈ ఒప్పందంలో అవినీతి ఇమిడివుందన్న విషయాన్ని స్పష్టపరుస్తోంది. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా మోడీ ప్రభుత్వం ఎందుకు పలాయనం చిత్తగిస్తోందన్నది మౌన ప్రశ్న. కార్పొరేట్ సంస్థలకు రాయితీలపై రాయితీలు కురిపిస్తూ 2014 లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఆర్థికంగా సహాయపడినందుకు మోడీ వారి రుణం తీర్చుకోవడం మాత్రమే కాక 2019లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తనకు సహాయపడేందుకు ధనం కూడబెట్టేవిధంగా వారికి అవకాశం కల్పిస్తున్నట్లు రూఢీ అవుతోంది. బ్యాంకుల దోపిడీ, రాఫెల్ ఒప్పందం కొద్ది నెలలుగా వెలుగులోకి వస్తున్న ఇతర కుంభకోణాల గురించి ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కార్పొరేట్ల ఆధిపత్యంలోని మీడియా కూడా అవినీతిపై ప్రశ్నలు లేవనెత్తడాన్ని ప్రారంభించింది. దానితో ప్రజాస్వామ్య హక్కుల అణచివేతకు, పార్లమెంటు కార్యక్రమాల విఘాతానికి పాలకపార్టీ బడిగుడుతున్నది. మోడీ ప్రభుత్వాన్ని ప్రత్యేకించి ప్రధానమంత్రి నిజరూపాన్ని బహిర్గతంచేయడానికి ఈ అంశాలన్నింటినీ ప్రజల దృష్టికి తీసుకువెళ్ళి, ఇటీవల ముంబైలో రైతాంగం చేపట్టిన మహా ఉద్యమ స్ఫూర్తితో యావత్ లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు, కాముకులు స్పందించి, ఆందోళన బాట పట్టడం తక్షణ కర్తవ్యం.

## చురక

చంద్రబాబు మోడీతోని
చేసుకున్న బాసలు
అమలుగాక అభివృద్ధికి
ఆరుతున్న ఆశలు

కేంద్రంతో తెగదెంపులు
కొట్లాటకు పరుగులు
కలిసి వచ్చే పార్టీలతో
కదిలితేనే మెరుగులు

– వేల్పుల నారాయణ

విశ్లేషణ

# ఆహా! ఆర్కే ఏమి పలుకు



జి. ఓబులేసు

'అహం బ్రహ్మాస్మి' శీర్షికన ఉగాదినాడు ఆర్కే వినిపించిన కొత్త పలుకు అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో అన్నట్లు సాగింది.ఎన్‌డిఎ నుండి తెలుగుదేశం బయటకి రావటానికి కమల నాధుల అహంకారమే కారణం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమకు అన్యాయం జరిగింది అందుకు బిజెపి, నరేంద్ర మోడీనే కారణమని నమ్ముతున్నారని, దీన్ని చంద్రబాబు గ్రహించినందునే ఎన్‌డిఎ నుండి వ్యూహాత్మకంగా తన ఇద్దరు మంత్రులను రాజీనామా చేయించారని ఆనక జగన్ పార్టీ ప్రవేశపెట్టే అవిశ్వాసానికి మద్దతు, ఆ పై తేరుకొని తానే స్వయంగా అవిశ్వాసం పెట్టారని.ఇదంతా బాబు రాజకీయ దురంధతకు, అపార అనుభవ జ్ఞానానికి సంకేతంగా ఆర్కేకు అనిపించింది.

పవన్ కళ్యాణ్ 4 సంవత్సరాలుగా బాబుతో సఖ్యతగా, సన్నిహితంగా ఉంటూ వచ్చి ఉన్నట్లుండి విమర్శించడం, దారినపోయే దానయ్య ఏది పడితే అది మాట్లాడినట్లు అనిపించింది. ఎందుకో ఈ కాంట్రవర్సీ.గుడ్డి సమర్ధన.

ఎన్‌డిఎ నుండి చంద్రబాబు బయటకి వస్తే మోడీ తెంపరితనం, స్వయంకృతాపరాధం రాష్ట్ర ప్రయోజనాల కోసం అవిశ్రాంత పోరు సల్పుతున్న పాలనాధక్షుడు, అందునా జాతీయ స్థాయిలో అపారమైన సంబంధాలు కలిగి చక్రం తిప్పగల్గిన చంద్రబాబును వదులుకోవడమంటే కమల నాధులను ఏమనాలి? మోడీ స్థానంలో ఎవ్వరున్నా బాబును వదలుకునేవారుకాదని తెగ బాధపడిపోతున్నారు.

గడచిన ఎన్నికల్లో, ఆ తదనంతరం నిన్న మొన్నటి వరకు బాబుతో చెలిమిగా ఉండి బాబు చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటి నెరవేరనందున బాబుతో విభేదించి పవన్ కళ్యాణ్ సభ పెడితే జగన్‌ను సంతృప్తి పరచడానికి, మోడీ కోర్కె మేరకు గవర్నర్ ఆడిస్తే ఆడేవాడిగా పవన్ కళ్యాణ్ కన్పిస్తున్నాడు. ఇది ఏమి లాజిక్కో అర్కేకే తెలియాలి. పవన్‌కళ్యాణ్ గుంటూరులో జరిపిన జనసేన ఆవిర్భావ సభలో సంధించిన ప్రశ్నలకు అవాక్కు అయిన చంద్రబాబు, టీడీపీ శ్రేణులు ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ఎదురు దాడి రాజకీయాలకు పూనుకున్నారు. పవన్‌కళ్యాణ్ సభ ముగిసిన తరువాత సమయం అయిపోయినా, స్థలం లేకపోయినా బాబు టెలికాన్ఫరెన్స్ మాటలను ఇతర వార్తలను కిల్ చేసి మరీ ప్రచురించారంటేనే ప్రత్యామ్నాయ రాజకీయాలను శిఖండిలా ఎలా అడ్డుకుంటున్నారో అర్ధమవుతుంది.

పవన్ కళ్యాణ్‌ను గతంలో ఇదే చంద్రబాబు మంత్రివర్గం లోని మంత్రులు హైదరాబాద్ నుండి గన్నవరం విమానా శ్రయానికి ప్రత్యేక విమానంలో, అటు నుండి బాబు ఇంటికి తెచ్చి ఏకాంతంగా గంటల తరబడి మాట్లాడుకోలేదా? పసందైన విందు భోజనాలతో తుళ్ళి కేరింతలు కొట్టుకోలేదా? అప్పుడు ఒకరిపై ఒకరికి ఉన్న పరస్పర విశ్వాసం, నమ్మకం. రోజులు గడిచేకొద్దీ బాబు వైఖరిలో మార్పు రాకపోగా మూడు వాగ్దానాలు-ఆరు అబద్ధాల పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసహనం, అసంతృప్తి జనసేన పవన్‌కళ్యాణ్‌ను స్వతంత్ర రాజకీయ శక్తిగా నిలబడటానికి భూమిక ఏర్పాటు చేసింది. ఈ వాస్తవాన్ని గమనించకుండా ఎండా కాలంలో వచ్చిన వడగండ్ల వాన ఉపయోగం లేకుండా పోయిందనే ఆర్కే ఈసడింపు మాటలతో బాబుపై ఉన్న అప ప్రధ,వ్యతిరేకత తొలగిపోదు.

తన తప్పిదాలను అసమర్ధతలను, కప్పదాట్లను మీడియా సహకారంతో నెట్టుకురావడం బాబుకు అలవాటే. వాస్తవాలు తెలిసి కూడా రాజకీయ పదవీ స్వార్ధంతో అయినదానికి కానిదానికి తాళం వేస్తూ గొంతుచించుకొని అరిచే పరివారం సాయంతో బయట పడాలనే విద్యలో బాబు మొదటి నుండి దిట్ట. కాకపోతే ఈ సారి వయస్సు మీద పడినందున, మోడీ-షాల కుతంత్రాలతో ఎప్పుడు ఏమి ప్రమాదం సంభవిస్తుందోననే భయం వల్ల తొందరపడి ఎన్‌డిఎ నుండి బయటపడితే జగన్ ఆ కూటమిలో దూరితే నా పదవి గల్లంతు అవుతుందనే బెంగతో కుడితిలో పడ్డ ఎలుకలా గింజు కుంటున్నాడు. అందుకే ఈ గందరగోళం అంతా.

రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హెూదా 5 సంవత్సరాలు ఇవ్వాలని పార్లమెంట్‌లో నాటి ప్రధాని 2014 ఫిబ్రవరి 20న విస్పష్ట ప్రకటన చేశారు.కాదు 10సంవత్సరాలు కావాలని బిజెపి మాటల మాంత్రికుడు వెంకయ్య ఉద్ఘాటన చేశారు.15 సంవత్సరాలు ఉండాలని బాబు ఆక్రోశించారు. ఏమైంది? రాజధాని నిర్మాణానికి జరిపిన హెూమగుండం, మహాయజ్ఞం నాడు నరేంద్రమోడీని బాబు ప్రసన్నం చేసుకునేటప్పుడు ప్రత్యేక ప్యాకేజీని అడిగాడు. పత్రికల్లో కథనాలు వచ్చి ప్రతిపక్షాలు ఎత్తిచూపితే నాలుక కర్చుకుని హెూదా అడగబోయి ప్యాకేజీ అని పొరపాటు దొర్లింది అని జనాన్ని నమ్మించారు.రెండు సార్లు అసెంబ్లీలో హెూదా కావాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయించారు.తర్వాత 14వ ఆర్థిక సంఘం చెప్పకపోయినా అభ్యంతరం పెట్టిందని వారు-వీరూ(బీజేపీ-టీడీపీ) నిన్నటి వరకు నమ్మించారు. హోదా సంజీవని కాదు, ముగిసిన అధ్యాయం అన్నారు. హోదాకు మించిన ప్యాకేజీ ఇస్తామని బీజేపీ, తెస్తామని టీడీపీ నమ్మ బలికారు. ప్యాకేజీ మాట తెచ్చినందుకు వెంకయ్యకు సన్మానాలు చేసారు.4 సంవత్సరాల విలువైన కాలం కరిగిపోయింది. 4 బడ్జెట్‌లలోనూ రాష్ట్రానికి అదనంగా ఒరిగిందేమీలేదు. అఖిలపక్షం వేయమని అంతా మొత్తుకున్నారు. ఎన్‌డిఎ నుంచి బయటకు రమ్మని డిమాండ్ చేశారు. కేంద్రంతో విభేదించకుండానే పనులు చెక్కబెట్టడము. రాష్ట్రానికి లబ్ది చేకూర్చటమే తెలివైన వారు చేసే పని అని, ఆ పనిని చంద్రబాబు నాయుడు చేస్తున్నాడని నాడు కొత్తపలుకుల ద్వారా నీతి బోధలు చేశారు.

ఇప్పుడేమో తప్పంతా కమలనాధులదే. తెలుగుదేశాధీశులది ఇసుమంతైనా లేదు అని కథనాలు రాస్తున్నారు.

నిజంగా చంద్రబాబుకు రాష్ట్రం, రాష్ట్ర ప్రజలే ముఖ్యమైతే అడుగడుగునా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీతో 4 సంవత్సరాలు ఇంత పొద్దికగా ఎలా కాపురం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో,ఎన్‌డిఎ భాగస్వామి హోదాలో 29సార్లు ప్రధానిని కలిసినా ఉలుకూ పలుకూ లేదని పైగా అవమానించారని నేడు తెగ బాధపడిపోతున్నారు. తెలుగువారి ఆత్మగౌరవ పోరాటం నేను చేస్తూ ఉంటే నన్ను బలహీన పర్చడానికి ఢిల్లీ పెద్దలకు ఊతమివ్వడానికి ఇక్కడ ప్రతిపక్షాలు, పవన్‌కళ్యాణ్ అలజడులు లేపుతారా అని బాబు వాపోతున్నారు.

నిజంగానే చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా కోసమై ఏదో పోరాటం చేస్తున్నట్లు మీడియా ద్వారా జనాన్ని నమ్మించడానికి తెగ ఆరాటపడిపోతున్నారు. 'ఏరా కింద పద్దావు అంటే అబ్బే అదేమి లేదు ఇదో లగుల్' అన్నాడట వెనుకటికి ఒకడు. ఫిబ్రవరిలో బడ్జెట్ చూచిన వెంటనే బాబు ఎన్‌డిఎ నుండి బయటకు రావాలి. రాలేదు. అరుణ్‌జైట్లీ వెటకారంగా,నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినప్పుడైనా రావాలి. అలా జరగలేదు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీలు మినహా మిగతా పక్షాలన్నీ ఐక్యమై ఆందోళనలు నిర్వహిస్తుండటం, వామపక్షాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ ఫిబ్రవరి 8న జయప్రదం కావడంతో ప్రత్యేక ప్యాకేజీ కాదు, హెూదా కావాలని ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని సేఫ్ జోన్‌లోకి ప్రవేశించాలని పావులు కదపడంలో భాగంగా ముందుగా మంత్రుల రాజీనామాలు. తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టే అవిశ్వాసానికి మద్దతు ప్రకటన వచ్చింది. ఆ వెంటనే అఫెన్స్ ఈజ్ ది బెస్ట్, బ్యాటిల్ ఫర్ ది డిఫెన్స్ అని ఎన్‌డి ఎ నుండి నిష్క్రమణ, ఆ వెనువెంటనే తానే స్వయంగా అవిశ్వాస తీర్మానం ఇవ్వడం జరిగింది. ఇచ్చిన గంటలోనే 16 పార్టీలు మద్దతు ఇచ్చాయి. చూశారా? తెలుగుదేశం పార్టీపై జాతీయ స్థాయిలో ఉన్న నమ్మకం అని తన అనుకూల మీడియా ఉదరగొట్టడం జరుగుతున్నది.

కేంద్రంలో, రాష్ట్రంలో విచిత్రమైన, నీతి బాహ్యమైన పాలన జరుగుతున్నది. ఏకపక్ష నిరంకుశ విధానాలను, ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ప్రజలకు ఉంటుంది. దురదృష్టవశాత్తు మోడీకి, బాబుకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదు. విశ్వాసం అంతకన్నా లేదు. మోడీ విధానాలను ప్రశ్నిస్తే, జాతి వ్యతిరేకం, దేశద్రోహం అవుతుంది. చంద్రబాబు పద్ధతులను ప్రశ్నిస్తే వీరికి ఏమీ తెలియదు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం,10 సంవత్సరాల ముఖ్యమంత్రి అనుభవం, 10 సంవత్సరాల ప్రతిపక్ష నాయకుడి అనుభవం, దేశంలోనే సీనియర్ రాజకీయ వేత్తను అయిన నన్ను ప్రశ్నిస్తారా? అని విరుచుకుపడతారు. ఎదురు దాడికి పూను కొంటున్నారు. జనం కోసం నేను 18గంటలు పనిచేస్తూ ఉంటే కావాలని విమర్శిస్తారా. సమర్ధించక అని తన తప్పును, చేతగానితనాన్ని ఇతరులపై నెడతాడు. ఈ వికృత పాలనను జనరంజక పాలనగా నమ్మించి ప్రత్యామ్నాయ రాజకీయాలు తెరపైకి రాకుండా చూడాలనేది అర్కే ఉద్దేశ్యంగా కన్పిస్తుంది. అందులో భాగమే ఆర్కే కొత్తపలుకు ద్వారా పవన్‌కళ్యాణ్‌పై విరుచుకుపడటం అందుకు అద్దం పడుతున్నది.

> ఎవ్వరు ముందు, ఎవ్వరు వెనుక అవిశ్వాస తీర్మానం ఇచ్చారు అనే మీమాంసతోను, ప్రతిపక్షానికి చిత్తశుద్ధి ఉందా లేదా అనే కుశంకలతో సంబంధం లేకుండానే రాష్ట్రానికి అన్యాయం జరిగిందనే అంశంపైన, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదన్న వాటిపై, ప్రత్యేక తరగతి హోదాపై నేడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతూ ఉంది. రాష్ట్రాన్ని విడగొట్టిన అత్యున్నత వేదిక పార్లమెంట్ నేడు ఈ చర్చకు వేదికైంది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. ఇక్కడ పాలకుడు వివేకంతో ఆలోచించాలి. రాష్ట్రానికి మోసం చేసిన, అన్యాయం చేసిన మోడీ-షాలను ఎండగట్టడానికి అఖిలపక్ష సమావేశం తక్షణమే జరిపి ఢిల్లీకి రాయబారం తీసుకెళ్ళాలి.

ఎవ్వరు ముందు, ఎవ్వరు వెనుక అవిశ్వాస తీర్మానం ఇచ్చారు అనే మీమాంసతోను, ప్రతిపక్షానికి చిత్తశుద్ధి ఉందా లేదా అనే కుశంకలతో సంబంధం లేకుండానే రాష్ట్రానికి అన్యాయం జరిగిందనే అంశంపైన, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదన్న వాటిపై, ప్రత్యేక తరగతి హోదాపై నేడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతూ ఉంది. రాష్ట్రాన్ని విడగొట్టిన అత్యున్నత వేదిక పార్లమెంట్ నేడు ఈ చర్చకు వేదికైంది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. ఇక్కడ పాలకుడు వివేకంతో ఆలోచించాలి. రాష్ట్రానికి మోసం చేసిన, అన్యాయం చేసిన మోడీ-షాలను ఎండగట్టడానికి అఖిలపక్ష సమావేశం తక్షణమే జరిపి ఢిల్లీకి రాయబారం తీసుకెళ్ళాలి. ఇప్పటికే మద్దతు ప్రకటించిన పార్టీలన్నింటినీ ఎకతాటికిపైకి తేవాలి. చంద్రబాబుకు ఓట్లు, సీట్లు అధికారం తప్ప ఇతర అంశాలు సరిగ్గా తలకెక్కడంలేదు. ఆర్కే ఇక్కడే బాబుకు తలంటి స్నానం చేయాలి. ఆర్కే ఆ పని చేయకుండా బాబు ఆపసోపాలను పోరాట ఘట్టాలుగా వర్ణించి చిత్రించి ప్రజలను గందరగోళపరుస్తున్నారు.

వ్యాస రచయిత : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

# 'ఫన్'చాంగు భళా...!

బి.బాబు బహదూర్

కొలవలు కట్టేశారు. చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. ఒంటిపూట బడులు మొదలెట్టారు. సాయంత్రం ఆటల్లో పిల్లల కోలాహలం... చెరువుల్లో తామర పూలు కోసిన ఆడపిల్లల ముఖాల్లో ఆనందం. ఆవు దూడలు, కుక్క పిల్లలతో పిల్లగాళ్ల కేరింతలు... ఏడూళ్ల సూరిగాడికి ఒక్కసారిగా చిన్నతనం గుర్తుకొచ్చింది.

"నిజంగా బాల్యం ఎంత గొప్పది"? మనసులో అనుకున్నాడు. ముల్లుగర్ర తీసి ఊళ్లోకి బయలుదేరాడు. వాకాలయ్య అప్పుడే కల్లు బిందె దించాడు. పది మంది బల్లమీద కూర్చున్నారు. ఒక్కొక్కరికే కల్లు లోటా అందిస్తున్నాడు. సూరిగాడూ వెళ్లాడు.

"ఏమండి.. ఓ లోటా పోయనా"? వాకాలయ్య అడిగాడు.

"వద్దులే" సూరిగాడు అడ్డంగా తలూపాడు. జేబులో సిగరెట్టు తీసి వెలిగించాడు. ఇంతలో తీన్‌మార్ దప్పుల మోత మోగుతోంది. అటువైపు అందరూ చూశారు. జగన్ పార్టీవోళ్లు గంతులేస్తున్నారు. వాకాలయ్య పాక దగ్గరకి వచ్చారు. అందరికీ లడ్డూలు పంచారు.

"ఏమిటీ విశేషం"? సూరిగాడు అడిగాడు.

"వచ్చే ఎన్నికల్లో మా పార్టీకి 135 సీట్లు వస్తాయంట, వీరారెడ్డి సంబరపడిపోయాడు.

"ఎవరు చెప్పారు"? సూరిగాడు ప్రశ్న

"పంచాగం, ప్రమాణ స్వీకారం డేటు కూడా ఫిక్సయింది. వచ్చే అక్టోబర్‌కు అన్ని సమస్యలూ తీరిపోతాయి. ఇక మన సీఎం జగనన్నే". వీరారెడ్డి గోచి ఎగగట్టాడు. సూరిగాడు నవ్వుకున్నాడు.

పదండి పదండి ఊరంతా పంచాలి... హడావిడిగా వీరారెడ్డి తన మనుషులతో వెళ్లిపోయాడు.

"సీఎం కుర్చీ కోసం ఆయన మొహంవాచిపోయాడు. ఎప్పుడు ఎలక్షన్‌లు వస్తాయా? ఎప్పుడు గెలుస్తామా? ఒకటే ఆలోచన... పాపం పంచాగం నిజమని ప్రమాణ స్వీకారానికి రిహల్స్ కూడా చేస్తాడేమో" వాకాలయ్య అనగానే కల్లుబాబులందరూ పకాలున నవ్వారు.

"వీడు ఆరడగుల బుల్లెట్టు...వీడు ధైర్యం విసిరిన రాకెట్టూ" పాట మైకులో మోగిపోతోంది. రిక్షా ముందు పవనిజం టీషర్టుల్లో కుర్రోళ్లు చిందులేస్తున్నారు. గులాంలు చల్లుకుంటున్నారు. వాళ్లు స్వీట్లు తీసుకొచ్చారు. సూరిగాడి చేతిలో మైసూర్ పాక్ పెట్టారు.

"ఏరా హీరో...ఏంటీ కథ"?

"పవనన్నకు రాజయోగం ఉందంట" వెనక్కి ముందుకు ఊగుతూ చెప్పాడా కుర్రోడు.

"ఎప్పుడొస్తాదో" సూరిగాడు రెట్టించాడు.

"ఏమో.. ఎప్పుడైనా వస్తాది, ఆయన ఎక్కడుంటే అక్కడ జనసునామీ" మళ్లీ వెనక్కి ముందుకు ఊగాడు.

ఎవరు చెప్పారు? సూరిగాడు

"పంచాంగం" గంతులేస్తూ ఆ కుర్రోడు వెళ్లిపోయాడు.

"వీళ్లన్నకీ జనం ఉరకలేశారు. ఓట్లు, సీట్లే రాలేదు" మళ్లీ వాకాలయ్య కామెంట్...

ఏడూళ్ల సూరిగాడు

కల్లుబాబులు గొల్లున నవ్వారు.

"రాష్ట్రం కోసం పదవులు త్యాగం చేసిన టీడీపీ జిందాబాద్.. మొక్కవోని ధైర్యంలో ముందుకు పోతున్న సీఎం జిందాబాద్... ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు" స్లోగన్స్ మిన్నంటాయి. యెర్నేనీ సీతయ్య చకచకా నడుస్తున్నాడు. టీడీపీ కార్యకర్తలు అరుస్తున్నారు. పాకలోకి వచ్చారు. అందరికీ జిలేబీలు పంచారు.

"ఏం సీతయ్య ఏంటీ హడావిడి"? సూరిగాడు అడిగాడు.

"కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా, పవన్ నిందలేసినా, జగన్‌తో బీజేపీ జట్టు కట్టినా... ఈ ఒడిదుడుకులన్నీ ఎన్నాళ్లో ఉండవ్. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుంది. ఈ సారి లోకేష్ బాబు సీఎం కావటం తథ్యం. బాబు ప్రధాని అవుతారు". సీతయ్య మేకపోతు గాంభీర్యం ప్రకటించాడు.

నిజమేనా? సూరిగాడు అడిగాడు.

"పంచాంగం సాక్షిగా అక్షర సత్యం" సీతయ్య గంభీరంగా



ప్రత్యేక హోదా కోసం పార్లమెంటు లో రాజీలేని పోరాటం చేస్తున్న టీడీపీ ఎంపీలకి మీ నిండు ఆశీస్సులు అందించాలి. సూరిగాడి చేతులు పట్టుకుని "వస్తా" అంటూ సీతయ్య వెళ్లిపోయాడు.

నాలుగేళ్లు కళ్లు మూసుకుని ఇప్పుడు ప్రత్యేక హోదా అంటూ కళ్లు తెరిచాడు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారు. చర్చకు రాకుండా సభను అడ్డుకుంటారు. వీళ్ల డ్రామాలు ఎవరికి తెలీదు. అప్పుడు ప్యాకేజీకి ఒప్పుకుని రాష్ట్రాన్ని దెబ్బతీశారు. ఇప్పుడేదో పోరాటం చేస్తున్నట్టు గోల చేస్తున్నారు. వీళ్ల పని పట్టటానికి జనం ఎదురు చూస్తున్నారన్న సంగతి తెలిసే... ఈ హడావిడి, వాకాలయ్య మళ్లీ అందుకున్నాడు. కల్లుబాబులు మరోసారి గొల్లున నవ్వారు. "భారత్ మాతాకీ జై... నరేంద్ర మోడీజీ జిందాబాద్" నలుగురు కాషాయ బ్యాచ్ పాకలోకి వచ్చారు. అందరికీ రసగుల్లలిచ్చారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది. మోడీజీ మరో ఐదేళ్ల ప్రధానిగా ఉంటారు". కాషాయవాలా ఇకిలించాడు.

ఏంటీ పంచాంగం చెప్పిందా? సూరిగాడు అడిగాడు.

"అరె మీకెలా తెలిసింది? ఆశ్చర్యంగా చూశాడు కాషాయవాలా

"ఆకాశవాణి చెప్పింది" సూరిగాడు నేల చూశాడు.

"ఔను.. దేవతలూ ఆనందపరవశులవుతున్నారు". ఈ సారి బ్రహ్మాండమైన అచ్చేదిన్ గ్యారెంటీ, కాషాయవాలా ఊగిపోయాడు. కమలానికి ఓటేస్తే బ్యాంకు ఎకౌంట్‌ల్లో లక్షలే లక్షలు... గుర్తుంచుకోండి", అని చకచక వెళ్లిపోయాడు.

ఎందుకు గుర్తుంచుకోం.. ప్రతి బ్యాంకులో పదిహేను లక్షలు జమ చేస్తానన్నాడు. నోట్లు రద్దు చేసి జనాన్ని రోడ్డు పాలు చేశాడు. రాజధాని శంకుస్థాపనకు వచ్చి గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చాడు. పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తానని హామీ ఇచ్చాడు. నమ్మించి మోసగించటమే నరేంద్ర మోడీ నైజం.. ఈ దగాను తప్పనిసరిగా గుర్తు పెట్టుకుంటాం... వాకాలయ్య ముఖం ఎర్రబడింది. కల్లుబాబులు నవ్వలేదు.

"నిజమే ఈ సారి చూద్దాం" కల్లుబాబులు పిడికిలి బిగించారు.

అసలూ పంచాంగాలేంటీ? ఎవడు డబ్బులిస్తే వాడికే అనుకూల పంచాగం వినిపిస్తారా? జనంలో ఈ పార్టీలంటే అసహం పుడుతుంటే...వీళ్లకే అధికారం వస్తుందని ఎలా చెబుతారు? చివరికి పంచాంగం అంటే కూడా రోత పుడుతోంది. తనలో తాను సూరిగాడు తిట్టుకున్నాడు.

## వి-మెయిల్

# ఇసుక లారీల ప్రమాదాలకు అంతం లేదా?

"జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక లారీల ప్రమాదాలు నిత్యం పెరిగిపోతుండడంతో వాహనదారులు ప్రధాన రహదారి మీదకు రావాలంటేనే జంకుతున్నారు. జిల్లాలోని కాళేశ్వరం క్వారీ నుంచి ఇసుక లారీల ద్వారా హైదరాబాద్‌కి తరలివెళ్తుంది. నిత్యం సుమారు ఐదువేల లారీలు ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఇసుక లారీల డ్రైవర్లు మద్యం సేవించడం, ఓవర్ టేకింగ్ చేయడం, మితిమీరిన వేగంతో నడపడం వల్ల రోడ్డు మీద వెళ్లే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వారం రోజుల క్రితం మోరంచపల్లి గ్రామంలో బైక్‌పై వెళ్తున్న ప్రైవేట్ అధ్యాపకుడి దంపతుల మీదికి లారీ దూసుకువెళ్లడంతో అధ్యాపకుడు రవీందర్ ప్రాణాలు కోల్పోగా, భార్య చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ 'కోమా'లోకి వెళ్లింది. లారీలను నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, కాలేజీ విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు పది గంటల పాటు ధర్నా చేయడంతో సుమారు 20 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు జోక్యం చేసుకుని మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామనడంతో ధర్నా విరమించారు. తాజాగా గణపురం మండలం కుందయ్యపల్లి గ్రామం వద్ద రోడ్డుపై వెళ్తున్న బిల్ల మల్లారెడ్డి అనే పేద రైతుపై ఆదివారం రాత్రి ఇసుకలారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించారు. వేరే వ్యక్తికి కూడా గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారం రోజుల లోపే రెండు ప్రమాదాలు జరిగి ఇరువురు మరణించడం మూలాన ఇసుక లారీలను నిలిపివేయాలని మళ్లీ ధర్నాకు ఉపక్రమించారు. ఆవేశంతో ప్రజలు లారీల అద్దాలను ధ్వంసం చేశారు. అన్ని పార్టీలు సుమారు 20 గంటల పాటు ధర్నా నిర్వహించాయి. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, కుమారుడికి ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఇసుక లారీలకు తోడు అధిక లోడ్ గల బూడిద లారీలు, బొగ్గు లారీలు కూడా తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఇతర వాహనాలలో ప్రయాణించే వారు బెంబేలెత్తుతున్నారు. కాళేశ్వరం నుండి హైదరాబాద్ వరకు ప్రధాన రహదారిపై గల పల్లెలు, పట్టణాలు ఇసుకలారీల దూకుడుకు భయకంపితులై బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పాఠశాలలకి వెళ్తున్నారు. రవాణా శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం, పోలీసుల నిర్లక్ష్యం, రోడ్డుపై స్పీడు బ్రేకర్లు లేకపోవడం, లారీ క్లీనర్లు కూడా వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఇసుక లారీలను రాత్రివేళలో మాత్రమే రోడ్డుపైకి అనుమతించాలి. బ్రీత్ ఎనలైజర్‌లో డ్రైవర్లను పరీక్షించాలి. లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియజెప్పాలి. ప్రధాన రోడ్డుపై ఒక వరుస క్రమంలోనే లారీలు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి. ప్రభుత్వం కూడా ఇసుక లారీల ద్వారా ఆదాయం వస్తుందని చూస్తుంది తప్ప అమాయక ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయలతో వేసిన రోడ్డు ధ్వంసం అవుతోంది. ఇసుక లారీల దూకుడుకు ముగింపు లేదా? ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలి.

– కామిడి సతీష్‌రెడ్డి, జెడలపేట, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

విశాలాంధ్ర
బతుకు
The Life
మంగళవారం
20 మార్చి 2018



## వేసవి తాపం!

వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం ఎగిరి గంతేసి చెరువులో దూకితే ఎలా ఉంటుందో? తెలుసా? ఇదిగో అచ్చం ఈ చిత్రం చూసినంత మజాగా ఉంటుంది. ఇంతకుమించిన మానసికోల్లాసం అందుతుంది. రోజంతా వేడితో ఉక్కిపోయిన శరీరానికి చల్లదనం ఎటూ అందుతుంది. ఈ చిత్రం త్రిపుర రాజధాని అగర్తలలోది.

# మీ పిల్లలకు లెక్కలంటే ఇష్టం లేదా!




సాధారణంగా ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు సరిగ్గా చదవడం లేదని, లెక్కలు చేయడం లేదని బాధపడుతుంటారు. కానీ అందుకు కారణాలేంటో గమనించరు. చదవడం లేదని వాళ్ళని తిట్టడం కాకుండా అసలు సమస్య ఏమిటో గుర్తించండి. వారిలో లోపాలను తెలుసుకోండి. లెక్కలు అంటే వారికి ఎందుకు భయమో వివరంగా అడిగి తెలుసుకోండి. సరిగ్గా చదవడం లేదు, లెక్కలు అస్సలు చెయ్యడం రావడం లేదు అని వారిని నిందించడం, నిరుత్సాహపర్చడం అస్సలు చేయవద్దు. ఏదైనా నువ్వు చేయగలవు అని ప్రోత్సాహాన్ని ఇవ్వండి. దీంతో వాళ్ళపై వారికి కొద్దిగా నమ్మకం వస్తుంది. కొంతలో కొంతైనా మెరుగుపడతారు. పిల్లలకు తల్లిదండ్రులు పంచే ఆలనాలాలనా, ప్రేమాభిమానాలే అసలైన పెట్టుబడి అనే విషయాన్ని ముందు మీరు గ్రహించండి. నెమ్మదిగా, నమ్రతగా చెబితే వినని పిల్లలు సాధారణంగా ఉండరు. మీరూ ఆ పనే చేసి చూడండి. ఎలా చెబితే వారి మనస్సుకు ఎక్కుతుందో ఆలోచించండి. ఉదాహరణకు లెక్కలంటే భయమనుకోండి. ఏదోవిధంగా వారు చేసే ప్రతి పనిలోనూ లెక్కలు ఉండేలా చూడండి. అయితే ప్రత్యేకించి లెక్కలు చేస్తున్నామనే ధ్యాస వాళ్ళకి రానివ్వకూడదు. పనిలో పనిగా ఈ లెక్కలు కూడా అయిపోవాలి. ఈ రోజుల్లో పిల్లలు ఫోన్ ఉపయోగించడం సర్వ సాధారణమైపోయింది. ఈ జాబితాలో మీ పిల్లలూ ఉంటే ఫోన్‌లో లెక్కలకు సంబంధించిన ప్రత్యేకమైన యాప్స్‌ని స్టోర్ చేయండి. అప్పుడు ఇష్టంగా లెక్కలు చేయడం వాళ్ళే ప్రారంభిస్తారు. లెక్కలు చేయడంలో ఇది వారికి బాగా సహాయపడుతుంది. ఫోన్‌లో యాప్స్ అన్నారు కదాని 24 గంటలు సెల్‌ఫోన్ పిల్లల చేతిలో ఉంచవద్దు. వాళ్ళు ఫోన్‌పై ఆసక్తి చూపించిన ప్రతిసారీ ఈ యాప్స్ ఉపయోగించేలా చూడండి. చాలు వాళ్ళ ఇష్టమూ తీరుతుంది, లెక్కలూ వస్తాయి. మీ పిల్లల హోమ్ వర్క్‌లో ప్రతి రోజు మీరు కూడా సహకరించండి. మీరు మార్కెట్‌కి వెళ్ళినప్పుడు అక్కడ వారి మెదడుకు పదుపెట్టే విధంగా వారిచే కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు వంటివి అడగండి. వెల ఎంత? మనమెంత కొంటున్నాము. ఎన్ని డబ్బులు ఇచ్చాం, ఎంత తిరిగి ఇచ్చాడు. ఇవన్నీ వేగంగా లెక్కించేలా అలవాటు చేయండి. ఇలా చేయడం వల్ల వారికి లెక్కలు మరింత తేలికవుతాయి. లెక్కలు నేర్చుకోవడం వల్ల వచ్చే లాభాలేంటో వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగానూ తెలియజేయండి. మీ పిల్లల లెక్కల టీచర్‌ని సంప్రదించండి. వారిని యూనిట్స్ వారీగా కాకుండా వారాంతంలో కూడా మూల్యాంకనం చేయమని చెప్పండి. ఇలా చేయడం వల్ల వారికి ఎంత వరకూ అర్థమైందో తెలుసుకోని మరింత తేలికగా వారికి బోధించే అవకాశాలున్నాయి. చిన్న వయస్సు నుండే పిల్లల్ని ఇంటి వద్ద లెక్కలకు సంబంధించిన ఆటలు ఆడించండి. దీని వల్ల వారు లెక్కలు చేయడానికి మరింత ఉత్సాహం కనబరుస్తారు. వీటన్నింటి వల్ల పిల్లలకు లెక్కలు రావడం ఒక్కటే కాదు మీ మీద ప్రేమానుబంధమూ మరింత గట్టిపడుతుంది.

# అసమానత్వంపై వికల్ప్ పోరాటం!

*తల్లిలాంటి స్త్రీకి ప్రాచీన కాలంలో ఇచ్చిన ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా స్త్రీలపై దాడులు, వేధింపులు..ప్రతిరోజూ పేపర్లో మహిళపై దాడి అంటూ వార్తలు కనిపిస్తూనే ఉంటున్నాయి. ఈ పరిస్థితి మార్చేందుకే వికల్ప్ సంస్థాన్ ప్రారంభమైంది. లింగవివక్ష ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఒకటైన రాజస్తాన్‌లో ఈ ఉద్యమానికి బీజం పడింది.*

*సమాజంలో మార్పు తీసుకురావాలంటే అది యువతతోనే సాధ్యం. ఇదే వికల్ప్ సంస్థాన్‌ని ముందుకు నడుపుతోంది. మహిళలపై దాడులపై పోరాటం చేయడానికి రాజస్థాన్ కేంద్రంగా ఓ ఉద్యమానికి వికల్ప్ నాంది పలికింది. చైతన్యవంతం చేయడం ద్వారా యువతరంలో కొత్త మార్పు తీసుకురావడం దీని ముఖ్య ఉద్దేశం. 2004లో ప్రారంభమైన ఈ సంస్థ లింగ సమానత్వం, ఆడపిల్లల చదువు, బాల్యవివాహాలు, మహిళలపై దాడులు లాంటి ఎన్నో సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తోంది. వికల్ప్ అంటే ప్రత్యామ్నాయం అని అర్థం. అసమానత్వం, పక్షపాతం, హింస లాంటి వాటికి గురవుతున్న మహిళలు ప్రత్యామ్నాయ జీవన విధానాన్ని అనుసరించడానికి వికల్ప్ సాయం చేస్తోంది.*




'గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి జనంతో మాట్లాడేవాళ్లం. ముందుగా వారి అభిప్రాయాలను సేకరించి.. మహిళా హక్కులపై పోరాటానికి సిద్ధంగా ఉన్నవారిని మాతో చేర్చుకొనే వాళ్లం. వీళ్లంతా విద్యావంతులు కావడం వల్ల వారి కమ్యూనిటీల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చేశాం' అని ఈ సంస్థ నిర్వాహకులు యోగేశ్ వివరించారు. స్థానికంగా ఉన్న యువకులను సంస్థలో చేర్చుకోవడం వికల్ప్‌కు కలిసొచ్చే విషయం. సామాజికంగా మార్పులు వస్తున్నప్పటికీ గుడ్డి నమ్మకాలను, ఆచారాల పేరుతో వాటిని పాటిస్తూనే ఉన్నారు. లింగ సమానత్వం గురించి రాజస్తాన్‌లో పోరాటం చేయడం అంత సులువైన విషయమైతే కాదు. ఆచార వ్యవహారాల్లో రాజస్తాన్ సమాజం ప్రత్యేకమైనది. ఆడవారికంటే మగాళ్లు పైచేయిగా ఉండాలని నమ్మే రకమైన సమాజం అది. మన జీవన విధానం ఇంతే అని నమ్మే మనస్తత్వం వారిది. ఆడ శిశువు పుట్టిన దగ్గర నుంచి బాల్యవివాహం, కట్నకానుకలు లాంటి ఎన్నో సామాజిక రుగ్మతలు రాజస్థాన్‌ని పీడిస్తున్నట్లు అనేక సర్వేలో వెల్లడైంది.

'అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ సమానమనే భావన కలిగే సమాజం తయారు చేయడానికి వికల్ప్ ప్రయత్నిస్తోంది. మహిళా సంబంధమైన సమస్యలు అర్థం చేసుకుని వాటిని పరిష్కరించేందుకు స్థానిక యువకులను మా సంస్థలో చేర్చుకున్నాం' అని యోగేశ్ అన్నారు. ప్రతి ఇంటిలో మార్పు వస్తే అది సమాజంపై ప్రభావం చూపిస్తుందనే సిద్ధాంతాన్ని 'వికల్ప్' నమ్ముతోంది. ఈ ప్రాంతంలో లింగ సమానత్వంపై పోరాటం చేస్తూ 'వికల్ప్' దూసుకుపోతోంది. 'మన చిట్టితల్లుల హక్కులు, మన ఆడపిల్లలను స్కూళ్లకు పంపుదాం, మహిళలపై దాడులను ఆపుదాం' అనే కొన్ని నినాదాలను జనంలోకి తీసుకెళ్లింది వికల్ప్. మహిళలపై జరుగుతోన్న దాడులపై యుద్ధం చేయాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉత్పన్నమైంది. మన సమాజంలో ఆడవారిపై అకృత్యాలు, లైంగిక దాడులు, కట్న వేధింపులు వంటి గృహ హింస రూపుమాపాలంటే యుద్ధం చేయడం తప్పితే మరో అవకాశం లేదు.

"మహిళలు తమపై జరిగే దాడులను ఎదురొడ్డి నిలిచే ధైర్యాన్ని వికల్ప్ కల్పిస్తోంది. సాధారణంగా అమ్మాయిలకు చదువులు ఎందుకనే సమాజం ఆ రాష్ట్రంలో ఉంది. ఇంట్లో ఉండే అమ్మాయికి చదువుతో ఏం పని అనేది అక్కడి మగవారి అభిప్రాయం. దీన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తోంది వికల్ప్. అమ్మాయి చదువుకుంటే ఇంటిల్లిపాదీ చైతన్యవంతం అవుతుంది. స్థానిక పాఠశాలలు, కమ్యూనిటీలతో పాటు ప్రతీ ఇంటికి వెళ్లి అమ్మాయి చదువుపై అవగాహన కల్పిస్తున్నాం" అని యోగేశ్ అంటున్నారు. "దాదాపు ఐదు వేలకు పైగా అమ్మాయిలు ఈ కార్యక్రమం ద్వారా తిరిగి పాఠశాలలకు వెళ్లి విద్యను కొనసాగించారు. బాల్య వివాహాల వల్లనే స్త్రీలు ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. ఇదే గృహ హింసకు కారణంగా మారుతోంది. అమ్మాయిలను చదివిస్తే బాల్యవివాహానికి దూరం చేయొచ్చు. ఇదే సందేశాన్ని సాధ్యమైనంత ఎక్కువ మందికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం' అని యోగేశ్ చెప్పారు.

> "మహిళలపై జరుగుతున్న ఎలాంటి దాడినైనా వికల్ప్ సంస్థాన్ సహించదు" అని యోగేశ్ అన్నారు. "ప్రత్యేకమైన కౌన్సిలింగ్‌తో పాటు రక్షణ కల్పించే విధంగా మేం కొన్ని సెంటర్లను ఏర్పాటు చేశాం. మహిళా హక్కుల కోసం వారిని మేం చైతన్యవంతులను చేస్తున్నాం. దీంతో వారు స్థిరమైన అడుగు వేసేందుకు అవకాశం ఉంది. వికల్ప్‌లో మహిళలు తమని తాము ఇష్టపడి, గౌరవించుకొనేలా చేస్తాం." అని యోగేష్ తెలిపారు.

అమ్మాయిలు, వారి కుటుంబసభ్యులతో పాటు స్కూలు అథారిటీలతో వికల్ప్ నిర్వహించిన సమావేశాలలో పాల్గొంటున్నారు. అమ్మాయిలు ప్రతిరోజూ స్కూలుకు వెళ్తున్నారు. ఇప్పటి దాకా 875 మంది అమ్మాయిలను బాల్యవివాహాలనుంచి ఈ సంస్థ రక్షించగలిగింది. సమాజంలో యువకులతో పాటు దేవాలయాల్లో ఉన్న పూజారులు, కులసంఘ నేతలు, ఇంటిపెద్దలు, పోలీసులు లాంటి అందరినీ తమతో చేతులు కలిపేలా వికల్ప్ నిర్వాహకులు కార్యక్రమాలు చేపడుతున్నారు.



# ఆఫీస్‌లో కునుకుపాటు..

రాత్రి నిద్ర సరిపోకపోతే తెల్లవారి పనులు ఉత్సాహంగా చేసుకోలేం. పైగా ఉద్యోగం చేసే వారికైతే ఆఫీసు సీట్లో కూర్చున్న దగ్గర నుండి కునుకు పాట్లు తప్పవు. ముఖ్యంగా మహిళలు ఆఫీసు, ఇంటి పనులతో నిత్యం సతమతమవుతుంటారు. పొద్దున్నే లేచి పిల్లల్ని రడీ చేయాలి. టిఫిన్, వంట.. ఈ పనులు గుర్తుకు వస్తే కొంత మందికి అసలు నిద్రేపట్టదు. దాంతో ఇటీవల ఆఫీసులో నిద్రపోతున్న ఉద్యోగుల సంఖ్య క్రమంగా ఎక్కువైపోతున్నదట. తాజాగా చేపట్టిన ఒక సర్వేలో ఈ విషయం తేటతెల్లమైంది. ఉద్యోగులు తాము పని చేస్తున్నప్పుడు నిద్రను ఆపుకోలేక కొన్నిసార్లు ఎదురుగా ఉండే సీటుపై తలపెట్టేసి నిద్రపోతున్న సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయట. దీనికి కారణాలు లేకపోలేదని అంటున్నారు వైద్యులు.



సుమారు 29 శాతం పనిచేస్తున్నపుడు కనురెప్పలను మూసేసి ప్రశాంతంగా నిద్రలోకి జారిపోతున్నారట. అలాగే సుమారు 36 శాతం డ్రైవింగ్ చేసేవారిలో కూడా నిద్రపోయే ముందు వచ్చే కునుకుపాట్లు లేదా గబుక్కున కనురెప్పలు మూసుకోవడం వంటివి ఎదురవుతున్నట్లు సర్వేల్లో తేలిందట. ఇలాంటి నిద్రావస్థను పారదోలేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందంటున్నారు వైద్యులు. అవేమిటో మీరే చదవండి.

క్రమం తప్పని వ్యాయామం చేయాలి. అలాగే అప్పుడప్పుడు వేగంగా నడుస్తుండాలి. దీర్ఘకాల పనిగంటల్లో పనిచేసేవారు మధ్యమధ్యలో విరామం తీసుకోవడం చేస్తుండాలి. దీనితోపాటు సీట్లోంచి లేచి అలా ఆఫీసు క్యాంపస్ చుట్టూ ఓ రౌండ్ వేసి వస్తే నిద్రమత్తు వదులుతుంది. రాత్రి పూట పడుకునేటప్పుడు నిద్రించే ముందు సెల్‌ఫోన్ లేదా ల్యాప్ టాప్ లేదా ఇతరత్రా ఎలక్ట్రికల్ పరికరాల జోలికి వెళ్లకపోవడం మంచిది. ఆహారం విషయానికి వస్తే ఒమేగా-3 ఫ్యాటీయాసిడ్స్ ఉన్నటువంటి పదార్థాలను భోజనంలో భాగంగా చేసుకోవాలి.

నిద్రమత్తు దరిచేరకుండా ఉండాలంటే ఎక్కువ మోతాదు కెఫిన్ లేదా చక్కెరలను తీసుకోవడం తగ్గించాలి. అలాగే నిద్రించే మంచంపై ఉండే బెడ్ షీట్లను వారానికి మించి వాడకూడదు. ఇంకా మరీ పొద్దుపోయే వరకు పనిచేయడం మానుకోవాలి. మహిళలు అన్నింటి కంటే ముఖ్యంగా చేయవలసింది, ఇంటి పనుల్లో భర్తను భాగస్వామ్యం చేయాలి. అప్పుడే మీకు నిద్రపోవడానికి కాస్త సమయం దొరుకుతుంది.

# ఇంట్లో గార్డెన్ పెంచాలనుకుంటున్నారా?

**చాలామంది ఇంటివద్ద కిచెన్ గార్డెనింగ్‌ను ప్రారంభిస్తున్నారు. ఇది కేవలం టైమ్‌పాస్‌కు మాత్రమే కాదు. కిచెన్ గార్డెన్‌లోని పండ్లు, కూరగాయలతో మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అయితే కిచెన్ గార్డెనింగ్ కోసం అనుసరించాల్సిన కొన్ని చిట్కాలున్నాయి. అవేంటో మీరే చదవండి...**



**సూర్యరశ్మి పడే ప్రదేశం:** కిచెన్ గార్డెన్ కోసం ఎల్లప్పుడు సూర్యకాంతి పుష్కలంగా పడేటువంటి ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. పెరడు మొక్కల శక్తికి మూలం సూర్యరశ్మే. ఐదారు గంటల సూర్యకాంతి మొక్కలకు కావాల్సి ఉంటుంది. అందువల్ల కూరగాయలను పెంచుకోడానికి నీడ ప్రాంతాలను నివారించండి.

**ఎరువును తయారు చేయండి:** ఇంటి పెరటి కొరకు ఎంపిక చేసుకునే ప్రదేశంలో వేయడానికి మట్టి(ఎరువు) తయారు చేయాలి. మట్టి నుండి రాళ్ళు తొలగించాలి. గార్డెనింగ్ కోసం మట్టి మరింత సారవంతంగా మారడానికి గార్డెనింగ్ మట్టిలో కంపోస్ట్ జోడించండి.

**మొక్కల ఎంపిక:** మీకు ఎల్లప్పుడూ అవసరం అయ్యేవి, త్వరగా పండే పండ్లు, కూరగాయాల మొక్కలను ఎంపిక చేసుకోవడం మంచిది. ఆ మొక్కలు కూడా మీ మట్టి ఆధారంగా ఎంపిక చేసుకోవాలి. మట్టి, వాతావరణం, మొక్క రోజువారి అవసరం పంట సమీప్యం మీద ఆధారపడి ఉండాలి.

**డిజైన్:** మీ కూరగాయల తోటకు ఒక సరైన ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కూరగాయల పెంపకానికి సరైన డిజైన్, లేఅవుట్ చేసుకోవడం చాలా అవసరం. మీరు ఎటువంటి మొక్కలైనా పెట్టుకోవచ్చు. అయితే ఎక్కడ పెట్టాలనే విషయాన్ని మాత్రం తప్పనిసరిగా తెలుసుకోవాలి. అలా డిజైన్ చేసుకున్నప్పుడు గార్డెన్ నిర్వహించడానికి సులభంగా ఉంటుంది.

**వాతావరణం:** ప్రారంభ దశలో మీ మొక్కలకు ప్రకృతి చాలా అవసరం. ప్రతి మొక్క ఒక్కో వాతావరణంలో పెరుగుతుంది. అందుకు అనుకూలంగా మొక్కలను ఎంపిక చేసుకోవాలి.

**మొక్కలకు నీళ్ళు పట్టడం:** మొక్కలకు రోజూ నీళ్ళు పట్టడం చాలా అవసరం. ఒక్కరోజు నీళ్ళు పట్టకుంటే ఏం జరుగుతుందో ఒకసారి ఊహించుకోండి. మొక్కలకు ప్రారంభ దశలో రెగ్యులర్‌గా నీళ్ళు పోయకుంటే మొక్క ఎండిపోతుంది. మొక్కలు పెంచుతున్న ప్రారంభ దశలో మట్టి తడిసే విధంగా నీళ్ళు పట్టాలి.

**నిరంతర పరిరక్షణ:** కిచెన్ గార్డెన్ పనులు వారానికి ఒకసారి చేస్తే సరిపోదు. కిచెన్ గార్డెన్ మొదలు పెట్టాకా, వాటి సంరక్షణ చిన్న పిల్లల సంరక్షణ వంటిది. దీనికి నిత్యపోషణ, పర్యవేక్షణ చాలా అవసరం.










**డాక్టర్ వుప్పల లక్ష్మణరావు**

### జరిగిన కథ

**అంచేత పుట్‌బాల్ క్రికెట్ ఆటలాగ పద్ధతుల ప్రకారమే జరుగుతూంటాయి. కమ్యూనిస్టుల సంగతి వేరనుకో. అమెరికావాడికీ, బ్రిటిషువాడికి, జర్మనీవాడికీ, జపానువాడికీ, మనకీ కూడా రష్యా కమ్యూనిజం గర్భ శత్రువు. అంచేత ఈయుద్ధంలో యీ నిమిషానికి జయాపజయాలెలాగున్నా - పంచమాంకంలో వీళ్ళందరూ కలిసి రష్యాని ధ్వంసం చేసి కమ్యూనిజాన్ని నిర్మూలం చేసేస్తారు. అది తప్పదనుకో. మాకు వచ్చే తాఖీదుల్లో కూడా కాంగ్రెసువాడిని ఒక కంటితోనూ, హిందు మహాసభని ఒక కంటితోనూ చూడమన్నారు. కమ్యూనిస్టుని మాత్రం మూడో కంటితో చూస్తూండమన్నారు - ఎప్పటికేనా వాడినుంచే ముప్పొస్తుందని" అన్నాడు మదనం."అల్లుడూ! ఐతే జపానువాడి ముందర ఇంగ్లీషువాడు నిలబడతాడంటావా? పారిపోతాడంటావా?" అన్నారు నాన్న. "ఇంగ్లీషు వాడు యుద్ధం చేస్తాడం డోయ్! చెయ్యకపోయినా అమెరికావాడు చేయించి తీరుతాడనుకోండి.**

(నిన్నటి సంచిక తరువాయి)

అయినా - గాంధీ, జవహర్లాలు, రాజాజీ మినహా - ప్రజలందరూ జపానువాడికే సాయం చేస్తే-ఇంగ్లీషువాడూ అమెరికావాడూ యెలా జయం సాధించగలరు? అయితే - ఇది నా ఊహ సుమండీ, మామగారూ, రహస్యంగా మాత్రం వుంచండేం. ఒక్కటి, బ్రిటిషువాడు మాత్రం ఒకటే చేస్తాడు. చూడండీ - ఇల్లు వదిలిపెట్టి పోతూపోతూ పిల్లి పొయ్యిలో ఏదో చేసిందన్నట్టు యీ కాంగ్రెసు వాళ్ళందరినీ జైళ్ళలో పెట్టేసి - దేశం అంతా దహనం చేసేసి - చూశారూ గాంధీగారు అన్నారు దివాళా బ్యాంకుమీద ముందుతారీఖు వేసి రాసిన చెక్కు అని - ఆ చెక్కునే జపానువాడి పేర తిప్పి రాసి - ఆ జైలు తాళాలని వాడి ముఖంమీద కొట్టి దౌడాయిస్తాడు" అన్నాడు మదనం నవ్వుతూ. "అప్పుడు మీ ఐ.సి.యస్.గాళ్ళ మాటేమిటి? దివాలా కోమట్లవుతారా - దవాలా బంట్రోతులవుతారా?" అన్నాను. "చూశారా మామగారూ, మీ అమ్మాయి యెలాంటి ప్రశ్నవేసి నన్ను గంధ్ర కత్తెరలో పెట్టిందో? సుభా! నువ్వు పెద్ద పోలిటీషియనువి అవుతున్నావే? "పేషేన్స్ - కొనకంటా విను" అన్నాడు గిరిశీం. జపానువాడు సభాషుబోసుకి పట్టాభిషేకం చేస్తాడు. అది తప్పదుకదా. విను. సుభాష్ ఎవరు? ఐ.సి.యస్.వాడు. ఆ వాసన యెక్కడికి పోతుందంటా? ఐ.సి.యస్. సౌభ్రాతృత్వం ఓల్డు స్కూలు టై, భాయి - భాయి ఈ అభిమానాలు, యీ ఇంగీషు సాంప్రదాయం చస్తే మనకు పోవనుకోండి. అంచేత మాకేం ఫరవాలేదు. సుభాషు మాత్రం గొప్ప సిద్ధుడు కాదుటండీ! భరతుడు పాదుకా పట్టాభిషేకం చేసి రాములవారి పేరే రాజ్యం చేసినట్టు - సుభాషు కూడా గాంధీగారిని సింహాసనంమీద కూచోబెట్టి, గాంధీ మహాత్ముడి మొహరుతోనే మీటోటి కాంగ్రెసు వాళ్ళని మంత్రులుగా పెట్టుకుని రాజ్యం చేస్తాడు. మళ్ళీ కాంగ్రెసు రాజ్యమే అనుకోండి! బ్రిటిషువాడి చట్టాలు, బ్రిటిషువాడి పద్ధతులు, బ్రిటిషువాడు తిప్పిరాసిన దస్తావేజులు, సనద్దులు, కోర్టులు, కొళ్ళు, కదపాలు, కైఫీయతులు అక్షరాలు అన్నీ అవే చెలామణీ అవుతాయనుకోండి" అన్నాడు మదనం. "అల్లుడూ! ఆ మాత్రం నువ్వు భరోసా యిస్తే జపానువాడు స్వరాజ్యం యిచ్చినా పుచ్చుకుందాం" అన్నారు నాన్న. "మన జమీందారీలకీ, ప్రొప్రయిటరీ ఇనాములకీ, శ్రోత్రియాలకీ, దేవస్థానాలకీ, అప్పులూ వడ్డీ వ్యాపారాలకీ యేమి తకరా వుండదు. హైద్రాబాదులో బ్రిటిషు రెసిడెంటున్నట్టు ఢిల్లీలో మాత్రం నామకా జపాను వైస్రాయి వుంటాడనుకోండి!" అన్నాడు. "జపాను సర్వంబు పడగ నీడను కప్ప కసించు విధంబు- అందూ!" అన్నాను. "అత్తయ్యగారి తర్ఫీదు యేమిటి సుభా?" అన్నాడు మదనం. "అబ్బెబ్బే! శాంతానికి సోషలిస్టులంటే అసలు గిట్టదు - అల్లుడూ!" అన్నారు నాన్న. "అయితే ఫరవాలేదు. అత్తయ్యగారికి అప్పటప్పట సోషలిస్టు గాలి చల్లటం కద్దు అని మీరే లోగడ అంటూండేవారు. అప్పుడు మా చిన్నతనంలో మేం అందరం సోషలిస్టులమే! అయినా అప్పుడు ఇప్పుడు అత్తయ్యగారంటే నాకు సింహస్వప్నమే మామగారూ! అయితే రత్నలాంటి మనిషి. గవర్నమెంటు రికార్డులో కూడా అలాగే రాసివుంది. నే చూశా కదూ - మరి సుభకి యీ సోషలిస్టుగాలి యెలా చల్లిందండీ? ఇది ఇంతటితో ఆగక, కమ్యూనిస్టు సంధిలోనికి దింపుతుంది సుమండీ మామగారూ!" అన్నాడు మదనం. "అదేమిటోయ్



అల్లుడూ అలా అనుమానపడతావు? తల్లి అంటే సుబ్బడికీ భయమే సుమా! అయితే - ఆ వ్యాధి ముదరకుండా నువ్వే చూడాలి అల్లుడూ!" అన్నారు నాన్న నవ్వుతూను. "మీకు పిచ్చిపట్టిందేమిటి నాన్నా? నేను కమ్యూనిస్టుని కాను మొర్రో - నాకు వాళ్ళకి సహం ఎరిక అంటూంటే?" అన్నాను కోపం నటిస్తూ. "మామగారూ! మిలిటరీ అస్త్రం, పొలిటికల్ అస్త్రం రెండూ ప్రయోగిస్తాంలెండి. రష్యానీ, స్టాలిన్నీ హిట్లరు కబళించేస్తుంటే - ఈనాటు కమ్యూనిస్టులొక లెక్కేమిటండీ! ఇంకా చూరుపట్టుకు వేలాడితే - సుభాషుబాబు వీళ్ళని కాళ్ళు చేతులూ కలియగట్టి ఆ రష్యాలో పారేస్తే ఆ రౌరవాది నరకంలో పడి పైసలు. మామగారూ, అరుగంట లైంది. నేను సెలవు తీసుకుందునామరి? చిన్న విషయం మీ చెవులో చెప్పాలనుకుని మరచిపోయాను. మీరు చిట్టివలస భోగారం దగ్గిర విజయ రామపురం అగ్రహారం యీమధ్య కొన్నారుటగా? అగ్రహారం దగ్గిరగానే అయిదారు నెలల్లో అమెరికన్లు పెద్ద మిలిటరీ ఏరోడ్రోము కట్టబోతున్నారని యీవేళ రిక్రూటింగు కమిటీలో తెలిసింది. మీరు తొందరపడి రెండోకంటివాడికి తెలియకుండా గయాళీగా పడివున్న వెయ్యి ఎకరా ఖండమూ మా దవనం పేర కొని, రిజిస్టరీ చేయించేయండి. యకరా రూపాయి ఆ లెక్కలో వుంది. ఈ విషయం రెవెన్యూవాళ్ళకింకా తెలియదు. మరి నే వెళుదునా మామగారూ? అత్తయ్యవస్తే చెప్పండి నేవొచ్చి వెళ్ళానని. అమ్మా, నాన్న ఎప్పుడు అత్తయ్య గురించే చెబుతూంటారు - మనిషంటే అలా వుండాలి - మాలక్ష్మిలాగు - అని. దవనం! మళ్ళీ మనం యెప్పుడు కలుసుకోవడం?" అన్నాడు. "నేను ఆవేళ వాల్తేరు స్టేషనులో చెప్పాను, జ్ఞాపకం వుందా? నువ్వు ముహూర్తం నిశ్చయించి పెళ్ళి పిలుపులు అచ్చు వేయించి పంచిపెట్టు. అప్పుడు నేను రాకపోతే అను" అన్నాను. "మూఢం వెళితేనేకాని ముహూర్తాలు లేవంటున్నారు" అన్నాడు "అయితే మరి అంతవరకూ గిరీశంగారి మ్యారేజి పోస్టుపోను చేయవలసి వస్తుందికదా అనిమాత్రం విచారిస్తున్నా" అన్నా. 'నీకంతా వేళాకోళమే - సుభా!" అన్నాడు. ముఖం ముదుచుకుని. "ఆంధ్ర నాటక సమాజం వాళ్ళమి 'కన్యాశుల్కం' నాటకం ఆగష్టులో వేస్తున్నాం. నేను బుచ్చమ్మ పాత్ర వేస్తున్నా. అంచేత విశాఖ పట్నం, విజయనగరం భాష నేర్చుకుందాం అని మీ ఊరు రావాలనుకుంటున్నాను. ఈ నెలాఖరుకి వస్తా. యేం?" "క్వైటు అనెక్సెక్టెడ్!" అని దగ్గరకి రాబోయాడు. "మదనం! ఆవేళ విశాఖపట్నంలో ఏమైందో జ్ఞాపకం వుందా?" అన్నాను. అని అతనితో కరచాలనం చేశాను, పాపం!

### 18 అతడు

నా పుత్తరం దొరకి పంపించి అప్పుడే రెండురోజులైందే - ఇంకా అతని దగ్గిరనుంచి యే జవాబుకాని, కబురుకాని రాలేదేమి చెప్మా అని అనుకుంటున్నాను. ఈవేళ కచేరికి వెళ్ళగానే పెద్దదొర టెలిఫోను చేశాడు రమ్మనమని. సరి, తాడోపేడో తేల్చేసుకుందాం. మనకీ యీ ఉద్యోగానికీ రుణం తీరిపోయింది యీ వేళతో అని అనుకున్నాను. కారాలు మిరియాలు నూరుతూంటాడు. వెళ్ళగానే శ్రీ ముఖం ఇస్తాడు. ఎలాగా మనకి యీ ఉద్వాసన చెపుతున్నప్పుడు అతనితో జట్టీ ఎందుకు? మాట అంటే మాత్రం పడకుండా ఒకటికి రెండు జవాబు చెప్పే వచ్చేస్తాను. ఎలాగా రోటిలో బుర్రపెట్టాక రోకటి పోటుకి భయపడ్డ మెందుకు అని అనుకుంటూ వెళ్ళాను. వెళ్ళి మిలిటరీ సలాముకొట్టి నిలబడ్డాను. అతనుకూడా సలాము అందుకుని, ఇలా వొచ్చి కూచోండి అన్నాడు. మిలిటరీలో మీ హోదా యేమిటి అని అడిగేడు. కెప్టెను అని చెప్పాను. మేజామీద కాగితాలు దస్తరం చూసుకుని మళ్ళీ నాతో మాట్లాడేదు. ప్రశ్నావళికి అందరి దగ్గరనుంచి వచ్చిన జవాబులతోపాటు నా జవాబుకూడా ఢిల్లీ పంపించేశాడుట. అందుకు నిన్న ఢిల్లీనుంచి టెలిఫోను వచ్చిందట. నా ఉత్తరం మీద కొంత తర్జన జరిగిందట. కాని ఆ పనికి నన్నే నియమించాలని నిర్ణయం చేశాం అని తెలియజేశారట. నాకు ఆశ్చర్యమేసింది. "అలాగాండి" అన్నాను. "అవును. ఇక అసలు విషయం యేమిటంటే; యుద్ధ పరిస్థితులు చాలా తికమకగా వున్నాయి. అందుచేత రైల్వేమార్గంలో వున్న వంతెనలన్నింటిని అవసరాన్నిబట్టి మిలిటరీవాళ్ళనుండి కబురు రాగానే శత్రువువశం అవకుండా ధ్వంసం చేయడానికి వీలైయేటట్లు ఏర్పాట్లు వెంటనే చేయమని. ఆ పని మీకు వప్పజెప్పడానికి నిర్ణయం అయింది. ఇది ఎంత రహస్యంగా జరగాలో నేను వేరే చెప్పనక్కర్లేదు. ప్రజలలో యీ కబురు పొక్కిందంటే నానా బీభత్సం అయిపోతుంది. ఈ పని మిలిటరీ వాళ్ళే చేస్తారు. కాని వాళ్ళ యింజనీర్లమీద నీదే పై అధికారం. అందుకు నీకు మేజరు హోదా ఇచ్చారు. బేసిను బ్రిడ్జి నుంచి వాల్తేరు వరకు నీదే జమాయిషీ. వారంరోజుల్లో పని మొదలు పెట్టాలి" అన్నాడు. "క్షమించండి, ఒక్క విషయం. ఇప్పుడు ఆరంబాకం దగ్గిర కొత్త అమెరికన్ నేవల్ గిడ్డంగులకోసం కదుతూన్న రెండు వంతెనల విధ్వంసం, ఇప్పుడు మిలిటరీవాళ్ళను అక్కడికి తీసికెళ్ళి చేయిస్తే ప్రజల్లో అలజడి జాస్తి అయిపోతుందేమో?" అన్నాను. "ఆ సంగతి ఆలోచించాం, ఈ కొత్తగా కదుతూన్న వంతెనలు మా వాడి కంట్రాక్టు క్రిందే జరుగుతూంది. కాబట్టి అక్కడ యెలా చేస్తే రహస్యంగా జరుగుతుందో నా సలహాకే వదలిపెట్టేశాను. నేను మా వాడితో కలకత్తా ఫోనుచేసి కనుక్కుంటే, వాళ్ళకు చీఫ్ ఇంజనీరు - సీతారాం అని వున్నాడుట. ఆయనచేత చేయించండి, ఆయన చాలా నమ్మకస్తుడు - అని చెప్పాడు. ఆయనతో కలిసి మీరు తగిన యేర్పాటులు చెయ్యండి. వారంరోజుల్లో పనులు మొదలుపెట్టండి" అన్నాడు...

ఇదేంపని రామరామ! ఏదేనా కట్టడం నిర్మాణం చెయ్యడం, సృష్టించడం, అభివృద్ధి చెయ్యడం - ఈ పనులు చెయ్యడానికి ఉత్సాహం ఉంటుంది కాని-చేసినదాన్ని విధ్వంసం చేయడమా? ఈ పనికి చేతులెలావస్తాయి? గోదావరి, కృష్ణా వంతెనల మాట తల్చుకుంటే తల తిరిగిపోతుందే? ఎన్ని సంవత్సరాలు కష్టపడితే, ఎన్ని వేలమంది కృషిచేస్తే, ఆనకట్టలు తెగిపోతాయి. గట్లు గండ్లుపడిపోతాయి. ఊళ్ళు నాశనం అయిపోతాయి. నాకెందుకీగతి పట్టింది?

- ఇంకా వుంది.

---

తెలంగాణ గురుకుల పాఠశాలల్లో

# ప్రవేశానికి దరఖాస్తులకు నోటిఫికేషన్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు (232), గిరిజన సంక్షేమ గురుకులాలు (88), బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు (142), టీఆర్ఈఐఎస్ గురుకుల (జనరల్) పాఠశాలలు (35)... ఇలా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న 497 గురుకుల పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి 5వ తరగతి (ఇంగ్లిష్ మీడియం-తెలంగాణ స్టేట్ సిలబస్)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశ పరీక్ష 2018, ఏప్రిల్ 8న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరగనుంది. ఈ నేపథ్యంలో గురుకులాల ప్రత్యేకతలు, విద్యార్థులకు ప్రయోజనాలు, ప్రవేశ ప్రక్రియ, అర్హతలు, దరఖాస్తు విధానం గురించి తెలుసుకుందాం...



### గురుకులాల ప్రత్యేకతలు..

- కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించాలంటే.. ఫీజు లక్షల్లోనే ఉంటుంది. గురుకుల పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువు, భోజనం, వసతి అన్నీ ఉచితమే.
- సమర్థులైన, సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బోధనతోపాటు, 24 గంటల పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని.. పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్/ హౌస్ పేరెంట్ వ్యవస్థ ఉంటుంది.
- ఐఐటీ, ఎంసెట్, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా నిపుణులు శిక్షణ అందిస్తారు.
- సెంట్రల్ యూనివర్సిటీలు, నల్సార్, టిస్, ఇఫ్లూ తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తారు.
- పాఠ్యాంశాలతోపాటు క్రీడలు, యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, మార్షల్ ఆర్ట్స్, లలిత కళలు తదితరాలపైనా అవగాహన కల్పిస్తారు.
- విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా బహుమతులు అందిస్తారు. వీటన్నింటితోపాటు విద్యార్థులకు పోషకాహారం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫామ్, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.
- **అర్హతలు** : 2017-18 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యార్థి 4వ తరగతి చదువుతుండాలి.
- **వయసు** : 2018, సెప్టెంబర్ 1 నాటికి జనరల్, బీసీ విద్యార్థులకు 9-11 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల వయో సడలింపు ఉంటుంది.
- **ఆదాయ పరిమితి** : 2017-18 ఆర్థిక సంవత్సరంలో విద్యార్థుల తల్లిదండ్రులు/ సంరక్షకుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000 మించరాదు. సైనికోద్యోగుల పిల్లలకు ఆదాయ పరిమితి నిబంధన వర్తించదు.
- **ఎంపిక ప్రక్రియ** : ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ విధానం, స్థానికత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.
- విద్యార్థుల ఎంపికకు ప్రతి పాత జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు.
- కొడిపల్లి పాఠశాలలో ప్రవేశం కోసం మత్స్యకార వృత్తికి చెందిన తెలంగాణ జిల్లాల్లోని అన్ని వర్గాల విద్యార్థులు అర్హులు.
- సర్వేల్ (నల్గొండ జిల్లా) రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ప్రవేశానికి, తెలంగాణలోని 31 జిల్లాల వారు అర్హులు. ఈ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థి ప్రతిభ, రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశం ఉంటుంది.
- **దరఖాస్తు విధానం** : అభ్యర్థులు http://tgcet.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు విద్యార్థి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల మొబైల్ నంబరు ఇవ్వాలి.
- సంబంధిత జిల్లా పేరు, ఆధార్ నెంబర్ నమోదు చేసి, ప్రవేశ పరీక్ష రుసుం రూ.50 చెల్లించిన (నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్ కార్డ్/ డెబిట్ కార్డ్ ద్వారా) తర్వాత ఒక రిఫరెన్స్ ఐడీ నెంబర్, దరఖాస్తు ఫారం కనిపిస్తుంది. ఆ ఫారంలో అన్ని వివరాలు నింపాలి.
- పరీక్ష తేదీకి పదిరోజుల ముందు నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తిచేసిన దరఖాస్తు నమూనా కాపీ, హాల్‌టికెట్‌ను ప్రింట్ అవుట్ తీసుకొని భద్రపరచుకోవాలి.
- ఒకసారి దరఖాస్తు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులకూ అవకాశం ఉండదు. కాబట్టి దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి ముందే సరిచూసుకోవాలి.
- **ప్రవేశ పరీక్ష** : మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. జవాబులు ఓఎంఆర్ షీట్‌లో మాత్రమే గుర్తించాలి.

| సబ్జెక్టు | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| తెలుగు | 20 | 20 |
| ఇంగ్లిష్ | 25 | 25 |
| గణితం | 25 | 25 |
| మెంటల్ ఎబిలిటీ | 5 | 5 |
| పరిసరాల విజ్ఞానం | 25 | 25 |
| **మొత్తం** | **100** | **100** |

- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 8, 2018 (ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు).
- **వెబ్‌సైట్** : http://tgcet.cgg.gov.in

---






## ఐసీఏఆర్ - అగ్రికల్చర్ కోర్సులు

దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, అనుబంధ కోర్సుల కళాశాలల్లో డిగ్రీ, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి నిర్వహించే జాతీయస్థాయి పరీక్షల తేదీలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ప్రకటించింది. దీనిద్వారా వ్యవసాయ యూనివర్సిటీల్లోని బ్యాచిలర్ కోర్సుల్లో 15 శాతం సీట్లను; పీజీలో 25 శాతం, డాక్టోరల్ కోర్సుల్లో 25 శాతం సీట్లను భర్తీచేస్తారు.

- **కోర్సు- అర్హతలు- పరీక్ష తేదీలు :**
- **అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) :**
- **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ అగ్రికల్చర్/ మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులూ అర్హులే.
- **యూజీ ప్రవేశ పరీక్ష తేదీ** : 2018, మే 12న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు.
- **పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) :**
- **అర్హత** : అగ్రికల్చర్, అనుబంధ సైన్స్ కోర్సులు లేదా సంబంధిత విభాగంలో.. నాలుగేళ్ల కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఏఆర్ఐ, ఎన్‌డీఆర్ఐలలో కొన్ని కోర్సులకు మూడేళ్ల వ్యవధి ఉన్న డిగ్రీ కోర్సులు చేసిన వారూ అర్హులే. ఫైనల్ ఇయర్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పీజీ ప్రవేశ పరీక్ష తేదీ** : 2018, మే 13న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు.
- పీజీ కోర్సులకు ఎంపికైన వారిలో 475 మందికి ఐసీఏఆర్ పీజీ ఉపకార వేతనం లభిస్తుంది. ఒకవేళ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికవ్వకుండా, స్థానికేతర రాష్ట్రంలో సీటు పొందితే నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ (పీజీఎస్) పొందొచ్చు.
- **పీహెచ్‌డీ :**
- **అర్హత** : గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్, అనుబంధ కోర్సుల్లో పీజీ పూర్తిచేసిన/ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు అర్హులు.
- **పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష తేదీ** : 2018, మే 13న ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు.
- **వెబ్‌సైట్** : www.icar.org.in

## నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2018-19కి గాను 9వ తరగతిలో మిగిలిన ఖాళీలకు లేటరల్ ఎంట్రీ కింద దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలిచే ఈ విద్యాలయాలు తమిళనాడు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి మొత్తం 626 ఉన్నాయి.


### తెలుగు రాష్ట్రాల్లోని జేఎన్‌వీల్లో ఖాళీలు..

- ఆంధ్రప్రదేశ్‌లో... అనంతపురం-0, చిత్తూరు-9, తూర్పు గోదావరి (1)-10, తూర్పుగోదావరి (2)-1, గుంటూరు-13, వైఎస్సార్ కడప-7, కృష్ణా-9, కర్నూలు-2, నెల్లూరు-6, ప్రకాశం (1)-4, ప్రకాశం (2)-8, శ్రీకాకుళం-3, విశాఖపట్నం-4, విజయనగరం-5, పశ్చిమ గోదావరి-8.
- తెలంగాణలో... ఆదిలాబాద్-2, కరీంనగర్-7, ఖమ్మం-7, మహబూబ్‌నగర్-7, మెదక్-6, నల్గొండ-6, నిజామాబాద్-9, రంగారెడ్డి-5, వరంగల్-2. తెలంగాణలో పాత ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జేఎన్‌వీలు ఉన్నాయి.
- **అర్హతలు** : ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ తుది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు.




- **వయసు** : 2002, మే 1-ఏప్రిల్ 30, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక** : ప్రవేశ పరీక్ష ద్వారా.
- **ప్రవేశ పరీక్ష విధానం** : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ నుంచి 15, హిందీ-15, మ్యాథమెటిక్స్-35, సైన్స్ నుంచి 35 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. ఎనిమిదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి 2 గంటల 30 నిమిషాలు. పరీక్ష ఇంగ్లిష్, హిందీ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.
- **దరఖాస్తు విధానం** : ఆన్‌లైన్.
- **దరఖాస్తు చివరి తేదీ** : ఏప్రిల్ 5, 2018.
- **ప్రవేశ పరీక్ష తేదీ** : మే 19, 2018.
- **వెబ్‌సైట్** : www.nvshq.org.

## ఐజీఆర్‌యూఏలో సీపీఎల్ కోర్సులో ప్రవేశాలు




ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో ఉన్న ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ).. కమర్షియల్ పైలెట్ లైసెన్స్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఐజీఆర్‌యూఏ.. కేంద్ర పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి వ్యవస్థ.

- **వ్యవధి** : 18 నెలలు (అవసరమనుకుంటే పొడిగిస్తారు).
- **మొత్తం ఖాళీలు** : 75 (జనరల్-38+ఓబీసీ-20+ఎస్సీ-11+ఎస్టీ-6).
- **అర్హతలు** : ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. మ్యాథ్స్, ఫిజిక్స్‌లో ఒక్కోదాంట్లో కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ ఓబీసీకి 50 శాతం) మార్కులు వచ్చి ఉండాలి.
- **వయసు** : ప్రవేశం నాటికి కనీసం 17 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక** : రాతపరీక్ష, వైవా/ ఇంటర్వ్యూ, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్.
- **దరఖాస్తు రుసుం** : రూ.10,000; ఎస్సీ/ఎస్టీ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం** : ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు చివరి తేదీ** : బ్యాంక్ చలాన్ ద్వారా ఫీజు చెల్లిస్తే.. ఏప్రిల్ 24, 2018వీ ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లిస్తే.. మే 1, 2018.
- **వెబ్‌సైట్** : www.igrua.gov.in

## తెలంగాణ పీఈ సెట్- 2018

తెలంగాణలోని వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లో 2018-19కి గాను బీ.పీ.ఈడీ, డీ.పీ.ఈడీ. కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్‌పీఈసీఈటీ-2018) నోటిఫికేషన్ వెలువడింది.

- **కోర్సులు** : బీ.పీ.ఈడీ, డీ.పీ.ఈడీ.
- **అర్హతలు** : బీ.పీ.ఈడీకి ఏదైనా మూడేళ్ల డిగ్రీ/ తత్సమాన విద్యబీ డీ.పీ.ఈడీకి ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు** : 2018, జూలై 1 నాటికి బీ.పీ.ఈడీకి 19 ఏళ్లువీ డీ.పీ.ఈడీకి 16 ఏళ్లు నిండి ఉండాలి.
- **దరఖాస్తు రుసుం** : ఎస్సీ/ఎస్టీ-రూ.400; మిగిలిన కేటగిరీలకు రూ.800.
- **దరఖాస్తు విధానం** : ఆన్‌లైన్.
- **దరఖాస్తుల ప్రారంభం** : ఫిబ్రవరి 28, 2018.
- **దరఖాస్తు చివరి తేదీ** : ఏప్రిల్ 10, 2018.
- **ఆలస్య రుసుముతో చివరి తేదీ** : ఏప్రిల్ 30, 2018.
- **వెబ్‌సైట్** : www.pecet.tsche.ac.in

# విశాలాంధ్ర బిజినెస్

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం (విజయవాడ) | బంగారం (విశాఖపట్నం) | వెండి (విజయవాడ) | వెండి (విశాఖపట్నం) | డాలరు Vs రూపాయి |
|---|---|---|---|---|---|---|
| -252.88 | -100.90 | -250 | 28,860 | -300 | 41,100 | |
| 32,923.12 | 10,094.25 | 28,800 | ప్రొద్దుటూరు 28,860 | 39,200 | ప్రొద్దుటూరు 41,112 | 65.17 |
| | | | 22 క్యారట్లు, 10 గ్రాములు | కిలో (రూపాయల్లో) | కిలో (రూపాయల్లో) | |

### టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

| కంపెనీ | ప్రస్తుత ధర | మార్పు (శాతాల్లో) |
|---|---|---|
| ఎన్‌టీపీసీ | 167.05 | 1.03 |
| మారుతిసుజుకి | 8,777.65 | 1.00 |
| లార్సెన్ | 1,279.70 | 0.95 |
| హెచ్‌యుఎల్ | 1,317.65 | 0.80 |
| ఎం&ఎం | 749.00 | 0.15 |

### టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

| కంపెనీ | ప్రస్తుత ధర | లాస్ (శాతాల్లో) |
|---|---|---|
| టాటాస్టీల్ | 575.05 | -4.24 |
| భారతీ ఎయిర్‌టెల్ | 400.80 | -4.16 |
| విప్రో | 288.05 | -2.60 |
| ఎస్‌బ్యాంక్ | 320.00 | -2.57 |
| కోల్ ఇండియా | 278.60 | -2.51 |

### విదేశీమారకం విలువ (ఫారెక్స్)

| కరెన్సీ | రూ.విలువ క్రి.ముగింపు | రూ.విలువ ప్ర.ముగింపు |
|---|---|---|
| డాలర్ | 65.17 | 65.17 |
| యూరో | 80.15 | 80.25 |
| పౌండ్ | 90.16 | 91.73 |
| ఆస్ట్రేలియా డాలర్ | 50.80 | 50.15 |
| సింగపూర్ డాలర్ | 49.45 | 49.44 |

### బులియన్

| బంగారం (10 గ్రాములు) | 22 క్యారెట్లు రూ. | 24 క్యారెట్లు రూ. |
|---|---|---|
| హైదరాబాద్ | 28,860 | 30,866 |
| చెన్నై | 28,860 | 30,866 |
| బెంగళూరు | 28,400 | 30,374 |
| ముంబై | 29,790 | 31,860 |
| విజయవాడ | 28,800 | 31,300 |
| విశాఖపట్నం | 28,860 | 30,860 |
| ప్రొద్దుటూరు | 28,8600 | 30,300 |
| ముడి చమురు | | 63.61 |

# సొంత వ్యాపారమా..ప్చ్!

- ఐదు శాతం మందికి మాత్రమే ఉత్సాహం
- నిరాసక్తత వ్యక్తం చేస్తున్న భారతీయ యువత
- ప్రపంచంలోనే అత్యల్ప శాతంగా నమోదు



విశాలాంధ్ర-బిజినెస్ డెస్క్: భారతీయ యువతలో కేవల 5శాతం మాత్రమే స్వంతంగా వ్యాపారాలు నెలకొల్పేందుకు సుముఖంగా ఉన్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ప్రపంచ జనాభాల్లో 5శాతం అంటే అతి తక్కువ జనాభాగా నమోదైంది..అది కూడా వీరు పెట్టిన వ్యాపారాలు కేవలం నిరాఘాటంగా సాగేది కూడా ఎటువంటి అవాంతరాలు లేకుండా సాగేది అత్యధికంగా 26.4 శాతంగా నమోదైంది. భారతదేశ వయోజన జనాభాలో కేవలం 11శాతం యువత మాత్రమే అత్యంత పిన్న వయసులోనే 'ప్రారంభస్థాయి-వ్యవస్థాపక 'కార్యకలాపాల్లో నిమగ్నమైఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 5శాతం తమ వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తృతం చేసుకునే దిశలో పయనిస్తున్నట్లు వెల్లడైంది. 18 నుండి 64 ఏళ్ల వయసువారిని 3,400 మందిని వారి వ్యవస్థాపక కార్యాచరణ పథకాన్ని అంచనా వేసేందుకు ఈ సర్వే నిర్వహించారు. గాంధీనగర్ ఆధారిత ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మానిటర్(జిఇఎమ్) ఇండియా 2016-17 నివేదిక ఆధారంగా పై నివేదిక అందించింది. 11శాతం యువతలో 4శాతం మంది మాత్రమే కొత్తకొత్త వ్యాపారాలను నూతన ధోరణులతో వినూత్నరీతిలో విభిన్నంగా ఏర్పాటుచేసుకునేందుకు ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. 7శాతం ఎంటర్‌ప్రెన్యూర్లలో వీరు 3.5 సంవత్సరాలు మాత్రమే తమ వ్యాపారాలను నిలుపోగలుగుతున్నారు. భారతీయు యువతలో 5శాతం తమ వ్యాపారాలను విస్తృతప్రాతి ప్రదికన 42 నెలల కంటే ఎక్కువకాలం నిలదొక్కుకోగలవని ఈ తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ రేటు ప్రపంచంలోనే అతి తక్కువని తెలుస్తోంది. బ్రిక్స్ దేశాల్లో (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) బ్రెజిల్ వ్యాపార యాజమాన్యంలో అత్యధిక శాతం(17శాతం)తో ముందంజలో ఉంది. దక్షిణాఫ్రికా 3శాతంతో అత్యల్పంగా నమోదైంది. అత్యధిక జనాభా ఉన్న చైనా 8శాతంతో రెండవస్థానంలో ఉంది. రష్యా, భారత్‌లు 5శాతం నమోదుచేసాయి. ప్రారంభ స్థాయిలోనే బిజినెస్‌వైపు మొగ్గు చూపుతున్న యువత భారత్‌లో సగానికన్నా ఎక్కువే ఉన్నప్పటికీ వీరు వ్యాపారాల్ని వృద్ధి చేసే దిశలో మాత్రం వెనుకబడి ఉన్నట్లు తెలుస్తోంది.

రానున్న 5సంవత్సరాల్లో 44శాతం మందిని అంటే ఐదుగురు ఉద్యోగస్థులను నియమించుకునేందుకు సంసిద్ధంగా ఉండగా, 5శాతం మంది ఐదుగురికంటే ఎక్కువ మందినే నియమించుకోనున్నారు. భారతదేశంలో వ్యాపార విరమణ రేటు 26.4 శాతంతో ప్రపంచంలోనే అత్యధికంగా నమోదైంది. అధికారిక అడ్డంకులతో వ్యాపారాలను అర్ధంతరంగా మూసివేసేవారు 1.3శాతం కాగా, 7శాతం మంది ఆర్థిక సమస్యలతో మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. 6.5శాతం మంది వ్యక్తిగతకారణలతో, 16.9శాతంమంది లాభాలు లేనికారణంగా, 58.4శాతం మంది ఇతరకారణాలతో తమ సంస్థలను మూతవేస్తున్నట్లు ఈ నివేదికలో వెల్లడైంది. హోల్‌సేల్, రిటైల్ ట్రేడింగ్‌లో 70.9శాతం కాగా, 12.1 శాతం మంది వ్యవసాయం, మైనింగ్, తయారీ, రవాణా రంగాల్లో నిలదొక్కుకుంటున్నారు. ఆరోగ్యం, విద్య, రంగాలతోపాటు ప్రభుత్వం, సామాజిక రంగాల్లో 9.3 శాతం మంది, ఆర్థిక,సమాచారం, సాంకేతిక రంగాల్లో 4.5 శాతం మంది, ఇతరరంగాల్లో 3.3శాతం మంది తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. వ్యవసాయం ప్రారంభదశలో వ్యవస్థాపక కార్యకలాపాల్లో ఈ గణాంకాలు గణనీయంగా తగ్గుతుండగా, గత సంవత్సరాల్లో ఇది 42శాతంగా ఉంది.

## సోనీ ఇండియా ఎండీగా సునీల్ నయ్యర్...!



విజయవాడ: తమ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా సునీల్ నయ్యర్‌ను నియమించినట్టు సోనీ ఇండియా ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. సోనీ ఇండియా ఎండీగా తొలి భారతీయుడిగా సునీల్ నయ్యర్ చరిత్ర సృషించారు. భారత దేశంలో సోనీ వృద్ధికి, లాభదాయకతకు పూర్తి బాధ్యతలు చేపడుతారు. సమీకృత వాణిజ్యం, మార్కెటింగ్ వ్యూహాన్ని చేపట్టటంతోపాటు అన్ని విభాగాల్లో ఉత్తమ మార్గనిర్దేశనం చేస్తారు. ఈ సందర్భంగా సునీల్ నయ్యర్ మాట్లాడుతూ, వినియోగదారుల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన బ్రాండ్‌గా, భారత దేశంలో కంపెనీ దిశను నిర్దేశించేందుకు ఉత్సాహంగా ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా భాగస్వామ్యుల అంతర్‌దృష్టిని తెలుసుకుంటానని, దేశంలో సోని ఉనికిని మరింత బలోపేతం చేయటానికి భాగస్వామ్యుల సూచనలు, సలహాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. " మా ఉనికిని విస్తరించుకునేందుకు, మా శక్తిని మెరుగుపర్చుకునేందుకు, మా వినియోగదారులకు అత్యుత్తమ శ్రేణి సాంకేతికతను అందించగలమని పూర్తి విశ్వాసంతో ఉన్నాను", అని అన్నారు. ఇదిలా ఉంటే, ఇప్పటి వరకూ సోనీ ఇండియా ఎండీగా పని చేసిన కెనిచిరో హిబి ఏప్రిల్ 1 నుంచి సోనీ బ్రెజిల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఇక సునీల్ నయ్యర్ తన కెరీర్‌ను సోనీ ఇండియాలో 1995 లో ప్రారంభించారు. సోనీ గల్ఫ్ సేల్స్ టీమ్‌లో నార్త్, ఈస్ట్ ఆఫ్రికా, లెబనాన్, రష్యా, సిరియా పలు ఇతర జీసీసీ దేశాల ఇన్‌చార్జిగా పని చేశారు. 2006 నుంచి 2015 వరకూ సేల్స్ హెడ్‌గా పని చేశారు. 2015 నుంచి ఇప్పటి వరకూ సోనీ నార్త్ అమెరికా హెడ్ ఆఫ్ రిటైల్ ఎక్స్‌పీరియన్స్‌గా పని చేశారు.

## బిగ్ బజార్‌లో ఫ్యాషన్ విభాగం

### ప్రారంభించిన దీక్షా పంథ్



విశాలాంధ్రబ్యూరో- హైదరాబాద్: ఉగాది పర్వదినం సందర్భంగా బిగ్ బజార్ తన నూతన ఫ్యాషన్ విభాగాన్ని కొత్తగా ప్రారంభించింది. కాచిగూడలోని బిగ్ బజార్‌లో ఈ ఫ్యాషన్ విభాగాన్ని నటి దీక్షా పంథ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాదిని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బిగ్ బజార్‌లో ఫ్యాషన్ విభాగంలో పిల్లలు, మహిళలు, పురుషుల కోసం స్టయిల్ దుస్తులు ఏర్పాటు చేశారని తెలిపారు. బిగ్‌బజార్ స్టోర్ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడుతూ వినియోగదారులు ఎంపిక చేసుకునేందుకు విస్తృతశ్రేణికి చెందిన కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఎత్నిక్ వేర్, స్టయిలిష్ కుర్తీలు, పాలాజూస్, స్కర్ట్‌లు, ఫార్మల్ షర్టులు, టాప్‌లు, ట్రౌజర్లు, ఇంకా అనేక సరికొత్త డిజైన్లు, పురుషులు స్మార్ట్ క్యాజువల్స్, క్రిస్ప్ ఫార్మల్స్, కంఫర్టింగ్ వేర్, పిల్లల కోసం రంగురంగుల దుస్తులు, టీ-షర్ట్‌లు, ప్యాంట్లు అందుబాటులో ఉంచామన్నారు. అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు గల ట్రయిల్ రూమ్‌లు ఉన్నాయని, స్టోర్‌ను ఆకట్టుకునే రంగులతో పాటు కాంతి వంతమైన లైటింగ్‌తో షాపింగ్ ట్రాలీలతో సులభంగా వెళ్లడానికి వీలుగా సౌకర్యంగా ఉంచామన్నారు.

# మూడునెలల కనిష్టానికి చేరిన మార్కెట్లు

- 252పాయింట్ల నష్టంతో సెన్సెక్స్
- 10,100పాయింట్ల దిగువన నిఫ్టీ



ముంబై:దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు కీలక దేశీయ మార్కెట్లపై సోమవారం పెను ప్రభావం చూపాయి. అమెరికా వాణిజ్య యుద్ధాలు, ఫెడరల్ సమావేశం, దేశీయంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మదుపరుల్ల తీవ్ర అనిశ్చితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రభావంతో వరుసుగా ఐదవ సెషన్‌లో దేశీయ మార్కెట్లు వారం ప్రారంభంలోనే నష్టాల్లో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 252.88 పాయింట్ల నష్టంతో 32,923.12 పాయింట్లు, నిఫ్టీ 100.90 పాయింట్ల నష్టంతో 10, 094.25 వద్ద ముగిసాయి. దిగుమతులు పెరగడంతో దీని ప్రభావం దేశీయ ద్రవ్యలోటుపై ప్రభావం చూపింది. దీనితో వరుసగా నలుగవ సెషన్‌లో సూచీలు నష్టాల్లో మునిగాయి. డాలర్‌తో రూపాయి మారకపు విలువ తగ్గిందని తెలుస్తోంది. బుధవారం జరగనున్న అమెరికా పెడరల్ రిజర్వు సమావేశాల్లో వడ్డీరేటు పెంపుదలపై మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మెటల్స్, బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్అమ్మకాలు మధ్యా హ్న ట్రేడింగ్‌లో ఊపందుకున్నాయి. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ వాణిజ్యయుద్ధ ప్రభా వం ఆసియా దేశాల మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. బిఎస్‌ఇ మార్కెట్‌లో 2,122 షేర్లు నష్టాల్లో ట్రేడవగా, 473 లాభాల్లో నమోదయ్యాయి. టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, కోల్ ఇండియా షేర్లు తీవ్ర ఒత్తిడితో 2.4శాతంపైగా నష్టాల్లో ముగిసాయి. నిఫ్టీ 50షేర్లలో హెచ్‌సిఎల్ టెక్, టెక్ మహీంద్ర, బిపిసిఎల్, ఐటిసి ఒక్కోటి 4శాతం పైగా నష్టపోయాయి. బిఎస్‌ఇ సెక్టరల్ సూచీల్లో రియాల్టీ, టెలికాం ఇండెక్స్ 3శాతానికిపైగా నష్టపోయాయి. మెటల్స్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, రియాల్టీ, ఐటి,టెక్ స్టాక్స్ అమ్మకాలు భారీగా పెఇఎరగాయి.కరెంట్ ఎకౌంట్ లోటు జీడీపీలో 2శాతం పెరిగినట్లు వార్తలు రావడంతో మదుపరులు సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. బిఎస్‌ఇ స్మాల్‌కాప్ ఇండెక్స్ 350పాయింట్లనష్టంతో 17,228 వద్ద ముగిసింది. బిఎస్‌ఇ స్మాల్‌కాప్ 3నెలల కాలంలో 11శాతంపైగా నష్టపోయింది. మిడ్‌కాప్ 256పాయింట్లతో ఇంట్రాడేలో 15,692 పాయింట్లునమోదుచేసింది.

**యూరోపియన్ మార్కెట్లు:** నిక్కీ 0.90శాతం, హాంగ్‌శాంగ్ అండ్ షాంఘై 0.04శాతం, 0.29 నష్టాన్ని నమోదు చేసాయి. లండన్ బెంచ్‌మార్క్ ఎఫ్‌టిఎస్‌ఇ 100 ఇండెక్స్ 0.1 శాతం నష్టంతో 7,157.58 పాయింట్లు నమోదు చేసింది. యూరోజోన్‌లో ఫ్రాంక్‌ఫర్ట్ డిఎక్స్ 30 ఇండెక్స్ 0.4శాతంతో 12,346.51 పాయింట్లు, పారిస్ సిఏసి 40 0.4శాతం నష్టంతో 5282.75 పాయింట్లు నమోదుచేసింది.

డాలర్‌తో రూపాయి మారకపు విలువ సోమవారం 0.28శాతం నష్టంతో 65.10 వద్ద నమోదైంది. శుక్రవారం అత్యల్పంగా 64.94 వద్ద ముగిసింది. రూపాయి ప్రారంభంలో 65.04 వద్ద ప్రారంభమై అత్యల్పంగా 65.14 వద్ద ముగిసింది.

భారత్ నుంచి మూడేళ్లలో


## 23వేల మంది కోటీశ్వర్లు విదేశాలకు

**ఆగ్రస్థానంలో భారత్, తరువాత స్థానాల్లో ఫ్రాన్స్, చైనా**

న్యూఢిల్లీ: గత మూడు సంవత్సరాలలో దేశం నుంచి 23,000 మంది కోటీశ్వర్లు ఇతర దేశాలకు వెళ్లిపోయారు. నల్లధనంపై ఉక్కుపాదం మోపడం వల్లే వీరంతా దేశం విడిచి వెళ్లిపోయారని భావిస్తున్నారు. చైనా, ఫ్రాన్స్ దేశాల్లో కన్నా ఇక్కడి సంఖ్య అధికం. 2014 నుంచి దాదాపు 23వేల మంది కోటీశ్వర్లు దేశం విడిచి వెళ్లిపోయారు. ఇందులో ఏడు వేల మంది ఒక్క 2017లోనే దేశం విడిచిపెట్టారు. దేశం విడిచి పెట్టి వెళుతున్న వారి జాబితాలో భారత అగ్రస్థానంలో ఉన్నది. మోర్గాన్ స్టాన్లీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్టు రుచీర్‌శర్మ ఆధ్వర్యంలో ఈ డేటాను తయారుచేశారు. భారత్ నుంచి 2.1 శాతం ధనికులు విదేశాలకు వెళ్లిపోతుండగా, 1.3 శాతం ఫ్రాన్స్ నుంచి, 1.1 శాతం చైనా నుంచి వలసపోతున్నారని తెలిపారు. గత వారం జరిగిన ఒక కార్యక్రమంలో శర్మ డేటాను ప్రదర్శించారు. విశ్లేషణకు సంబంధించి పూర్తి డేటాను ఎన్ఎం వరల్డ్ అందజేసింది. మొత్తం 1,50,000 మంది మిలీనియర్లను ఈ సంస్థ సర్వే చేసింది. "అవినీతి చర్యల కారణంగా కొంత మంది కోటీశ్వర్లు వలసపోయినప్పటికీ మేము చాలా జాగ్రత్తగా సర్వే నిర్వహించాం. మేము స్నానపు నీటితో శిశువును విసిరివేయలేదు" అని శర్మ తెలిపారు.

"నియంత్రణ అధికంగా అమలు చేయడం వల్ల ఏర్పడిన అనుషంగిక నష్టం"గా భావిస్తున్నారు. అంతర్జాతీయంగా, అక్లాండ్, దుబాయ్, మోంట్రిల్, టెల్ అవీవ్, టొరంటో ప్రపంచంలో అత్యంత ధనికులు ఉండటానికి అనుకూలమైన ప్రాంతాలుగా చెప్పవచ్చునని శర్మ తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేకమైన వివరాలు అందుబాటులో లేవు. బ్రిటన్, దుబై, సింగపూర్ వంటి దేశాలు భారత్‌కు చెందిన అత్యధిక మంది కోటీశ్వర్లు ఉండటానికి అనువైన ప్రాంతాలుగా ఈ సర్వేలో వెల్లడైంది. భారత్ నుంచి వలస వెళ్లే కోటీశ్వరులలో ఎక్కువ మంది ఈ దేశాలనే ఎన్నుకుంటున్నారు. దేశం విడిచి వెళ్లి, ఇతర దేశాలలో ఆరు మాసాలకుపైగా నివసించిన వారిని ఈ సర్వేలో లెక్కించినట్టు తెలిపారు. నికర ఆస్తులు మిలియన్ డాలర్లకుపైగా కలిగి వున్న వారిని కోటీశ్వర్లుగా భావించారు.

## మార్కెట్‌లో టైడ్ ఎక్స్‌ట్రా పవర్..!



విజయవాడ : భారతదేశంలో బ్రాండెడ్ డిటర్జెంట్ పౌడర్ టైడ్ ప్లస్ ఎక్స్ ట్రా పవర్ పేరుతో మార్కెట్ లోకి పీ అండ్ జీ విడుదల చేసింది.దక్షిణ హీరోయిన్ ప్రణీత సుభాష్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ దుస్తుల పరిశుభ్రతలో ఎప్పుడూ రాజీపడనని అన్నారు. క్రొత్త టైడ్ ప్లస్ ఎక్స్ ట్రా పవర్ లో కఠినమైన దుమ్మును సైతం తొలగించగల అదనపు శక్తిని ఉందని తెలిపారు. . పీ అండ్ జీ ఎండీ సోనాలి ధావన్ మాట్లాడుతూ ప్రతి తల్లి తన పిల్లలకు ఉత్తమమైన దుస్తులను అందించాలని కోరు కుంటుందని, దుస్తుల విషయంలో ఏమాత్రం రాజీపడరని అన్నారు. స్కూల్ యూనిఫామ్ శుభ్రతలో మరింత శక్తిని అందించడంలో క్రొత్త టైడ్ తోడ్పాటును ఇస్తుందని తెలిపారు. కేజీ పాకెట్ రూ.94, అరకేజీ రూ.47 లలో అన్ని దుకాణాలలో లభ్యమవుతాయని తెలిపారు.

## ఇకవైఫైకాదు..లైఫై

ముంబై:అవును, మీరు విన్నది నిజమే. ఇకపై మనం వైఫై కాదు, లైఫై వాడుకోవాలి. ప్రముఖ ఎలక్ట్రా నిక్స్ తయారీదారు ఫిలిప్స్ ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తాజాగా ఆవి ష్కరించింది. దీంతో త్వరలో లైఫై టెక్నాలజీ మనకు అందుబాటులోకి రానుంది. దీని ద్వారా సురక్షితమైన, వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను పొందేందుకు వీలుంటుంది.

**లైఫై ఎలా పనిచేస్తుంది..?:** వైఫై టెక్నాలజీ అంటే వైర్‌లెస్ తరంగాల ఆధారంగా పనిచేసే టెక్నాలజీ అని అందరికీ తెలిసిందే. అయితే లైఫై కాంతి తరంగాల ఆధారంగా పని చేస్తుంది. అంటే ప్రత్యేకంగా తయారు చేయ బడిన ఎల్‌ఈడీ లైట్లలో మోడె మ్‌ను అమరుస్తారు. ఈ క్రమంలో లైట్లను ఆన్ చేసినప్పుడు ఆ మోడెమ్ నుంచి కాంతి తరంగాలు లైట్ల ద్వారా బయటకు వస్తాయి. ఇక స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌కు అమర్చబడిన ప్రత్యేక మైన యూఎస్‌బీ డాంగిల్ ఆ కాంతి తరంగాలను గుర్తించి వాటిని ఇంటర్నెట్ తరంగాలుగా మార్చి డివైస్‌లకు ఇంటర్నెట్‌ను అందిస్తుంది. ఇలా లైఫై పనిచేస్తుంది.

**లైఫై ఉపయోగాలు...:** వైర్‌లెస్ తరం గాలు వాడేందుకు వీలుకాని చాలా వరకు ప్రదేశాల్లో లైఫైని సులభంగా వాడవచ్చు. దీంతోపాటు ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానం వినియోగదారు లకు పూర్తి సెక్యూరిటీని అందిస్తుంది. గోడల ద్వారా వైఫై బయటకు కూడా ప్రసారం అవుతుంది. కానీ లైఫై కేవ లం ఒకే చోట ఉంటుంది. గోడల ద్వారా ప్రయాణించదు. దీంతో లైఫై ద్వారా వచ్చే ఇంటర్నెట్‌కు సెక్యూరిటీ ఉంటుంది.

ఇతరులు దాన్ని యాక్సెస్ చేయలేరు. కార్పొరేట్ కార్యాలయాల్లో, ఇతర సంస్థల్లో లైఫై ద్వారా ఇంటర్నెట్‌ను వాడితే అది సురక్షింగా ఉండడమే కాదు, సుస్థిరమైన, వేగ వంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తుంది. ఫిలిప్స్ ఆవిష్కరించిన ఈ లైఫై టెక్నాలజీ ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉంది. త్వరలో పూర్తి స్థాయిలో వాణిజ్యపర మైన వినియోగానికి అందుబాటులోకి రానుంది.

### విజ్ఞానం



## డయాబెటిస్ డ్రగ్‌తో ఒబెసిటీకి చెక్..!

ఒబెసిటీతో సతమతమవుతున్నారా...అయితే శుభవార్త. మధుమేహ నియంత్రణకు వినియోగించే మందుతో ఫ్యాట్‌ను కరిగించవచ్చునని తెలుస్తోంది. ఆకలిని కలిగించే సహజసిద్ధంగా ఉత్పన్నమయే హార్మోన్‌ను ఈమందు నియంత్రిస్తుందని తెలుస్తోంది. సెమాగ్లుటైడ్ అనే ఈ కాంపౌండ్ రసాయననిర్మాణం గ్లుకాగోన్‌కు చెందిన పెప్టైడ్ 1(జిఎల్‌పి-1) నిర్మాణాన్ని పోలి ఉంటుంది. ఇది ఇన్సులిన్‌ను నియంత్రించడంతోపాటు ఆకలిని తగ్గిస్తుందని పరిశోధకులు వెల్లడించారు. డయాబెటిస్ లేకుండా శరీర బరువు అధికంగాఉన్నవారు ఈ మందును వినియోగించి చూస్తే బరువు అధికంగానే తగ్గినట్లు సౌత్ కెరలినా మెడికల్ యూనివర్సిటీ అధ్యయనవేత్తలు వెల్లడించారు. ఎండోక్రైన్ సొసైటీ 100వ వార్షికోత్సవ సమావేశం సందర్భంగా చేపట్టిన ప్రయోగంలో 957 మందిలో 35 మంది పురుషులుకాగా వీరి బాడీ మాస్ ఇండెక్స్ 30గా నమోదైంది.

కానీ వీరెవరికీ మధుమేహవ్యాధి లేదు. వీరిని ఏడు గ్రూపులుగా విభజించారు. ఐదుగ్రూపులకు సెమాగ్లుటైడ్‌ను 0.05ఎంజీ, 0.4ఎంజీ రోజుకోసారి ఇంజెక్షన్లద్వారా శరీరంలోకి పంపించారు. ఆరవగ్రూపుకు ఎటువంటి ప్లేస్‌బో మందును ఇచ్చారు. ఏడవ గ్రూపుకు 3ఎంజీల డయాబెటిస్ డ్రగ్ లిరాగ్లుటైడ్‌ను ఇచ్చి చూడగా, ఏడాది అనంతరం జరిపిన పరీక్షలో సెమాగ్లుగైడ్ వినియోగించినవారు ప్లేస్‌బో వినియోగించినవారికన్నా ఎక్కువ బరువు తగ్గినట్లు వెల్లడైంది. డోస్ ఎక్కువగా తీసుకున్నవారి ఎక్కువ బరువు కోల్పోయినట్లు తేలింది. లిరాగ్లుటైడ్ తీసుకున్నవారు సరాసరిన 7.8శాతం బరువును కోల్పోయారు. ప్లేస్‌బో గ్రూపు కేవలం 2.3శాతం మాత్రమే బరువును కోల్పోయారు. సెమాగ్లుటైడ్ 0.4ఎంజి తీసుకున్న ఆరవ గ్రూపు రోజులకు 10శాతం బరువునుకోల్పోయారు.

## బ్రెస్ట్ కేన్సర్ జీన్స్‌తో డిఎన్ఏ డ్యామేజ్



రొమ్ముకేన్సర్ జన్యువులు ఉన్న ఊబకాయుల్లో డిఎన్ఏ దెబ్బతినే అవకాశం ఉందని శాస్త్రజ్ఞుల తాజా అధ్యయనం వెల్లడించింది. శరీర బరువు అధికంగా ఉన్నవారిలో బిఆర్‌సిఏ మ్యుటేషన్‌తో పాటు సాధారణ బ్రెస్ట్ గ్లాండ్ సెల్స్‌తో పాటు డిఎన్ఏకు హాని చేస్తుందని వెల్లడైంది. ఊబకాయం రొమ్ము కేన్సర్‌కు ప్రధాన రిస్క్. బిఆర్‌సిఏ మ్యుటేషన్లు ప్రధానంగా బ్రెస్ట్ కేన్సర్ రోగుల్లో చూడవచ్చు. సన్నగా ఉండేవారికన్నా ఈ మ్యుటేషన్ అధిక శరీరబరువు ఉన్నవారిలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

## రికార్డుస్థాయిలో సెంచురీ మ్యాట్రిస్ ఉత్పత్తి


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వరల్డ్ స్లీప్‌డే సందర్భంగా సెంచురీ మ్యా ట్రిస్ హైదరాబాద్ ప్లాంట్ నుంచి 50 లక్షల పరుపులను ఉత్పత్తి చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. 30 సంవత్సరాల నుంచి పరుపుల వ్యాపారంలో ఉంది. కంపెనీ వివిధ రకాల పరుపులు ఉదాహరణకు కాయిర్, ఫోమ్, స్ప్రింగ్, హైబ్రిడ్ పరుపులను ఉత్పత్తి చేస్తోంది. అయిదు సంవత్సరముల నుంచి అత్య ధికంగా అమ్ముడుపోతున్న బ్రాండ్లలో సెంచురీ చేరింది. సెంచురీ మ్యాట్రెస్ 1988 లో హైదరాబాదులో ఉత్పత్తి మొదలు పెట్టింది. తరువాత భువనేశ్వర్‌కు తమ వ్యాపారాలను విస్తరించింది. 12 సంవత్సరాలలో 10 లక్షల పరుపులను విక్రయిస్తే చివరగా గత 3 సంవత్సరాలలో పదిలక్షల పరుపులను విక్రయించింది.

## మ్యాక్స్ బూపాచే గోయాక్టివ్ ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆరోగ్య బీమా సంస్థలలో ఒకటైన మ్యాక్స్ బూపా తాజాగా రోజువారీ ఉపయోగం ఆరోగ్య బీమా పథకం 'గోయాక్టివ్' కొత్త బ్రాండ్ ప్రచారాన్ని చేపట్టింది. ప్రారంభ క్రమంలో సంప్రదాయ ఆరోగ్య పథకాలు 'ఫర్నీచర్'గా చిత్రీకరించబడ్డాయని, గోయాక్టివ్ మాత్రం సంప్రదా యపరమైన పథకం కవర్‌చేయని ఒపిడి, వ్యాధినిర్ధారణలు, ఆరోగ్య శిక్షణ వంటివాటిని ఎన్నింటినో కవర్ చేస్తుందని మ్యాక్స్ బూపా మార్కెటింగ్ హెడ్ అనికా అగర్వాల్ తెలిపారు. మ్యాక్స్ బూపా వారి కొత్త ప్రచారం ఆరోగ్య బీమా సంరక్షణలోకి మరింతమంది యువ భారతీయులను తీసుకురావాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్రచారం వినియోగదారులకు నిజంగా కావలసినది ఏమిటి అనేదానిని మాట్లాడటంపై దృష్టి సారించిందన్నారు. ఆరోగ్య బీమా కలిగిన జనాభా 20 శాతం కంటే తక్కువగా ఉన్నారన్నారు. ప్రయా ణంలో ఉన్నప్పుడు అనారోగ్యం, ఆరోగ్యానికి సంబంధించిన మీ ఆరోగ్య అవసరాలు అన్నింటి కోసం గోయాక్టివ్ మీతో కలిసి 365 రోజులూ పని చేస్తుందన్నారు. ఈ ప్రచారాన్ని టీవీ చానెల్స్ ద్వారా ప్రసారం చేస్తున్నామని, గోయాక్టివ్‌ను పరిచయం చేయాలనే లక్ష్యంతో రూపకల్పన చేసిన ఈ ప్రక టన టైర్ 1, 2 మార్కెట్లు రెండింటిలోనూ నడుస్తుందన్నారు.

## కార్పొరేట్ డైరెక్టర్లపై నిఘా

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం నేపథ్యంలో కార్పొరేట్ కంపెనీల్లో బోర్డు డైరెక్టర్లుగా పనిచేసేందుకు అనుమతి పొందిన వ్యక్తుల పాస్‌పోర్టు వివరాలను తెప్పించుకోవాలన్న ప్రతిపాదనను కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిశీలిస్తున్నది. డైరెక్టర్ గుర్తింపు నెంబర్ (డీఐఎన్)ను కలిగివున్న వ్యక్తికి ఒకవేళ పాస్‌పోర్టు లేకపోతే ఆ విషయమై అతని నుంచి ధృవీకరణ పత్రాన్ని పొందాలని ఆ శాఖ యోచిస్తున్నది. డీఐఎన్‌ను పొందా లనుకునేవారు తమ పాస్‌పోర్టు వివరాలను సమర్పించడం తప్పనిసరి చేయా లని, ఇందుకు అనుగుణంగా డీఐఎన్ దరఖాస్తు పత్రాన్ని సవరించాలని కార్పొరేట్ వ్యవహారాల శాఖ యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రూ.50 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ రుణాలను పొందిన ప్రతి ఒక్కరి పాస్‌పోర్టు వివరాలను 45 రోజుల్లోగా సేకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంకులను ఆదేశించింది.







# వ్యవసాయంలో ఆధునిక యంత్రాల తయారీ

**ఆధునికత పెరగడంతో వివిధ రంగాల్లో మానవాళికి ఉపయోగపడే విధంగా పలురకాల యంత్రాల తయారీ ప్రారంభమయింది. ముఖ్యంగా వ్యవసాయరంగానికి సంబంధించి ఎన్నో యంత్రాలను కనుగొన్నారు. వాటివల్ల పెరుగుతున్న జనాభాతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు కూడా పెరిగాయి. దానికనుగుణంగా వ్యవసాయరంగంలో చోటుచేసుకున్న వివిధ ఆధునిక పరికరాల క్రమాన్ని క్లుప్తంగా ఒకసారి చూద్దాం.**



పదహారు నుండి 18వ శతాబ్దాల మధ్యకాలంలో ఎద్దులు, గుర్రాల శక్తిని వ్యవసాయానికి వినియోగించడం, చెక్కతో చేసిన నాగలిని చేతుల సహాయంతో ఉపయోగించడం, అలా క్రమంగా వ్యవసాయానికి అనువైన పరికరాలను రూపొందించే ప్రయత్నాలు ప్రారంభించారు.

1776-99 మధ్య కాలం : 1790లో ఉయ్యాల, కొడవలి వంటి వంకరగా వుండే కత్తిని పరిచయం చేయగా, 1793లో ప్రత్తిని వడికే యంత్రాన్ని పరిచయంచేశారు. 1797లో చార్లెస్ మొదటిసారిగా ఇనుముతో చేసిన నాగలికి పేటెంట్ పొందాడు.

1819 సంవత్సరంలో జెత్రొ వుడ్ ఇనుప నాగలికి కొన్ని భాగాలను సరికొత్తగా అమర్చడం ద్వారా పేటెంట్ పొందగా, 1819-25 మధ్యకాలంలో అమెరికాలో 'ఆహార పరిశ్రమ'గా గుర్తింపు పొందింది. 1834లో మెక్‌క్రామిక్ కోతకోసే యంత్రానికి పేటెంట్ పొందాడు. 1834లోనే జాన్ లానె స్టీల్ బ్లేడును నాగళ్ళకు అమర్చి ఉపయోగించేలా రూపొందించాడు. 1837లో జాన్ డీరి, లియోనార్డ్ ఆండ్రూస్ స్టీల్‌తో రూపొందించిన నాగళ్ళ తయారీని ప్రారంభించారు. 1837లోనే నూర్పుడు యంత్రానికి పేటెంట్ పొందారు.

1841లో ధాన్యం తొలిచే యంత్రానికి పేటెంట్ పొందగా, 1842లో మొదటి ధాన్యాన్ని తీసుకువెళ్లే యంత్రం రూపొందించబడింది. 1849 సంవత్సరంలో పలు రసాయన పదార్థాలను కలిపిన ఎరువుల అమ్మకం వాణిజ్యపరంగా ప్రారంభమయింది. 1850-70 మధ్యకాలంలో మార్కెట్ అవసరాలకను గుణంగా వ్యవసాయ పరికరాల్లో మార్పులు-చేర్పులు విస్తృతమయ్యాయి. 1862-75 సంవత్సరాల మధ్య అమెరికాలో వ్యవసాయపరంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోవడం ప్రారంభ మయింది. 1865-75 మధ్య గుంపుగా ఉండే పలు నాగళ్ళను ఒకటిగాను, గరుకుగా వుండే నాగళ్ళను ఉపయోగించడం ప్రారంభమయింది. 1870లో లోతైన బావిని తవ్వేందుకు మొదటిసారిగా యంత్రాన్ని ఉపయోగించారు. 1874లో గిల్డ్ డెన్ కంచెగా వేసే ఇనుపవైరుకు పేటెంట్ పొందగా, ఇదే సంవత్సరం ఈ వైర్‌ను పొలాలకు, ఇళ్ళకు కంచెగా ఏర్పాటుచేయడం ప్రారంభించారు.

1890-99 నాటికి సంవత్సరం మొత్తంలో వాణిజ్య పరంగా ఎరువులను 1,845,900 టన్నులు తయారుచేశారు. 1900-1909లో వాణిజ్యపరంగా ఎరువుల తయారీ 3,738,300 టన్నులకు చేరింది. 1900-1910 మధ్య టస్కెజీ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా వున్న జార్జి వాషింగ్టన్ కార్వెర్ సరికొత్తగా బఠాణీ విత్తనాలు, తీపి బంగాళాదుంపలు, సోయాబీన్స్ వంటి వాటిని సాగుచేయడం ద్వారా అధిక లాభాలు వచ్చేలా రూపొందించాడు. 1910-15 మధ్య ఓపెన్ గేర్డ్ గ్యాస్ ట్రాక్టర్లను ఉపయోగించడం ప్రారంభించారు. అలాగే 1918లో చిన్నపాటి ఆక్సిలరి ఇంజన్‌ను పరిచయం చేశారు. 1926లో తేలికగా వుండి, నడపగలిగే ట్రాక్టర్‌ను విజయవంతంగా అభివృద్ధిచేశారు. 1930నాటికి పలు విధాలుగా ఉపయోగపడేలా రబ్బరు టైర్లున్న ట్రాక్టర్లను రూపొందించారు.





ప్రతి ఏడాది క్రమక్రమంగా ఎరువుల తయారీ, ఉత్పత్తి పెరగడం, కూలీల సంఖ్య తగ్గడం ప్రారంభమయింది. 1941-45 సంవత్సరాల మధ్య 'Frozen food' బాగా ప్రసిద్ధి పొందింది. 1942లో వాణిజ్యపరంగా ప్రత్తిని వడికే యంత్రాలను తయారుచేయడం ప్రారంభించారు. 1945-70 సంవత్సరాల మధ్యకాలంలో వ్యవసాయంలో గుర్రాలను కాకుండా ట్రాక్టర్లు తదితర పలు వ్యవసాయ పని ముట్లను ఉపయోగించడం ఎక్కువైంది. 1965లో చెరకును, 1968 సంవత్సరం నుండి ప్రత్తిని యంత్రాల సహాయంతో కోయడం ప్రారంభ మయింది. 1970 నుండి నేటివరకు కూడా పంటల సాగుబడి, దిగుబడులు పెరుగుతూనే వున్నాయి. 1989 నుండి ఎక్కువశాతం మంది రైతులు తమ పొలాలకు, పంటలకు అనువైన వ్యవసాయ పనిముట్లను, ఎరువులను వాడటం ప్రారంభించారు. అలాగే పలు వ్యవసాయ పంటల సాగు, కోత తదితర పనుల్లో యంత్రాల వాడకం విస్తృతమైంది. అంతేకాదు పంటల దిగుబడులను పెంచడంకోసం పలు రకాల క్రిమి సంహారక మందులను, రసాయన ఎరువులను, వంగడాలను సరికొత్తగా రూపొందిస్తూనే ఉన్నారు. అయితే కనుగొన్న వివిధ రకాల రసాయన ఎరువుల వల్ల భూసారం తగ్గకుండా ఉండటంతో పాటు ఆరోగ్యపరంగా దీర్ఘకాలికంగానైనా ఏవిధమైన చెడు ప్రభావాలు ఉండకుండా చూడటం తప్పనిసరి బాధ్యతగా గుర్తించాలి.

# 'రంగస్థలం'కి అవార్డులు ఖాయం

## ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి





మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్, సమంత హీరో హీరోయిన్లుగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుకుమార్ దర్శకత్వంలో నిర్మించిన రంగస్థలం సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి, సురేఖ, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన, సమంత, పూజా హెగ్డే, ఆది పినిశెట్టి, సుకుమార్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, సి.వి.ఎం(మోహన్), రామ్ లక్ష్మణ్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ "తెలుగు ప్రజలకు, మెగాభిమానులకు ఉగాది శుభాకాంక్షలు. నాకు వైజాగ్‌తో మంచి అనుబంధం ఉంది. నాకు ఖైదీ సినిమా లాగా... రామ్‌చరణ్‌కి ఇది స్టార్‌స్టేటస్‌ను పెంచే సినిమా అవుతుంది. సుకుమారే ఈ సినిమాకు కర్త,కర్మ, క్రియగా సినిమాను ముందుకు నడిపించాడు. దేవిశ్రీ ప్రసాద్ చాలా అద్భుతమైన బాణీలను అందించాడు. చంద్రబోస్‌గారు అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. నేటివిటీకి అనుగుణంగా అందమైన పాటలను అందించారు. రత్నవేలుగారు ప్రతి సన్నివేశాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. రామకృష్ణ, మోనికగారు అద్భుతమైన సెట్ వేశారు. ఆది డిగ్నిటీ ఉన్న పాత్రలో అత్యద్భుతంగా నటించాడు. చరణ్ గర్వపడేలా సినిమాలో నటించాడు. సమంత పాత్రలో ఒదిగిపోయింది. జగపతిబాబుగారు సెటిల్డ్ రోల్ చేశారు., ప్రకాశ్ రాజ్‌గారి పాత్ర, అనసూయ చేసిన అత్తపాత్ర సహాఅన్నీ పాత్రలు మెప్పిస్తాయి. ఈ సినిమా ప్రజలను ఆకట్టుకోవడమే కాదు.. అన్ని విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంటుంది. జాతీయస్థాయిలో కూడా అవార్డువచ్చినా ఆశ్చర్యం లేదు. జాతీయ అవార్డులు వస్తుందని.. రావాలని ..కోరుకుంటున్నా. రాకుంటే అన్యాయం జరిగినట్లే. 2018లో ఈ సినిమా అత్యద్భుతమైన సినిమా అవుతుందని అనుకుంటున్నాను" అన్నారు.

### నన్ను నాకే కొత్తగా పరిచయం చేశారు : రామ్‌చరణ్

మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్ మాట్లాడుతూ ఇంత మంచి సినిమా చేయడానికి కారణమైన సుకుమార్‌గారికి హ్యాట్సాఫ్. నాకే ఓ కొత్త చరణ్‌ని పరిచయం చేశాడు. సుకుమార్‌గారి వల్ల నాపై నాకే గౌరవం పెరిగింది. నా అమ్మానాన్నలతోపాటు ఫ్యాన్స్ గర్వపడే సినిమాను సుకుమార్ నాకు ఇచ్చారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ థాంక్స్" అన్నారు. గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ మాట్లాడుతూ "రెండేళ్ల క్రితం మెగాస్టార్ చిరంజీవిగారు ఇదే వేదికపై సరైనోడు సినిమా ఫంక్షన్‌కి వచ్చి బన్నిని ఆశీర్వదించారు. సినిమా పెద్ద హిట్ అయ్యింది. ఇప్పుడు రంగస్థలం కోసం ఇదే వేదికపైకి చరణ్‌ని ఆశీర్వదించడానికి వచ్చారు. ఇది కూడా తప్పకుండా హిట్ అవుతుంది అని అన్నారు.

చిత్ర దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ చిరంజీవిగారు రాజకీయాల్లోకి వస్తున్నప్పుడు ముఖ్యమంత్రి పదవికంటే చిరంజీవిగారి పదవి పెద్దది కదా! అయనెందుకు రాజకీయాల్లోకి వస్తున్నారని దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. నిజంగానే చిరంజీవిగారి పదవి చాలా ప్రత్యేకం. అది ఆయనకే సాధ్యం. ఈ సినిమాకు పనిచేసిన ప్రతీఒక్కరూ చాలా చాలా అంకితభావంతో పనిచేశారని కితాబిచ్చారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతల్లో ఒకరైన నవీన్ ఎర్నేని మాట్లాడుతూ "మెగాస్టార్ చిరంజీవిగారికి, గంటా శ్రీనివాసరావుగారికి, స్పెషల్ థాంక్స్. ఈ సినిమాలో రామ్‌చరణ్ విశ్వరూపం చూస్తారు. దేవిశ్రీగారితో మా బ్యానర్‌లో మూడు సినిమాలకు పని చేశాం. భవిష్యత్‌లో ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాం" అన్నారు. సమంత మాట్లాడుతూ "మేమందరం కష్టపడి చేసిన సినిమా రంగస్థలం. ఈ టీంతో కలిసి పనిచేయడం నా అదృష్టం. సుకుమార్‌గారు మంచి వ్యక్తి. ప్రతి విషయాన్ని ప్రేమతో చేశారు. ఆయన ఎంతో ప్రేమతో రాసుకున్న ఈ క్యారెక్టర్‌కు న్యాయం చేయాలని ఛాలెంజ్‌గా తీసుకుని ఈ పాత్ర చేశాను. మార్చి 30 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అన్నారు.

దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ "ఇది నాకు స్పెషల్ మూవీ. నాకు ఎప్పటి నుండో ఫోక్ మ్యూజిక్ ఉన్న విలేజ్ బ్యాక్ డ్రాప్ మూవీ చేయాలనే కోరిక ఉండేది. ఆ కోరిక సుకుమార్ వల్ల తీరింది. బోస్‌గారు తన సాహిత్యంతో అందమైన ఎమోషన్స్‌ను క్రియేట్ చేశారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ "రంగస్థలం ఒక మ్యాజిక్. సినిమా చూసే ప్రేక్షకులు 1980లోకి వెళ్లిపోతారని చెప్పారు. ఈ వేడుకలో ఫైట్‌మాస్టర్స్, ఆర్ట్‌డైరెక్టర్, సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# 'మళ్లీ రావా'కు అవార్డుల పంట..

శ్రీ నక్క యాదగిరి స్వామి ఆశీస్సులతో స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సుమంత్, ఆకాంక్ష సింగ్ హీరోహీరోయిన్‌గా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రాహుల్ నక్క నిర్మించిన రొమాంటిక్ డ్రామా 'మళ్లీ రావా' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడీ చిత్రానికి అవార్డుల పంట పండింది. విళంబి నామ సంవత్సర శుభాకాంక్షలతో ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఫిల్మ్ డెవలప్ కార్పొరేషన్ అందించిన ఉగాది పురస్కారాలలో 'మళ్లీ రావా' చిత్రం బెస్ట్ ఫిల్మ్ అవార్డును అందుకుంది. మొత్తం నాలుగు శాఖల్లో 'మళ్లీ రావా' చిత్రం అవార్డులను సొంతం చేసుకుంది. ఈ పురస్కారాలలో బెస్ట్ ఫిల్మ్ అవార్డు అందుకున్న ఈ చిత్రం, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ డెబ్యూ హీరోయిన్, బెస్ట్ సపోర్ట్ యాక్టర్ మేల్ విభాగాలలో అవార్డులను గెలుచుకుంది. బెస్ట్ డైరెక్టర్ గా గౌతమ్ తిన్ననూరి, బెస్ట్ డెబ్యూ హీరోయిన్‌గా ఆకాంక్ష సింగ్, బెస్ట్ సపోర్ట్ యాక్టర్ మేల్ అప్పాజీ అంబరీషలు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రాహుల్ మాట్లాడుతూ.. "మా బ్యానర్‌లో వచ్చిన 'మళ్లీ రావా' చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఫిల్మ్ డెవలప్ కార్పొరేషన్ వారు మా సినిమాను గుర్తించి, అవార్డులతో సత్కరించినందుకు.. ముందుగా వారికి మా చిత్ర యూనిట్ తరుపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము. అలాగే అవార్డులు గెలుచుకున్న మా చిత్ర సభ్యులతో




పాటు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. త్వరలో మరో మంచి మూవీతో మీ ముందుకు వస్తాము.." అని అన్నారు.

## 'శబ్దం' నారా రోహిత్

ఫస్ట్ టైం తన కెరీర్‌లో మూగవాడి పాత్రలో కనిపించబోతున్నాడు నారా రోహిత్. మంజునాథ్ డైరక్షన్‌లో ఈ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇప్పుడీ మూవీకి టైటిల్ ఫిక్స్ చేశారు. ఉగాది సందర్భంగా శబ్దం అనే టైటిల్‌తో నారా రోహిత్ 18వ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. మంచి రోజు కావడంతో షూటింగ్ కూడా ప్రారంభించారు. వికాస్ కురిమెళ్ళ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్న ఈ సినిమాకి నారాయణ రావు అట్లూరి దర్శకుడు. శ్రీ వైష్ణవీ క్రియేషన్స్ బ్యానర్ పై త్వరలోనే సెట్స్ పైకి రానున్న ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా కన్‌ఫర్మ్ కాలేదు. శబ్దం సినిమాకు హిజ్ సైలెన్స్ ఈజ్ హిజ్ వెపన్ అనేది ట్యాగ్ లైన్.

## మహానటి మే9న విడుదల

మహానటి సినిమాను మే9న విడుదల చేయనున్నట్టు సినిమా యూనిట్ ప్రకటించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమాకు సంబంధించి మరో స్టిల్ రిలీజ్ చేసి, రిలీజ్ డేట్‌ను ఎనౌన్స్ చేశారు. సావిత్రి బయోపిక్‌గా వస్తున్నమహానటి సినిమాలో కీర్తిసురేష్ లీడ్ రోల్ పోషిస్తోంది. తెలుగుతెరపై చెరగని ముద్రవేసిన ఒకప్పటి హీరోయిన్ సావిత్రి జీవితచరిత్ర ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. పైగా మాయాబజార్‌లోని వివాహ భోజనంబు పాటను, ఆ సెట్ ను ఈ సినిమా కోసం రీ-క్రియేట్ చేస్తున్నారు. ఎవడే సుబ్రహ్మణ్యం లాంటి వైవిధ్యమైన సినిమాను అందించిన నాగ్ అశ్విన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. స్వప్న సినిమా బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాను వైజయంతీ మూవీస్ పతాకంపై సమర్పిస్తున్నారు.

# పంచె కట్టులో మహేష్

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, సూపర్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై స్టార్ ప్రొడ్యూసర్ దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న భారీ చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ చిత్రంలో మహేష్ ట్రెడిషనల్ లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. సర్‌ప్రైజింగ్‌గా మహేష్ మొదటిసారి పంచె కట్టుతో కనిపించడం సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన టీజర్ ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వ్యూస్ సాధించింది.

### 25 నుంచి స్పెయిన్ షెడ్యూల్

ఈ సందర్భంగా స్టార్ ప్రొడ్యూసర్ దానయ్య డి.వి.వి. మాట్లాడుతూ "మన తెలుగు సంవత్సరాది పండగ కళ



ఉట్టిపడే పంచె కట్టుతో ఉన్న పోస్టర్‌ను ఈరోజు విడుదల చేశాం. ప్రేక్షకులకు, అభిమానులకు మహేష్ కొత్త లుక్ కనువిందు చేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించి ఓ పాట రాజు సుందరం నేతృత్వంలో చిత్రీకరణ జరుగుతోంది. భారీ టెంపుల్ సెట్‌లో 100 డాన్సర్లు, 1000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో చాలా గ్రాండ్ లెవల్‌లో ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈనెల 25 నుంచి స్పెయిన్‌లో షెడ్యూల్ ఉంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా 'భరత్ అనే నేను' చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. సూపర్‌స్టార్ మహేష్, హీరోయిన్ కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌లతో పాటు ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, పాటలు: రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: శ్రీమతి డి.పార్వతి, నిర్మాత: దానయ్య డి.వి.వి., దర్శకత్వం: కొరటాల శివ.

## ఆరుషి హత్య కేసులో దంతవైద్యులకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ :** దంతవైద్యదంపతులు ఆరుషి, సుపూర్ తల్వార్‌కు వారి కుమార్తె ఆరుషి, ఇంటిపని వాడు హేమరాజ్ జంట హత్యకేసులో సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. హేమరాజ్ భార్య ఖుమకాల బంజేడా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. న్యాయమూర్తి రంజన్‌గొగోయ్ అధ్వర్యంలోని ధర్మాసనం ఈ నోటీసును జారీ చేసింది. అలహాబాద్ హైకోర్టు గత అక్టోబరులో సాక్ష్యాధారాలు లేనందున వీరిని నిర్దోషులుగా విడుదల చేసిన విషయం తెలిసిందే. 2013 నవంబరు 26న ఘజియాబాద్‌లోని సీబీఐ కోర్టు వీరిద్దరికీ జీవిత కాల శిక్ష విధించింది. 2008లో 14 ఏళ్ల ఆరుషి ఆమె గదిలో హత్యకు గురై మృతి చెందింది. మొదట ఆచూకీ లభించని హేమరాజ్ రెండురోజుల అనంతరం టెర్రస్‌పై హత్యకు గురై కనిపించాడు. ఈ కేసు దేశ వాసులను కలవరపాటుకు గురిచేసింది. దీంతో అప్పటి మాయావతి ప్రభుత్వం సీబీఐతో దర్యాప్తుకు ఆదేశించింది.

## కావేరీ సమస్యతో ఏపీ సమస్యను పోల్చొద్దు

తమిళనాడు ఉప ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం



**చెన్నై :** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా కోసం కేంద్రంపై తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని కావేరీ నదీ జలాల సమస్యతో పోల్చ వద్దని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీరు సెల్వం సోమవారం పేర్కొన్నారు. 'కావేరీ విషయంలో తమిళనాడు ప్రభుత్వం మెట్టు దిగేది లేదు. కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు కోసం సుప్రీంకోర్టు ఆరు వారాల గడువు ఇచ్చింది. అయితే ఏమీ జరగనట్లయితే భవిష్యత్తు చర్యలకు చర్చిస్తాం' అని అసెంబ్లీ వద్ద పన్నీరు సెల్వం తెలిపారు. మరోపక్క, రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, డీఎంకె కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ టీడీపీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ రాష్ట్ర సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. టీడీపీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరతాను' అని స్టాలిన్ పేర్కొన్నారు.

# 'మోడీ ముక్త్ భారత్'

## ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ థాకరే పిలుపు



**ముంబై :** మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. 2019 నాటికి 'మోడీ ముక్త్ భారత్' పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతిపక్షాలు ఐక్యం కావాలన్నారు. ఆదివారం సెంట్రల్ ముంబైలోని శివాజీ పార్కు వద్ద ఒక ర్యాలీలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ 'నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వం చేసిన తప్పుడు వాగ్దానాలతో దేశ ప్రజలు విసుగు చెందారు' అని థాకరే తెలిపారు. 'మోడీ ముక్త్ భారత్' కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని తొలగించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలన్నారు. బీజేపీ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదాన్ని గుర్తు చేస్తూ, '1947లో భారతదేశం మొదటిసారిగా స్వాతంత్ర్యం పొందింది. 1977లో (అత్యవసర ఎన్నికల తరువాత), భారత్ మోడీ ముక్త్‌గా మారినట్లయితే 2019 మూడోసారి స్వాతంత్రం సాధించినట్లు అవుతుంది' అని ఎంఎన్ఎస్ చీఫ్ చెప్పారు. మోడీ ప్రభుత్వం తొలగించబడితే నోట్ల రద్దుపై విచారణకు ఆదేశిస్తే, 1947 నాటి నుంచి దేశంలో అతిపెద్ద కుంభకోణం కావచ్చన్నారు. ఇస్రో నివేదికను ప్రస్తావిస్తూ, భూగర్భ జలాల క్షీణత కారణంగా మహారాష్ట్ర ఎడారిమయంగా మారుతుందన్నారు. రాజస్థాన్ తర్వాత మహా రాష్ట్ర ఎడారీక రణలో రెండో స్థానం లో ఉందని రాజ్ థాకరే వివరించారు.



అయోధ్యలో రామమందిర నిర్మాణానికి తాను అనుకూలమేనని, కానీ దానిని ఎన్నికల అంశంగా వాడుకో రాదని అన్నారు. 'బాబ్రీ మసీదు కేసు సుప్రీంకోర్టులో ఉంది. మత కలహాలు సృష్టించడానికి రానున్న రోజుల్లో ఉద్దేశ పూర్వకంగా చర్చించబడతాయి' అని ఆయన పేర్కొన్నారు. మోడీ విదేశీ పర్యటనలపై విమర్శలు గుప్పిస్తూ, ప్రధాన మంత్రి విదేశాల నుంచి ఎటువంటి పెట్టుబడులు సాధించ లేదు. 'పకోడా పిండి' పొందడానికి సందర్శించి నట్లుందన్నారు. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ', 'పాడ్‌మన్' వంటి సినిమాలు ప్రభుత్వ పథకాలకు రహస్య ప్రచారాలుగా ఉన్నాయన్నారు. కాగా గత నెలలో బాలీవుడ్ నటి శ్రీదేవికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. 'శ్రీదేవి గొప్ప నటి. కానీ ఆమె దేశానికి ఏమి చేసిందని ఆమె భౌతికకాయంపై త్రివర్ణ పతాకం ఉంచారు' అని ప్రశ్నించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం, నీరవ్ మోడీల నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించేందుకు నటి శ్రీదేవి అంత్యక్రియలను ప్రభుత్వ కార్యక్రమంలా మీడియా కవర్ చేసిందన్నారు. సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ, మీడియాలను అదుపులో ఉంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని రాజ్ థాకరే ఆరోపించారు.

## అధికారంపై బీజేపీ ఆశలు భ్రమే : శివసేన

వచ్చే 25 ఏళ్లపాటు అధికారం తమదేనన్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆశలు భ్రమేనని తెలుగుదేశం పార్టీ పెట్టిన అవిశ్వాస తీర్మానం నిరూపించిందని శివసేన సోమవారం తెలిపింది. అయితే టీడీపీ తన సొంత రాజకీయ ఒత్తిళ్లతో నడుస్తున్నదని, ఎన్‌డీఏ ప్రభుత్వానికి పూర్తి మెజార్టీ ఉన్నందున అవిశ్వాస తీర్మానం నిష్ఫలమని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో అపనమ్మక వాతావరణం నెలకొందని, వచ్చే ఏడాది ప్రజల్లో ఆగ్రహావేశాలు బద్దలవుతాయని వివరించింది. 'టీడీపీ అవిశ్వాస తీర్మానం తన వ్యక్తి ప్రయోజ నాల కోసమేగానీ, జాతీయ ప్రయోజనాలకు కాదు' అని తన పార్టీ పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిమాండు చేస్తున్నారు. అయితే ఆయన డిమాండ్లు నెరవేర్చబడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీలు అవిశ్వాస తీర్మానాన్ని తీసుకు వచ్చాయని వివరించింది. ఆంధ్రప్రదేశ్ కన్నా ముందు బీహార్ ఇదే విధమైన డిమాండ్లు చేశాయి. బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోడీ బీహార్ అభివృద్ధికి రూ.50 వేల కోట్ల నుంచి 1.5 లక్షల కోట్ల మంజూరుకు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికీ మొత్తం నిధుల హామీలో రూ.1.5లుగా కూడా పొందలేదు' అని ఆరోపించింది.

## శాంతి, ఐక్యమత్యమే భారతీయత : మోడీ



**జైపూర్ :** శాంతి, ఐకమత్యమే భారతీయ తత్వమని ప్రధాని మోడీ వెల్లడించారు. అజ్మీర్‌లోని సూఫీ ప్రవక్త హజరత్ ఖ్వాజా మొయినుద్దీన్ దర్గాకు ఆయన చాదర్ పంపుతూ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ ముక్తర్ అబ్బాస్ నఖ్వీ మోడీ తరఫున దర్గాకు చాదర్ సమర్పించారు. మొయినుద్దీన్ 806 ఏళ్ల ఉర్సు మహోత్సవంలో ఆయన భక్తులకు మోడీ శు భాకాంక్షలు తెలిపారు. దేశంలో ఎన్నిమతాలు ఉన్నా శాంతి, ఏకత్వమే దేశవాసులను ఒకటిగా చేసిందన్నారు. సూఫీ బోధనలు ఆత్యాధ్మిక సౌరభాలు గుబాళింప చేశాయని, మానవత్వమే మిన్నగా సాగిపోవాలని ఆయన దేశవాసులకు పిలుపు నిచ్చారు. ఇస్లాంకు, మానవత్వానికి ఉగ్రవాదం వ్యతిరేకమని, దేశంలోని అతికొద్ధిమంది శాంతిపై దాడిచేస్తున్నాయన్నారు. సూఫీ బోధనలతో ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటామని, మోడీ ప్రభుత్వం ప్రజల అకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని నఖ్వీ వెల్లడించారు. దర్గాలో నూతనంగా నిర్మించిన 100 టాయిలెట్లను ఆయన ప్రారంభించారు. ఉర్సు సోమవారం రాత్రి దర్గా ప్రధాన ఇమాం జైనుల్ అబ్దిన్ అలి ఖాన్ అధ్వర్యంలో ప్రారంభమైంది. ఆరురోజులపాటు రేయింబవళ్లు ఈ పండుగను నిర్వహిస్తారు. ఖవ్వాలి. ఇతరకార్యక్రమాలతో ఈ పండుగను జరుపుతారు. దేశ విదేశాల నుంచి వేలాది భక్తులు ఈ ఉర్సు ఉత్సవంలో పాల్గొంటారు.

రొహింగ్యా శరణార్థుల కేసులో

## మధ్యంతర ఆదేశాలకు సుప్రీంకోర్టు నో

**న్యూఢిల్లీ :** రొహింగ్యా శరణార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఆదేశాలను జారీ చేయడానికి సుప్రీంకోర్టు తిరస్కరించింది. రొహింగ్యాలకు విద్యా, వైద్యం అందించేందుకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలన్న పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఏఎం ఖన్విల్కర్,చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తిరస్కరిస్తూ, విద్యావైద్య సదుపాయాల్లో ఎటువంటి వివక్ష ఉండబోదని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసిందన్నారు. రొహింగ్య శరణార్థుల శిబిరాల స్థితిగతులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మహ్మద్ సలీముల్లా, మహ్మద్ షకీర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మార్చి7న కేంద్ర ప్రభుత్వ స్పందనను తెలియచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. లంక ప్రభుత్వం కూడా తమిళ శరణార్థులకు విద్యావైద్య వసతి కల్పించిందని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. అయితే లంక ప్రభుత్వంతో తమను పోల్చడం సరికాదని కేంద్రప్రభుత్వం వెల్లడిస్తూ, 1964 సిలోన్ ఒప్పందం ప్రకారం ఆదేశం సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. విదేశీ ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా ఐడీ కార్డులు జారీ చేయాలని కూడా పిటిషనర్లు సుప్రీంకోర్టును కోరారు. మయన్మార్‌లోని రఖైలో చెలరేగిన హింస, ఘర్షణల కారణంగా అక్కడి నుంచి వచ్చిన 40 వేల మంది శరణార్థులను తిప్పి పంపడంపై వారు పిటిషన్ దాఖలు చేశారు. మాజీ ఆర్ఎస్ఎస్, రాష్ట్రీయ స్వాభిమాన్ అందోళన్ నాయకులు కేఎన్ గోవిందా చార్య, సీపీఎం యువజన సంఘం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ), పశ్చిమ బెంగాల్ బాలల హక్కుల సంఘం శరణార్థుల హక్కులపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ, శరణార్థులను తిప్పి పంపవద్దని కేంద్రాన్ని ఆదేశించాల్సిందిగా సుప్రీం కోర్టును కోరారు. రఖైనుంచి వచ్చిన శరణార్థులు జమ్ము, హైదరాబాద్, హర్యాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌ల్లో వారు తలదాచుకున్నారు.

## లాలుకు మరో దెబ్బ

నాలుగో కేసులోనూ దోషిగా సీబీఐ కోర్టు నిర్ధారణ

గడ్డి కేసులో 21న శిక్ష ఖరారు



**రాంచి :** ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్‌కు దెబ్బమీద దెబ్బ పడుతోంది. పశుగ్రాసం కుంభ కోణానికి సంబంధించి మరో కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు లాలుకు సోమవారం శిక్ష విధించింది. మరో నిందితుడు మాజీముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాను నిర్దోషిగా ప్రకటించింది. లాలు సహా 18 మంది నిందితులకు సీబీఐ కోర్టు న్యాయమూర్తి శివపాల్‌సింగ్ శిక్షవిధించగా, మిశ్రా సహా 12 మందిపై కేసు కొట్టివేశారు. 1990 ఆరంభంలో దుంకా ట్రెజరీ నుంచి రూ.3.13 కోట్లు అక్రమంగా తీసుకున్నట్టు నిందితులపై కేసు నమోదైంది. పశుగ్రాసం కేసులో నిందితులపై 420 (నేరపూరిత కుట్ర), 467(ఫోర్జరీ), 468(మోసం కోసం ఫోర్జరీ), 471, 409, 477ఎ/ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), 13(ఐ), సీ, డీల కింద కేసు నమోదైంది. పశుగ్రాసం కుంభకోణం కేసుల్లో ఇప్పటికే లాలు జైలులో ఉన్నారు. నాలుగో కేసులోనూ లాలును దోషిగా నిర్ధారించారు. అనంతరం లాలు విలేకరులతో మాట్లాడుతూ తీర్పుపై తానేమీ వ్యాఖ్యానించాలని కోరుకోవడం లేదని అన్నారు. తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని ఆర్‌జేడీ ఉపాధ్యక్షుడు రఘువంశ ప్రసాద్ సింగ్ పేర్కొన్నారు. సీబీఐ కోర్టు లాలును దోషిగా నిర్ధారించిందని, బుధవారం శిక్ష ఖరారు చేస్తుందని సీబీఐ తరపు న్యాయవాది చెప్పారు.

## ఢిల్లీ హైకోర్టుకు 2జీ కుంభకోణం కేసు

### సవాల్ చేసిన ఈడీ

**న్యూఢిల్లీ :** 2జీ స్పెక్ట్రమ్ లైసెన్సుల కేటాయింపు కుంభకోణం కేసుల్లో కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా, డీఎంకె నాయకుడు కనిమొళి, ఇతర అధికారుల నిర్దోషిత్వాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం ఇక్కడి హైకోర్టులో సవాల్ చేసింది. అయితే 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపు కుంభకోణం కేసులో రాజా, కనిమొళి, ఇతర నిందితులందరిపై ఆరోపణలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని గత ఏడాది డిసెంబరులో ఢిల్లీలో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. టెలికం సర్వీసుల లైసెన్సులు పొందిన కంపెనీలకు చెందిన అధికారులతోపాటు రాజాపై సీబీఐ ఆరోపణలను



నిరూపించలేకపోయిందని న్యాయమూర్తి ఒ.పి.సైనీ పేర్కొన్నారు. లైసెన్సుల కేటాయింపులో అవక తవకలకు పాల్పడటం ద్వారా ఫోన్ పర్మిట్లు పొందడానికి ప్రభుత్వానికి రూ.1.76 కోట్ల నష్టం కలిగించినట్లు ఆరోపణలు వచ్చాయి. 2010లో రాజా మంత్రిగా ఉన్నప్పుడు 2జీ లైసెన్సులు లేదా రెండవ తరానికి సంబంధించిన కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని కేంద్ర ఆడిట్ సంస్థ కాగ్ నివేదిక ఇచ్చిన ఏడాది తర్వాత 2011లో 2జీ విచారణ ప్రారంభమైంది. తక్కువ ధరకు 2జీ స్పెక్ట్రమ్ లైసెన్సులను కేటాయించడం ద్వారా రూ.1.76 లక్షల కోట్ల ఆదాయానికి నష్టం కలిగించారని మంత్రి రాజాపై ఆరోపణలు వచ్చాయి.

## 'వైఫల్యాలపై ఆత్మపరిశీలన చేసుకోండి'

### యోగి ఆదిత్యనాథ్‌కు మాయావతి హితవు



**లక్నో :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యక్రమం 'ఏక్ సాల్ నయా మిసల్'పై మాయావతి విమర్శలు చేశారు. ఇటీవల ముగిసిన ఉప ఎన్నికల్లో వారి పని తీరును ఆత్మ పరిశీలన చేసుకోవాలని బీజేపీకి ఆమె హితవు పలికారు. 'ప్రజలు ఎప్పటికప్పుడు బీజేపీ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని తెలియ జేస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి మరింత దిగజారుతుంది' అని మాయావతి అన్నారు. బీజేపీ నేతృత్వంలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తొలి వార్షికోత్సవ 'ఏక్ సాల్ నయా మిసల్' కార్యక్రమంపై మాట్లాడుతూ 'యూపీ ఏడాది పాలనపై సంబరాలు చేసుకోవడానికి బదులు, వారి వైఫల్యాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలి. యోగి ఏడాది పాలన రాష్ట్రంలో చెడు మార్కు మిగిల్చింది' అని మాయావతి పేర్కొన్నారు.

## జీఎస్టీ, నోట్లరద్దుతో శివసేన కార్మికుడు ఆత్మహత్య

**ముంబయి :** జీఎస్టీ, నోట్ల రద్దుతో శివసేన కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం మహారాష్ట్ర అసెంబ్లీ ప్రతి పక్ష నాయకుడు రాధాకృష్ణ వికే పాటిల్ ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈ విషయాన్ని దిగువ సభలో చర్చించారు. పాలక పార్టీ ఉద్ధవ్ థాకరే ఇప్పటికీ ఎన్డీయేకు ఎందుకు మద్దతు తెలుపుతుందో వివరించాలని డిమాండు చేశారు. సతారా జిల్లా కరాద్ ధేసిల్‌కు చెందిన శివసేన కార్మికుడు రాహుల్ పాలేక్ జీఎస్టీ, నోట్ల రద్దు వంటి కారణాల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నాని మార్చి 16న సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని వికే పాటిల్ తెలిపారు. రెండు నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తమపై బలవంతంగా రుది నందుకే ఎన్డీయే ఆధ్వర్యంలోని బీజేపీకి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టామని వీకేపాటిల్ వెల్లడించారు.

## అవినీతి, విభజన రాజకీయాలపై రాజీలేదు

### నితీష్‌కుమార్ సుద్దులు

**పాట్నా :** అవినీతి, విభజన రాజకీయాలతో రాజీపడే ప్రసక్తేలేదని బీహారు ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీష్‌కుమార్ చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ఏ పార్టీనీ ఉపేక్షించబోమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా నితీష్ తన మిత్రపక్షం బీజేపీ మెడకు మేత పెట్టారు. నితీష్ సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అరారియా లోక్‌సభ నియోజకవర్గంలో దేశ వ్యతిరేక ఆరోపణలు, దర్భంగాలో ఒకరి తల నరికేస్తామంటూ బీజేపీ నాయకులు చేస్తున్న ప్రకటనలపై స్పందించడానికి నితీష్ ముందు నిరాకరించారు. ఉప ఎన్నికల్లో ఓటమి ఆందోళన కలిగించిందని, సమాజంలోని అన్ని వర్గాలు ఎన్‌డీఏకు బాసటగా ఉండాల్సిన అవసరం ఉందని ఎల్‌జేపీ నాయకుడు రామ్‌విలాస్ పాశ్వాన్ చేసిన వ్యాఖ్యలపై నితీష్ స్పందిస్తూ 'ఆయన చిన్న నాయకుడేమీ కాదు. పాశ్వాన్ వ్యాఖ్యలకు నేను మద్దతిస్తున్నా. ఆయనతో రాత్రి సమావేశమయ్యా. అనేక అంశాలపై మేము చర్చించాం. పాశ్వాన్ అభిప్రాయాలను గౌరవిస్తాను' అని అన్నారు. మైనారిటీల కోసం తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను నితీష్ వివరించారు.

మైనారిటీలకు తాను చేసినన్ని పనులు ఎవరూ చేయలేదని అన్నారు. బీజేపీ గురించి ప్రస్తావిస్తూ 'మేము సంకీర్ణంలో ఉన్నాం. వేర్వేరు పార్టీలకు నాయకత్వం వహిస్తున్నాం. నేను ప్రభుత్వానికి అధినేతగా ఉన్నా. అందరూ సమానమే అనే ప్రాతిపదికపై నా ప్రభుత్వం నడుస్తోంది' అని నితీష్ చెప్పారు. రైల్వే హోటల్ భూ కుంభకోణం ఆరోపణలకు సంబంధించి ఆర్‌జేడీ నేత లాలు, ఆయన కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ దాఖలను సీబీఐ లీగల్ సెల్ వ్యతిరేకించినట్టు ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తల గురించి ప్రస్తావించగా నితీష్ కొంత మృదువుగా స్పందించడం ఆశ్చర్యం కలిగించింది. 'అప్పుడు నేనేమి చెప్పాను. నేను వివరణ మాత్రమే కోరాను. వారు ఏ తప్పు చేయకపోతే మా పార్టీ వారికి మద్దతిస్తుంది' అని నితీష్ అన్నారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్‌తో



కలసి 2015 అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్‌కుమార్ విజయం సాధించారు. బీజేపీతో చేతులు కలిపి నితీష్ ఆర్‌జేడీ, కాంగ్రెస్‌ను వదిలేశారు. అవినీతితో రాజీపడేది లేదు. అదే సమయంలో విభజన రాజకీయాలను అంగీకరించనని నితీష్ వ్యాఖ్యానించారు.

## సరిహద్దు గొడవలపై చర్చించం : మిజోరాం సీఎం

**ఐజ్వాల్ :** న్యూఢిల్లీలో మంగళవారం అస్సోం- మిజోరాం చీఫ్ సెక్రటరీల మధ్య జరుగు సమావేశంలో సరిహద్దు గొడవల అంశంపై చర్చించడంలేదని మిజోరాం ముఖ్యమంత్రి లాల్ తన్హవాలా సోమవారం రాష్ట్ర శాసనసభలో సోమవారం ప్రకటించారు. మార్చి 8, 10 తేదీల్లో మిజో విద్యార్థులు, విలేకరులపై అస్సోం పోలీసు దురుసు వైఖరిపై రాష్ట్ర కార్యదర్శి అరవింద్ రే సమావేశంలో మాట్లాడుతారని చెప్పారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి ఆ శాఖ కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షత వహిస్తారని, ఇరు రాష్ట్రాల హోంశాఖ అధికారులు, రెండు రాష్ట్రాల కార్యదర్శులు హాజరవుతున్నట్టు తెలిపారు.

## హురియత్ చైర్మన్‌గా అష్రాఫ్ సెహ్రా

**శ్రీనగర్ :** తెహ్రీక్-ఈ-హురియత్ చైర్మన్‌గా మొహమ్మద్ అష్రాఫ్ సెహ్రా సోమవారం ఎన్నికయ్యారు. సయ్యద్ అలీ షా గిలానీ స్థానంలో ఆయన చైర్మన్ పదవికి ఎన్నికయ్యారు. కాశ్మీర్‌లో కీలక వేర్పాటువాద నాయకుడిగా పేరున్న గిలానీ బహిరంగంగానే వేర్పాటువాద ప్రకటనలు చేశారు. హురియత్ చైర్మన్‌గా గిలానీ 2003 నుంచి ఈ పదవిలో బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం రాజీనామా చేశారు. పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో సెహ్రైను చైర్మన్‌గా ఎన్నుకున్నట్టు ఆ పార్టీ ప్రతినిధి తెలిపారు.

## గోడౌన్‌లో అగ్నిప్రమాదం

**ముంబై :** ముంబైలో మహారాష్ట్ర నగర్‌లోని గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 1.25కు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయని చెప్పారు. సమాచారం అందిన వెంటనే 8 అగ్నిమాపక వాహనాలు, 4 ట్యాంకులు అక్కడికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదని చెప్పారు.

## పంజాబ్‌లో పేలుడు- ఇద్దరి మృతి

**పాటియాలా :** పంజాబ్‌లోని పాటియాలాలో రోడి కుట్ మొహల్లాలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో చిన్నారితోపాటు ఇద్దరు మృతిచెందగా, నలుగురు చిన్నారులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన చిన్నారులంతా ఏడాది నుంచి 10 ఏళ్ల వయస్సులోపు వారేనని చెప్పారు. మృతిచెందిన వారిని ముమితియాజ్ (30), చిన్నారి మొహద్(2) గా గుర్తించినట్టు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. కేసు దర్యాప్తు జరుగుతున్నట్టు తెలిపారు.

## పెట్రోల్ బంకు వద్ద రెండు బస్సులు దగ్ధం

**జైపూర్ :** రాజస్థాన్‌లో ధోలాపూర్ జిల్లాలోని పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం పార్కింగ్ చేసి ఉన్న రెండు వాహనాలు దగ్ధం అయ్యాయి. పెట్రోల్ బంకులో మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. పెట్రోల్ బంకు వద్ద పార్కింగ్ చేసి ఉన్న వాహనాలపై ఎలక్ట్రిక్ వైరు తెగి పడటంతో మంటలు వ్యాపించాయని చెప్పారు.

## వేధింపుల కేసులో జార్వాల్‌కు బెయిల్

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీనేత ప్రకాశ్ జార్వాల్‌కు సోమవారం ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గతేడాది నమోదైన లైంగిక వేధింపుల కేసులో అడిషినల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సామర్ విశాల్ రూ 20వేల వ్యక్తిగత పూచికత్తుతో ఆయనకు బెయిలు మంజూరు చేశారు. జ్వారాల్ తరుపు కోర్టుకు హాజరైన న్యాయవాది వైభవ్ త్రివేది మాట్లాడుతూ జార్వాల్ వద్ద డబ్బులు గుంజడానికి తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. ఢిల్లీ సంఘం విహార్‌కు చెందిన 53 సంవత్సరాల మహిళ ఇంట్లోకి చొరబడి డియోలి ఎమ్మెల్యే జార్వాల్ అత్యాచారం చేయబోయాడని ఫిర్యాదు చేయడంతో ఫిబ్రవరి 22న భారత శిక్షాస్మృతిలోని 354, 506,509,సెక్షన్ లో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

## నృత్యం, సంగీతానికి ప్రత్యేక యాప్

**న్యూఢిల్లీ :** వర్తమాన గాయకులు, నృత్యకళాకారుల కోసం ఢిల్లీ ప్రభుత్వం సోమవారం 'ఢిల్లీస్ డేట్ విత్ డెమోక్రసీ' అనే విస్తృతమైన మొబైల్ యాప్ ప్రారంభించింది. కళలు, సాంస్కృతిక శాఖా విభాగం ఈ యాప్‌ను ప్రారంభించింది. వార్డుల స్థాయి నుంచి మున్సిపాలిటీ స్థాయి, ఆపై ఫైనల్స్ కూడా నిర్వహిస్తారు. ఢిల్లీలో చాలా మందిలో ప్రతిభ ఉన్నా, టీవీ కార్యక్రమాల ద్వారా మాత్రమే వెలుగులోకి వస్తున్నారని, మరింత మందిలోని ప్రతిభను వెలికి తీసేందుకే ఈ యాప్ ప్రారంభించా మన్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుదారుడిని ఆన్‌లైన్ ద్వారా ఎన్నుకుని, ఆ తర్వాత వివిధ ప్రదేశాల్లో గ్రాండ్ ఫినాలీని నిర్వహిస్తారు. ఈ పోటీలకు వయోపరిమితి లేదు.

## కానిస్టేబుళ్లపై దాడి కేసులో నలుగురి అరెస్టు

**బెంగళూరు :** జూదం ఆడటాన్ని అడ్డుకుంటున్నారన్న కారణంతో ఇద్దరి కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు పోలీసులు సోమవారం తెలిపారు. ఈ ఘటన బెంగళూరులో శుక్రవారం చోటుచేసుకుందని తెలిపారు. ఉగాది పర్వదినాన ప్రభుత్వ పాఠశాలలో జూదం ఆడుతున్నారన్న సమాచారం రావడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు బసప్ప, షహరానప్పలు అక్కడికి వెళ్లారని, అయితే అక్కడి జూదం ఆడుతున్న గ్యాంగ్ వారిపై దాడికి పాల్పడినట్టు చెప్పారు.

## ముంబైలో క్యాబ్ డ్రైవర్ల నిరవధిక సమ్మె

**న్యూఢిల్లీ :** ముంబైలో ఓలా, ఉబర్ డ్రైవర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. రాజ్‌థాకరే నాయకత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అనుసంధాన సంస్థ మహారాష్ట్ర నవనిర్మాణ వాహతుక్ సేన ఇచ్చిన పిలుపు మేరకు పలు క్యాబ్ డ్రైవర్లు సమ్మె పాటించారు. తక్కువ సంపాదనతో ఈ వ్యాపారం గణనీయంగా పడిపోయిందని దీంతో సమ్మె చేపడుతున్నట్టు మహారాష్ట్ర నవనిర్మాణ వాహతుక్ సేన అధ్యక్షుడు సంజయ్ నాయక్ తెలిపారు. క్యాబ్ కంపెనీలు ఈ అంశంపై ప్రభుత్వం చర్చలు జరగవచ్చని, చర్చల్లో తమ డిమాండ్ల పరిష్కారం కాకపోతే తదుపరి కార్యచరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## 73 అక్రమ నిర్మాణాల తొలగింపు

**జమ్మూ :** భూ ఆక్రమణ నిరోధక డ్రైవ్ కింద రోడ్ల విస్తరణకు రాజౌరి జిల్లాలో మున్సి పాలిటీ పరిధిలో 73 అక్రమ నిర్మాణాలు తొలగించి, దాదాపు రెండు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా సీనియర్ అధికారి తెలిపారు. రాజౌరీ తహశీల్దార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ మున్సిపల్ కమిటీ, ఫీల్డ్ సిబ్బందితో కూడిన బృందం భద్రతా, పోలీసు సిబ్బంది సహాయంతో ఈ డ్రైవ్ నిర్వహించిందని చెప్పారు. రహదారిలో అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తులు, పలు దుకాణాలను తొలగించినట్టు తెలిపారు.

## బీహార్ సీఎంపై అనర్హత పిల్ కొట్టివేత

**న్యూఢిల్లీ :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తనపై హత్య కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని నితీష్‌కుమార్ ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారని ఇందువల్ల తక్షణమే ఎమ్మెల్సీ సభ్యత్వానికి ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. హత్యకేసు పెండింగ్‌లో ఉందన్న విష యాన్ని తాను ఎన్నికల కమిషన్‌కు తెలిపినట్టు ఆయన తరపు న్యాయవాది సమా ధానమిచ్చారని కోర్టు పేర్కొంది. నితీష్‌కుమార్ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ధర్మాసనానికి తెలిపారు.

## ముస్లింలలో బహుభార్యత్వంపై సుప్రీంలో పిల్

**న్యూఢిల్లీ :** ముస్లింలలో బహుభార్యత్వం, ఒప్పంద వివాహాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. బహుభార్యత్వం, నిఖా హలాలా, ఒప్పంద వివాహాలైన నిఖా ముతాహ్, నిఖా మిస్యార్లను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ వివాహాలు ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను హరించి వేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## టైర్ల పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - శింగరాయకొండ రూరల్ : ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలంలోని కనమళ్ల గ్రామంలో టైర్ రీ బటన్ పరిశ్రమలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. మండలంలో కనమళ్ళ పంచాయతీలోని మామిడి తోటల్లో ఏపీ రబ్బర్ రిక్లెమర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిశ్ర మలో పనిచేస్తున్న సిబ్బంది ప్రాణాలు చేతపట్టుకుని బయటకు పరుగులు తీశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల ఎగిసిన మంటల్లో టైర్లు, మిషనరీలు కాలిపోయాయి.



## సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో 'విశ్వ'రూపం

- రాష్ట్రస్థాయిలో మొదటి, తృతీయ ర్యాంకులు
- 37 సీట్లు సొంతం చేసుకున్న విశ్వం చిన్నారులు

విశాలాంధ్ర - తిరుపతి : సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యాసంస్థలు సంచలనం సృష్టించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, తృతీయ ర్యాంకులను కైవసం చేసుకొని మరోమారు విశ్వం చిన్నారులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు ఎల్.మునిప్రణీత్‌రెడ్డి, 3వ ర్యాంకును జి.ప్రవీణ్ (8వ తరగతి) సాధించారు. వి.పాల్ జయకర్ (8వ తరగతి), ఎ.బి.జయసూర్య నాల్గవ ర్యాంకు సొంతం చేసుకున్నారు. 6వ ర్యాంకు పి.రామ్‌చరణ్ (8వ తరగతి), ఎ.కృష్ణ చైతన్య(12వ ర్యాంకు), బి.శ్రీరామ్(23వ ర్యాంకు), ఎ.రామ్‌చరణ్(24వ ర్యాంకు), సి.ప్రవీణ్‌కుమార్(26వ ర్యాంకు), ఎస్.సాయి జితిన్(36వ ర్యాంకు), కె.కుషల్ సాయి 40వ ర్యాంకుతో సత్తా చాటారు. ఈ ర్యాంకులతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి మొత్తం 37 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడం రాష్ట్ర విద్యాశాఖకే గర్వకారణమని విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్‌లో సోమవారం ర్యాంకర్ల అభినందన సభలో విశ్వనాధరెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్‌కు ఎక్కువ మందిని ఎంపిక చేసి వారి అభ్యున్నతికి తోడ్పడతామన్నారు. ప్రథమ, ద్వితీయ ర్యాంకులతోపాటు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విశ్వం టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ తులసివిశ్వనాథ్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


ముని ప్రణీత్


జి.ప్రవీణ్


పాల్ జయకర్

## కొల్లేరు తడారి.. ఎడారి


కలకుర్రు గ్రామ సమీపంలో రెండు జిల్లాల నడుమ పెద్దఎడ్లగాడి వంతెన వద్ద కొల్లేరు ఇలా.

ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద తాగునీటి మహా సరస్సు కొల్లేరు తడారి ఎడారిని తలపిస్తోంది. రాష్ట్రంలోని పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల మధ్య తొమ్మిది మండలాల్లోని 120 గ్రామాల్లో విస్తరించిన ఈ ప్రఖ్యాతిగాంచిన సరస్సులో ప్రస్తుతం నీటి జాడ కానరావడం లేదు. 75 వేల ఎకరాల్లోని కొల్లేటి అభయారణ్యం పరిరక్షణ పెద్ద సమస్యగా మారింది. సరస్సుగర్భం, ముఖద్వారంతోపాటు పరిసరాలు కళతప్పి నిర్జీవంగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు నిత్యం విదేశీ, స్వదేశీ పక్షులతో కళకళలాడే సరస్సు బోసిపోయింది. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచి ఎండలు ముదరడంతో కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో ఎక్కడా విదేశీపక్షుల కూతల జాడ లేదు. ఎంతో ఉత్సాహంగా గుడివాకలంక, ఆటపాక రిసార్ట్స్‌కు వస్తున్న పక్షుల ప్రేమికులకు నిరాశే మిగులుతోంది. కొల్లేరు మహాసరస్సు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. మహాసరస్సును కాపాడాలంటూ పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

- విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు

## గుంటూరుకు కల్తీ మిర్చి విత్తనాలు

- కర్ణాటక నుంచి వీఆర్ఎల్ పార్సిల్‌లో తరలింపు
- పట్టుకున్న వ్యవసాయశాఖ అధికారులు
- రూ.63 లక్షల విలువైన విత్తనాలు సీజ్

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : కల్తీలకే కేంద్ర స్థావరంగా మారుతున్న గుంటూరు నగరానికి కర్ణాటక నుంచి దిగుమతి అయిన కల్తీ హైబ్రిడ్ మిర్చి విత్తనా లను సోమవారం వ్యవసాయశాఖ అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.63 లక్షల వరకు ఉంటుందని భావిస్తున్నారు. కర్ణాటక నుంచి వీఆర్ఎల్ పార్సిల్ సర్వీస్ ద్వారా గుంటూరులోని సన్‌సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు వచ్చాయి. మొత్తం 210 కిలోల విత్తనాలు కిలో రూ.30 వేల చొప్పున విక్రయిస్తే రూ.63 లక్షల వరకు వస్తాయని అంచనా. ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో వ్యవసాయశాఖ గుంటూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో అంకారావు దాడి చేసి పట్టుకున్నారు. 6 ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడిలో కల్తీ విత్తన వ్యాపారుల్లో అలజడి రేగింది. తెలంగాణ, కర్ణాటక, రాయలసీమ నుంచి వచ్చే పార్సిల్ సర్వీసులను తనిఖీలు చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సన్నద్ధమ వుతున్నట్లు సమాచారం.



## 'బేతవోలు'కు అభినయ మల్లినాథ' బిరుదు

విశాలాంధ్ర-విజయనగరం పోర్ట్ : విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 33వ వార్షికోత్సవం ఆదివారం విజయనగరం జిల్లా మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఘనంగా జరిగింది. ప్రముఖ కవి బేతవోలు రామబ్రహ్మంకు 'అభినయ మల్లినాథ' బిరుదు ప్రదానం చేశారు. ఉగాది నాడు కళాశాల ప్రిన్సిపాల్ బురిడి అనురాధ జ్యోతి వెలిగించి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్లుగా విజయభావన సంస్థ సాహిత్యానికి ఎనలేని సేవచేస్తోందన్నారు. విజయభావన కార్యదర్శి డాక్టర్ ఏ.గోపాలరావు సమన్వయ కర్తగా కవితల తోరణంలో తొమ్మిది మంది కవులు కవితలను చదివి వినిపించారు. సంగీత నృత్య కళాశాల విద్యార్థినుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విజయభావన గౌరవాధ్యక్షుడు పీవీ నరసింహరాజు, భైరవభట్ల నరసింహం, పైడప్పడు పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

## యెరుకొండ దళితుల కన్నెర్ర

విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : దళితులపై పెత్తందార్లు భౌతికదాడులకు తెగ బడుతూ సాంఘిక బహిష్కరణకు పాల్పడినా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణ మని ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్ అన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మండలం యెరుకొండ గ్రామంలోని దళితులపై గత వారం పెత్తందార్లు దాడులు చేసిన కేసులో అధికార యంత్రాంగం చర్యలు తీసుకోక పోవడం, సాంఘిక బహిష్కరణకు గురైనా పట్టించు కోకపోవడంతో సోమవారం యెరుకొండ గ్రామ దళితులతో కలిసి దళిత హక్కుల పోరాట సమితి నాయకులు విజయనగరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్య దర్శి గోకా రమేష్‌బాబు నాయకత్వం వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై ప్రత్యక్ష దాడుల్లో అధికశాతం విజయ నగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే అనుచరులుగా చెప్పుకుంటున్న పెత్తదార్లు దళితలపై దాడులకు కారకులని తెలిసినా జిల్లా అధికార యంత్రాంగం అరెస్టులు చేయకపోవడం అన్యాయమన్నారు. సాంఘిక బహిష్కరణకు గురైన యెరుకొండ దళితులకు తక్షణమే మూడు నెలలకు సరిపడా అదనపు రేషన్ సరుకులు ఇవ్వాలన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో వివక్ష లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. దళితులపై నమోదు చేసిన కౌంటర్ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్త ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రభాకర్ హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వర రావు, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షులు ఒమ్మి రమణ, ఉపాధ్యక్షులు టి.జీవా, బీఎస్పీ నేత పీవీ రమణ, దళిత ఐక్యవేదిక నాయకులు ఆదాడ మోహన్, ఏఐఎం నేత తెరుపల్లి శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు లోగిశ రామకృష్ణ పాల్గొన్నారు. గ్రీవెన్స్‌లో ఏజేసీ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.




## ఉసురు తీసిన ఈత సరదా

**రాష్ట్రంలోని ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో సోమవారం ఈత సరదా నలుగురు ఉసురు తీసింది. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.**

- నలుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు చిన్నారులు

విశాలాంధ్ర - వెదురుకుప్పం : చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం నచ్చుకూరు గ్రామంలో చోటు చేసుకున్న ఘటన కన్నవారికి కడుపుకోత మిగిల్చింది. మండలంలోని నచ్చుకూరు గ్రామానికి చెందిన చిరంజీవి కుమార్తె ఓజెస్విని (6), పెనుమూరు మండలం అడవిపల్లి పంచాయతీ చిన్నమరెడ్డికండ్రిగకు చెందిన మోహన్‌రెడ్డి కుమార్తె హేమలత (12) వీరిద్దరు నచ్చుకూరులోని తమ అవ్వ వద్ద ఉంటూ పెనుమూరులో ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతు న్నారు. పాఠశాలకు మధ్యాహ్నం సెలవు కావడంతో రెండు గంటల సమయంలో స్కూల్ బస్‌లో నచ్చుకూరు చేరుకున్నారు. అవ్వ ఇంట్లోలేకపోవడంతో వీరిద్దరూ ఊరికి సమీపంలోని రెడ్డి చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్లారు. వాటర్ క్యానుకు దారం కట్టి నీటి గుంతలోకి దిగారు. దారం తెగిపోయి క్యాను తేలిపోవడంతో ఇద్దరూ మునిగి పోయారు. సాయంత్రం 5 గంటల సమయంలో పిల్లల చెప్పులను చెరవు గట్టుపై గుర్తించిన స్థానికులు పరిశీలించారు. ఓజెస్విని, హేమలత అప్పటికే మృతి చెందడంతో కేకలు పెట్టారు. ఓజెస్విని తల్లిదండ్రులు కూలి పనుల కోసం బెంగళూరు వలస వెళ్లారు. అవ్వ అయిన మునెమ్మ వద్దే ఉంచుకొని చదివిస్తోంది. రెండు కుటుంబాల ఆర్తనాదాలు మిన్నంటాయి. కార్వేటినగరం సీఐ చల్లనిదొర, వెదురుకుప్పం ఎస్సై రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

**బావ బావమరుదులిద్దరూ ఇంజనీర్లే**

విశాలాంధ్ర- రొంపిచర్ల : ఉగాది పండక్కి సొంతూరు వచ్చిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు (బావ బావమరుదులు) సోమవారం ఈతకు వెళ్ళి మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా రొంపిచర్లలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రొంపి చర్లకు చెందిన కేసరి నరసింహారెడ్డి (35), అదే గ్రామానికి చెందిన పామిశెట్టి వీరబ్రహ్మం (23) బావ బావమరుదులు. వీరిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా జీవనం సాగిస్తున్నారు. ఉగాది పండుగకు స్వగ్రామానికి వచ్చారు. సోమవారం గ్రామ సమీపంలోని తంగేడుమల్లి మేజర్‌కు ఈతకు వెళ్ళారు. కాలువలో దిగిన వీరబ్రహ్మం, నరసిం హారెడ్డి నీటి ప్రవాహానికి మునిగిపోయారు. వీరితోపాటు వచ్చిన మరో స్నేహితుడు వేణు వీరిద్దర్నీ కాల్వ నుంచి బయటకు తీసి గ్రామస్తులకు సమాచారం అందించారు. చికిత్స కోసం నరసరావుపేటకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. వీరి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



## క్వారీ పేలుడులో యువకుడు బలి

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం రాపాక పెద్ద క్వారీ వద్ద సోమవారం రాయి పేలిన ఘటనలో లోలుగు ఈశ్వరరావు(24) అక్కడికక్కడే మృతి చెందాడు. పొందూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన ఈశ్వరరావు ట్రాక్టర్ కళాసీగా పనిచేస్తున్నాడు. క్వారీ వద్ద రాళ్లను ట్రాక్టర్‌కు ఎక్కిస్తుండగా సమీపంలో పేల్చిన రాయి ఈశ్వరరావు తలపై పడటంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈయన తండ్రి కూడా ఇదే క్వారీలో రెండేళ్ల క్రితం కిందట ప్రమాదవ శాత్తు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు రోధనలు మిన్నంటాయి. ఈ క్వారీని పొందూరుకు చెందిన అధికార పార్టీ నాయకుడు లీజుకు తీసుకున్నారు. నాలుగేళ్లలో ఇటువంటి ఘటనలు ఏడాదికి ఒకట్రెండు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఈశ్వరరావు మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పొందూరు ఎస్ఐ బలరాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదా కోసం

## డీఆర్ఎం ఆఫీసు ముట్టడి ఉద్రిక్తం

**విశాఖ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతల అరెస్టు**

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్ ఇవ్వాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం విశాఖలో చేపట్టిన డీఆర్ఎం కార్యాలయం ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. తొలుత విశాఖ పట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం నుంచి విద్యార్థులు, యువకులతో కలిసి నేతలు ర్యాలీగా డీఆర్ఎం ఆఫీసుకు బయలు దేరారు. ఈ సందర్భంగా నాయకులు, కార్య కర్తలను పోలీసులు అడ్డుకోవడంతో గందర గోళం నెలకొంది. దొరికినవారిని దొరికనట్లు ఈడ్చుకొని వెళ్లి అరెస్టు చేయడంపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పాత్రపిల్లి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల దీర్ఘ కాలిక కోరిక అయిన రైల్వేజోన్ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం అవకాశవాద చర్యలు ప్రమా దకరమన్నారు. రైల్వేజోన్ ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా స్పష్టం చేయడం ద్వారా రాష్ట్రంపై మరోసారి కేంద్రం విషం చిమ్మిందన్నారు. రైల్వేజోన్ తెస్తానని ప్రజలను నమ్మించి గెలిచిన బీజేపీ నేత, ఎంపీ హరిబాబు నేడు జోన్ కోసం మాట్లాడకపోవడం సిగ్గుచేట న్నారు. హరిబాబు వెంటనే విశాఖవాసులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, ఏఐవైఎఫ్ నగం కార్యదర్శి అమర్ మాట్లాడుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యా యం జరుగుతున్నా చంద్రబాబు నాలుగేళ్లుగా నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్డీఏ నుంచి వైదొలిగాం, రాజీనామా చేశామని చెప్పడం కేవలం డ్రామాలే అన్నారు. రాష్ట్రానికి నిరంతరం అన్యాయం చేసిన బీజేపీ, టీడీపీలకు ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, వైఎఫ్ నాయకులు, వేముల కన్నబాబు, కె.వి. నాయుడు, వి.రామానాయుడు పాల్గొన్నారు.



# కాంట్రాక్టు నర్సులకు న్యాయం చేస్తా : జగన్

విశాలాంధ్ర-కాకుమాను : కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది జగన్‌ను కలసి తమ సమస్యలను వివరించగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. జగన్ యాత్ర సోమవారం మండల కేంద్రమైన కాకుమాను నుంచి ప్రారంభమై మేళతాళాలతో రంగు రంగుల పూలతో స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కాకుమాను నుంచి పెద్దివారిపాలెం అడ్డరోడ్డు మీదుగా కొమ్మూరు గ్రామానికి చేరుకుని అక్కడ ప్రజలతో మానవహారం ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్నటువంటి సమస్యలను తెలుసుకునేందుకే తాను ఈ సంకల్ప యాత్ర చేస్తున్నట్లు ఆయన ప్రజలకు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన టీడీపీ నాయకులు జె.చంటిబాబు తన అనుచరులతో కలిసి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. భోజన విరామం అనంతరం కొమ్మూరు గ్రామం నుంచి పెదనందిపాడు మండల పరిధిలోని నాగులపాడు గ్రామాల మీదుగా యాత్రను సాగించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత, లావు



శ్రీకృష్ణదేవరాయలు, ఆళ్ళ రామకృష్ణారెడ్డి, వల్లభనేని బాలశౌరి, పార్టీ ఫ్లోర్ లీడర్ రేవతి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఏ.వరప్రసాద్, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**జగన్ పాదయాత్రలో పాల్గొన్న మహిళలు**

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజా సంకల్పయాత్రలో జగన్‌తో పాటుగా మేమున్నామంటూ మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు తమ మద్దతు తెలియజేశారు. జగన్‌తో కరచాలనం చేసేందుకు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.



## జేఎన్‌యూలో ఉద్రిక్తత..

న్యూఢిల్లీ: లైంగిక వేధిపులకు ఆరోపణలపై జేఎన్‌యూ ప్రొఫెసర్ అరెస్టుకు విద్యార్థులు చేస్తున్న డిమాండు సోమవారం ఉద్రిక్తతలకు దారితీసింది. విద్యార్థులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. జేఎన్‌యూ ప్రొఫెసర్ అతుల్ జోహ్రిని తక్షణం అరెస్టు చేయాలంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ఢిల్లీ వసంత్‌కుంజ్ పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రొఫెసర్ అతుల్ జోహ్రిపై నలుగురు విద్యార్థినులు ఫిర్యాదు చేసినప్పటికీ ఒక ఫిర్యాదుపై మాత్రమే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కాగా, సీఆర్‌పీసీ 164 సెక్షన్ కింద నలుగురు బాధిత విద్యార్థినుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నామని, ఇంత వరకూ ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేశామని డీసీపీ తెలిపారు. అవసరమైతే మరిన్ని సెక్షన్లు కూడా చేరుస్తామన్నారు. కాగా, అతుల్ జోహ్రికి నోటీసు జారీ చేశామని, మంగళవారం ఇన్వెస్టిగేషన్ ముందు ఆయన హాజరవుతారని అధికారులు చెబుతున్నారు.

# మాది ప్రజాఫ్రంట్..



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : దేశంలో గుణాత్మక మార్పు కోసం తొలి అడుగు పడింది. ప్రత్యామ్నాయ శక్తిగా ఆవిష్కారం కావాలన్న సీఎం కేసీఆర్ ప్రయత్నం ఫలించింది. అడుగులో అడుగు వేసి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటునకు పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సుముఖత వ్యక్తం చేశారు. మమతా బెనర్జీతో భేటీ అయిన కేసీఆర్ తొలి ప్రయత్నం విజయవంతమైంది. బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కలిసి ప్రయాణం చేయాలని సమావేశం సంకల్పించింది. గులాబీ దళపతి కోల్‌కతా పర్యటన సఫలమైంది. 2019 ఎన్నికల్లో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు పావులు కదుపుతున్న కె.చంద్రశేఖరరావు తొలి అడుగుగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీని కోల్‌కతాలో సోమవారం కలుసుకున్నారు. రెండు గంటలు సాగిన ఈ భేటీలో ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, ఎజెండా, ఇతర విషయాలపై చర్చించారు. దేశంలోని పలు జాతీయ పార్టీల, ప్రాంతీయ పార్టీల నాయకులను కలుసుకొని అనంతరమే ఫెడరల్ ఫ్రంట్‌కు తుదిరూపం ఇవ్వనున్నారు. అంతకుముందు సచివాలయం చేరుకున్న కేసీఆర్‌కు మమత పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. కేసీఆర్ కూడా మమతకు పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విలేకరులతో కేసీఆర్ మాట్లాడుతూ దేశానికి ఫెడరల్ ఫ్రంట్ అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగానే తాము అన్ని ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. తమది థర్డ్ ఫ్రంట్ కాదని, ఫెడరల్ ఫ్రంట్, ప్రజాఫ్రంట్ అని పేర్కొన్నారు. దేశంలో గుణాత్మకమైన మార్పు కోసం తొలి అడుగు పడిందని చెప్పారు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. తమ ఫ్రంట్ చాలా పెద్దదని, ప్రజల ఎజెండాతో త్వరలోనే కూటమి ముందుకొస్తుంద న్నారు. ఇందుకోసం చాలామంది మిత్రులు తమతో కలిసి వస్తారని ఆశిస్తున్నానన్నారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని కేసీఆర్ తెలిపారు. మమతా బెనర్జీతో జరిపిన చర్చలు ఆరంభం మాత్రమేనని, ఆమెతో చర్చలు సంతృప్తిక రంగా సాగాయన్నారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం భావసారూప్యత గల అన్ని పార్టీలను కలుపుకొని వెళ్తామని, అందులో భాగంగానే మమతా బెనర్జీతో చర్చించామన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని మమత తీర్చిదిద్దుతున్న తీరు ప్రశంసనీయమన్నారు. గతంతో పోల్చుకుంటే కోల్‌కతా రూపురేఖలు చాలా మారిపోయాయన్నారు. 70 ఏళ్ల కాంగ్రెస్, బీజేపీ పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలుసని, దేశంలో ఎన్ని సహజ వనరులున్నా ప్రజలకు ఒరిగింది శూన్యమన్నారు. చైనాలాంటి దేశాలతో భారత్ ఎందుకు పోటీపడలేకపోతుందని ప్రశ్నించారు. సిలికాన్ వ్యాలీలో 60 శాతం మందికి పైగా భారతీయులున్నారని, దేశ యువతలో ఎంతో ప్రతిభ దాగుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు భిన్నంగా రాజకీయ ప్రత్యామ్నాయం అనివార్యమన్నారు. నాయకత్వం ఎవరు చేపట్టనున్నారని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ పరిస్థితులను బట్టి నాయకులు పుడతారని, నాయకత్వం సమస్య కాదని కేసీఆర్ సమాధానమిచ్చారు. సమష్టి నాయకత్వం ఉంటుందని, ఫెడరల్ లీడర్‌షిప్ ఉంటుందని తెలిపారు. తాము అనుకుంటున్న ఫెడరల్ ఫ్రంట్ రొటీన్‌కు భిన్నమైందన్నారు. భవిష్యత్తులో తమదే అతిపెద్ద కూటమిగా అవతరించబోతుందని, దేశ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తామన్నారు. మమతతో జరిగిన చర్చల్లో కొన్ని అంశాలపై అంగీకారం కుదిరిందని, భవిష్యత్తులో మరిన్ని అంశాలపై స్పష్టత ఇస్తామని చెప్పారు. ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించి తామిద్దరమే అన్ని అంశాలను నిర్ణయించలేమని, తమతో కలిసి వచ్చే మిత్రులందరితో చర్చించి మిగతా అంశాలు వెల్లడిస్తామని స్పష్టంచేశారు. మమతా బెనర్జీ మాట్లాడుతూ థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు దిశగా శుభారంభం మొదలైందని చెప్పారు. దేశం మార్పు కోరుకుం టోందని, బలమైన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు. దేశంలో నెలకొన్న పరిస్థితులే నాయకులను సృష్టిస్తాయన్నారు. ఈ భేటీలో దేశాభివృద్ధి, రైతు సమస్యలపైనా చర్చించానన్నారు. భావసారూపత్య ఉన్న మిత్రులందరితోనూ చర్చలు జరుపుతామని చెప్పారు. దేశాభివృద్ధిపై విస్తృతంగా చర్చించామన్నారు. ఇతర పార్టీలను త్వరలో కలుస్తామని తెలిపారు. కేసీఆర్‌తో పాటు రాజ్యసభలో టీఆర్ఎస్ పక్ష నాయకుడు కె.కేశవరావు, ఎంపీ కవిత, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ పాల్గొన్నారు.

# పోలవరం ప్రతిష్ఠాత్మకం

- చిన్న పొరపాటు లేకుండా నిర్మాణం చేయాలి
- 54వ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అందరి దృష్టి ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం మీదే ఉందని, ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టు నిర్మాణంలో చిన్న పొర పాటుకు కూడా అవకాశం లేకుండా నిర్మించాలని సీఎం చంద్రబాబు నిర్మాణ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన పోలవరం, ప్రాధాన్యతా ప్రాజెక్టులపై 54వ వర్చువల్ సమీక్ష నిర్వ హించారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఒక్క పోలవరం ప్రాజెక్టుకే రూ.9,000 కోట్లు కేటాయిం చామని, ఎట్టిపరిస్థితులలో అనుకున్న సమయంలోనే పూర్తిచేసి తీరతామని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు కేంద్రం నియమించిన కమిటీ గత శుక్రవారం సందర్శించి పనులపై సంతృప్తి వ్యక్తం చేసిందని, డీపీఆర్ లో మిగిలిన నిధులు ఒకటి రెండు రోజుల్లో విడుదల కావచ్చని అధికారులు ముఖ్య మంత్రికి వివరించారు. పోలవరం పునరావాసానికి సంబంధించి అన్ని పనులను ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేసి తీరాలని సీఎం సూచించారు. పోల వరం ప్రాజెక్టు సైట్‌లో ఉన్న 25 కెమెరాలను ఏపీ ఫైబర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని ఆర్టీజీ సీఈఓ అహ్మద్ బాబును ఆదేశించారు. మూడు రోజుల్లో ఈ పనులను పూర్తిచేస్తామని అహ్మద్ బాబు తెలిపారు. ముఖ్యంత్రి రాష్ట్రంలోని 29 ప్రాధాన్యతా ప్రాజెక్టులకు సంబంధించి జరుగుతున్న 52 పనులను సవివరంగా సమీక్షించారు. నిర్దేశించిన కాలపరిమితిలోగానే ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుల మౌలిక సదుపాయాలకు, పునరావాసానికి 4,500 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా వేశామని అన్నారు. గతంలో నిర్దేశించిన 116 రోజులలో జలసంరక్షణ కార్యక్రమాన్ని ఆయన సమీక్షించి కొన్ని సూచనలు చేశారు. ప్రాధాన్యతా క్రమంలో చేపట్టిన 29 ప్రాజెక్టులలో ప్రారంభించినవి కాక మిగిలిపోయినవాటిని నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాగావళి-వంశధార అనుసంధానంపై శ్రీకాకుళం కలెక్టర్ ధనంజయరెడ్డితో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ శాఖాపరమైన ఇబ్బందులు రాకుండా చూస్తానన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సకాలంలో పూర్తిచేయకపోతే పూర్తయ్యేదాకా అక్కడే నిద్రిస్తానని హెచ్చరించారు. భూ సేకరణ ఎక్కడైతే అక్కడ మరో వారం గడువు ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాజెక్టులు వర్షాకాలం వచ్చేలోగా ఎట్టి పరిస్థితులలోనూ పూర్తిచేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శించిన

# డిఫెన్స్ కళాశాల ప్రతినిధి బృందం

విశాలాంధ్ర-అమరావతి : మేజర్ జనరల్ హరిరాత్ సింగ్ నేతృత్వంలోని 15 మంది సభ్యుల ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల ప్రతినిధి బృందం సోమవారం అమరావతి సచివాలయాన్ని సందర్శించింది. రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమై నూతన రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని, రక్షణ శాఖ సంస్థలకు భూములు కేటాయింపును, కేంద్రం అందిస్తున్న తోడ్పాటు వివరాలను మేజర్ జనరల్ హరిరాత్‌సింగ్‌తో కూడిన ప్రతినిధి బృందం అడిగి తెలుసుకుంది. ఈ ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌తో భేటీ కావాల్సి ఉండగా ప్రధాన కార్యదర్శికి మాతృ వియోగంతో ఆయన ఢిల్లీలో ఉండడంతో ప్రభుత్వ పొలిటికల్ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్‌తో బృందం కొద్దిసేపు భేటీ అయింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ నూతన రాష్ట్రం ఏర్పాటు రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. రాష్ట్ర విభజన కారణంగా 2014 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని అప్పటి నుండి ఇక్కడ అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంగా హైదరాబాదు కేంద్రంగా ఉన్నప్పుడు పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందున్న రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కేవలం వ్యవసాయ ప్రధాన ఆధారంగా గల ప్రాంతంగా ఉన్న అమరావతి కేంద్రంగా రాజధానిని ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

రాష్ట్రానికి సుమారు 972 కి.మీ. పొడవైన సముద్రతీరం ఉందని ఇక్కడ అనేక రకాలైన ఉత్పాదక పరిశ్రమలు నెలకొల్పేందుకు, పర్యాటకపరంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి కొన్ని ముఖ్యమైన విమానాశ్రయాలు, రోడ్డు, రైల్వేలతో మెరుగైన కనెక్టివిటీ ఉండటంతో రాజధాని అమరావతి అనుసంధానానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఆర్‌డీఏ ప్రత్యేక కమిషనర్ వి.రామమోహన్‌రావు వారికి తెలిపారు. రాజధాని నిర్మాణ ప్రణాళిక, నిధుల సమీకరణ, పనుల నిర్వహణ అంశాల లక్ష్యంతో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్డీఏ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజధాని నిర్మాణం కోసం రైతుల నుండి ల్యాండ్ పూలింగ్ విధానంలో 33 వేల 417 ఎకరాలను సమీకరించి గ్రీన్ అండ్ బ్లూ ఫీల్డు రాజధాని నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రానున్న ఐదేళ్లలో రాజధాని నగర ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.45 వేల కోట్లను ఖర్చు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని. నవ నగరాలు నిర్మాణం జరుగుతోందన్నారు. హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం ఐకానిక్ భవనాల నిర్మాణానికి నమూనాలను ప్రభు త్వం ఆమోదించిందని రామమోహనరావు వివరించారు. ఈ సమావే శంలో రాష్ట్ర ప్రోటోకాల్ విభాగం అదనపు కార్యదర్శి కల్నల్ అశోక్ బాబు, ఎప్లాసికి చెందిన కోర్సు కోఆర్డినేటర్ బ్రహ్మానంద శ్రీవాస్తవ తదితర బృంద సభ్యులు పాల్గొన్నారు.



వెటర్నరీ విద్యార్థుల సమస్యలను

# మండలిలో ప్రస్తావిస్తా

## అసోసియేషన ప్రతినిధులకు ఎమ్మెల్సీ కత్తి హామీ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : రాష్ట్రంలోని గ్రామీణ పశువైద్య విభాగాలను (ఆర్‌వీఎల్‌యూ) పశు వైద్యశాలలుగా (వీడీ) అప్‌గ్రేడ్ చేయాలని, తక్షణమే 500 పశు వైద్యుల పోస్టుల భర్తీ చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ పశువైద్య విద్యార్థులు, పట్టభద్రుల సంఘం చేస్తున్న ఆందోళనపై శాసనమండలిలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి చెప్పారు. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 1,200 మంది విద్యార్థులు, పట్టభద్రులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం శోచనీయమన్నారు. శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం పరిధిలోని తిరుపతి, ప్రొద్దుటూరు (కడప), గన్నవరం (విజయవాడ)లోని కళాశాలల విద్యార్థులు 19 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నారు. అందులో భాగంగానే విజయవాడలోనిన సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సంఘం ప్రతినిధులు సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తాము ఎందుకోసం ఆందోళన చేస్తున్నామో సంఘం నాయకులు ఎమ్మెల్సీకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ, పశువైద్య విద్యార్థులు, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, ప్రభుత్వం నుంచి సమాధానాన్ని రాబట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఆర్‌వీఎల్‌యూలను దశలవారీగా వీడీలుగా అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఇప్పటికే అప్‌గ్రేడ్ చేసిన 250 వీడీలలో వైద్యులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. పశువైద్యలో పట్టభద్రులు ఇప్పటికే 450 మంది ఉద్యోగాల కోసం ఎదరు చూస్తున్నట్లు సంఘం నేతలు వివరించగా, పోస్టుల భర్తీపై కూడా మండలిలో మాట్లాడనున్నట్లు చెప్పారు. పశువైద్య విద్యార్థులు, పట్టభద్రుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తాను అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం మురళీ కృష్ణ, ఎల్ నారాయణప్ప, జే బాలకేశవరెడ్డి, కే విష్ణుతేజ ఉన్నారు. ఇదిలావుండగా, పశువైద్య విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శి మల్నీడి యలమందరావు మద్దతు ప్రకటించారు.

# అవిశ్వాసంపై టీడీపీ, వైసీపీ మధ్య మాటల తూటాలు

- మద్దతు ఇస్తామన్న సీపీఎం
- చర్చ విఘాతానికి టీఆర్ఎస్, అన్నాడీఎంకేల హై డ్రామా...

విశాలాంధ్ర బ్యూరో -న్యూఢిల్లీ : కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టడంలో టీడీపీ, వైసీపీలు పోటీ పడి స్పీకర్‌కు నోటీసులు ఇచ్చాయి. ఈ రెండు పార్టీలు ఇచ్చే నోటీసులు మాత్రం చెత్తబుట్టలోకి చేరుతున్నాయి. అవిశ్వాసం అంశం ఇక కంచికే నన్న అనుమానం కూడా రాజకీయ వర్గాల్లో ఉత్పన్నమవుతోంది. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ పార్టీలు హైడ్రామాకు పాల్పడటంతో టీడీపీలో ఆందోళన పెరిగింది. బీజేపీతో లాలూచీ పడి ఈ రెండు పార్టీలు ఈ రకంగా డ్రామాలు ఆడుతు న్నాయని టీడీపీ ఎంపీలు విమర్శలు గుప్పిస్తు న్నారు. కాగ నాలుగేళ్ళు చెట్టాపట్టా లేసుకుని రాష్ట్రానికి ఏమీ చేకుండా స్వార్ధ ప్రయోజనాల కోసం టీడీపీ అవిశ్వాసం డ్రామా ఆడు తోందని వైసీపీ విమర్శలు గుప్పిస్తోంది. టీడీపీ ఎంపీ శివప్రసాద్ ఆడవేషంలో పార్ల మెంటుకు వచ్చి ప్రత్యేక హోదాపై మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు.

**అవిశ్వాసంపై ఎవరేమన్నారంటే.....**

**అన్నాడీఎంకే, టీఆర్ఎస్‌తో బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ - అవంతి శ్రీనివాస్ :** అన్నాడీఎంకే, టీఆర్ఎస్ పార్టీలతో బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని, అందుకే ఆ రెండు పార్టీలు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేస్తున్నాయని టీడీపీ ఎంపీ అవంతి శ్రీనివాస్ విమర్శించారు. అవిశ్వాస తీర్మానంపై చర్చకు కేంద్ర ప్రభుత్వం బయపడి పోతోందని, సోమవారం లోక్‌సభలో జరిగిన సంఘటనలే అందుకు ఉదాహరణనన్నారు. అవిశ్వాసంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రకటించిన కొద్ది సేపటికే స్పీకర్ సభను వాయిదా వేశారని, సభ ఎన్నిసార్లు వాయిదా పడినా వదిలేది లేదని, కేంద్రంపై వత్తిడి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు.

**అవిశ్వాసానికి మద్దతు ఇస్తాం- సీతారామ్ ఏచూరి :** అవిశ్వాస తీర్మానానిక సీపీఎం పార్టీ మద్దతు ఇస్తుందని, బీజేపీ నిస్సిగ్గుగా ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని మోసం చేసిందని సీపీఎం నేత సీతారామ్ ఏచూరి విమర్శించారు. యూపీఏ 5 యేళ్ళు ప్రత్యేక హోదా అంటే బీజేపీ నేతలు 10 ఏళ్లు అడిగారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా ఇవ్వమంటే ప్రజలు ఊరుకోరని బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

**అవిశ్వాస తీర్మానానికి 150 మంది మద్దతు- వైవీ సుబ్బారావు :** కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి లోక్‌సభలో అనూహ్య మద్దతు లభించిందని ఆ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. సభ వాయిదా అనంతరం వైసీపీ ఎంపీలు మీడియాతో మాట్లాడారు. స్పీకర్‌అవిశ్వాస తీర్మానం నోటీసులను చదివినతర్వాత 150 మందిదాకా ఎంపీలు లేచి నిలబడ్డారు. అయితే అప్పటికే పోడియం దగ్గర కొన్ని పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. సభ ఆర్డర్‌లో లేనికారణంగా చర్చను చేపట్టలేకపోతున్నట్లు స్పీకర్ చెప్పారు' అని వారు వివరించారు. అయతే గందరగోళ పరిస్థితుల్లోనే ఆర్థిక బిల్లులు ఆమోదించుకున్న అధికార పక్షం అవిశ్వాసంపై చర్చను మాత్రం వాయిదా వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తూ మంగళవారం స్పీకర్ ఇచ్చే విందును వైసీపీ బహిష్కరిస్తోందన్నారు. చర్చ జరిపే వరకూ నోటీసులు ఇస్తూనే ఉంటామని వైవీ సుబ్బారెడ్డి వివరించారు.

**బీజేపీ గ్రాఫ్ పడిపోతుంది- మేకపాటి :** హోదా కోసం నిజాయితీగా పోరాడుతున్నది వైసీపీయేనని ఈ క్రమంలో వైఎస్ జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని మేకపాటి రాజ మోహన రెడ్డి వెల్లడించారు. అవసరాల మేరకు రంగులు మార్చడంలో చంద్రబాబును మించినవాళ్లు లేనేలేరని మొన్నటిదాకా ప్యాకేజీ చాలన్న సీఎం.. దేశంలో బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని గమనించి మళ్లీ హోదా కావాలంటూ యూటర్న్ తీసుకున్నారని ఏ ఎండకు ఆ గొడుగుపట్టే వ్యక్తిగనుకే బాబును ఎవరూ నమ్మొద్దని ఎంపీ మేకపాటి ప్రజలను కోరారు.

**ప్రధానిని కలిస్తే తప్పేంటి-విజయసాయిరెడ్డి:** హోదా విషయంలో చంద్రబాబు మొసలి కన్నారు పెడుతున్నాడు. ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎంపీల రాజీనామాలపై వెంటనే స్పందించాలని రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండు చేశారు. రాష్ట్ర సమస్యలపై ప్రధానిని కలిస్తే తప్పేముంది? తన సొంత కొడుకుని కూడా నమ్మని చంద్రబాబు తనలాగే అందరూ ఉంటారని అనుకుంటారు.

అవినీతి సొమ్మును బాబు విదేశాలకు ఎలా తరలిస్తున్నాడో ప్రధానికి వివరించాను. మాపై నమోదైన కేసులు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నాయని చంద్రబాబు న్యాయస్థానాలనే తప్పుపట్టేలా మాట్లాడటం సరికాదని విజయసాయిరెడ్డి అన్నారు.

**తాళిబొట్టుకూ ఆధార్‌లింక్ పెడాతారు - శివప్రసాద్:** ఆంధ్రప్రదేశ్ మహిళలంతా ప్రత్యేక హోదా కావాలని కోరుకుంటుండగా, ఆడవేషంలో ఆందోళన చేసి వారి ఆవేదన కేంద్రానికి తెలియజేయాలని అనుకున్నానని చిత్తూరు ఎంపీ శివప్రసాద్ వివరించారు. మోడీ నిర్ణయంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రత్యేక హోదాపై మోడీ అనేక మాటలు మార్చారని, జీఎస్టీతో కోట్ల కుటుంబాలు ఇబ్బందుల పాలయ్యారన్నారు. మోడీ తాళిబొట్టుకు ఆధార్‌ను లింక్ పెడతారా అనే అనుమానం వస్తోందన్నారు.

# పోలవరం పనుల్లో అవకతవకల్లేవు

## మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



విశాలాంధ్ర-అమరావతి :పోలవరం ప్రాజెక్టు పనుల్లో అవకతవకలకు తావేలేదని, రెండ్రోజుల కిందట ఢిల్లీ నుంచి వచ్చిన ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా ఇదే స్పష్టం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. సచివాల యంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. మసూద్ హుస్సేన్ అధ్యక్షతన ఉన్న ఎక్స్‌పర్ట్ కమిటీ పోలవరం ప్రాజెక్టు పనులు రెండ్రోజుల కిందట పరిశీలించిందన్నారు. గతేడాది అక్టోబర్ నెలలో తాము పోలవరం పనులు పరిశీలించామని, ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఎంతో ప్రగతి ఉందని ఆ కమిటీ రాజమండ్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపిందని మంత్రి వెల్లడించారు. 3డి నమూనా కూడా సిద్ధమైందని, త్వరలో మిగిలిన డిజైన్లకు సంబంధించి అనుమతులు మంజూరు చేస్తామని కమిటీ తెలిపిందన్నారు. పోలవరం ప్రాజెక్టుల్లో ఎటువంటి అవకతవకలకూ ఆస్కారం లేకుండా పారదర్శకతతో చేపడుతున్నామ న్నారు. ల్యాండ్ ఎక్విజిషన్‌కు సంబంధించి నాబార్డు నుంచి నేరుగా నిర్వాసితుల ఖాతాల్లో నష్టపరిహారం జమవుతోందన్నారు. డయాఫ్రమ్ వాల్ పనులు మే నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. దేశంలో 16 జాతీయ సాగునీటి ప్రాజెక్టుల పనులు జరుగుతుండగా, వాటిలో పోలవరం పనులే శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తరవాత తమ ప్రభుత్వ హయాంలో మూడున్నరేళ్లలో రూ.8 వేల కోట్లకు పైబడి ఖర్చు చేశామన్నారు. దాంట్లో కేంద్రం నుంచి రూ.2,727 కోట్లు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అందజేశామన్నారు. వచ్చే జూన్ మొదటి వారానికి గోదావరి వరద ప్రవాహం పెరుగుతుందన్నారు. ఈలోగా కేంద్రం నుంచి వచ్చే నిధులు కోసం వేచిచూడకుండా, ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగడానికి రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులు వెచ్చిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు, రైతుల ఆశీస్సులతో ప్రాజెక్టు పనులను లక్ష్యంలోగా పూర్త చేస్తామని,నీరు ప్రగతి పనులు కూడా శరవేగంగా సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి వారంలాగానే సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో 54వ వర్చువల్ సమావేశం సోమవారం జరిగిందని, సమావేశంలో తనతో పాటు కాంట్రాక్టు కంపెనీల ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారన్నారు.

# దద్దరిల్లాలి..

(మొదటిపేజీ తరువాయి)

సహకరిస్తారా? లేక అడ్డుకుంటారా?' అనేదీ తేల్చుకోవాలని సూచించారు.ఈ అంతిమ పోరాటంలో విద్యార్థి, యువజన సంఘాలు కీలక భూమిక పోషించాలని రామకృష్ణ కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ, అన్ని పట్టణాల్లో విద్యార్థి, యువజన సంఘాలతో కలిపి ప్రత్యేక హోదా సాధన సమితి కమిటీలను వేగవంతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, నిరసనలు, ప్రదర్శనలతో ఉద్యమ దిశాదశను మార్చాలన్నారు. బస్సు యాత్రలు, బందులతో కేంద్రంపై ఒత్తిడి మరింత పెంచుదామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల్ని దెబ్బతీస్తున్న బీజేపీ, టీడీపీ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామని అన్నారు. సినీ హీరో శివాజీ మాట్లాడుతూ, ప్రత్యేక హోదా కోసం నిర్మించిన ఉద్యమం దేశస్థాయికు చేరడం గర్వంగా వుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మానవత్వం లేకుండా పాలన కొనసాగిస్తోందన్నారు. బీజేపీ నేతలు తనను టార్గెట్ చేశారని వాపోయారు. ఆపరేషన్ గరుడతో ఏపీలో బీజేపీ ఎదుగుదలకు ప్రయత్నిస్తోందని, ఇది అసాధ్యమని అన్నారు. ప్రజలు తల్చుకుంటే బీజేపీకి దేశ వ్యాప్తంగా భవిష్యత్తు లేకుండా చేస్తారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజల కోసమే తాను ఉద్యమంలోకి వచ్చానని, ఈ ఉద్యమం విజయవంతమయ్యాక తిరిగి సిన్మాలు తీసుకుంటానని స్పష్టం చేశారు. పీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి మాట్లాడుతూ, విభజన చట్టం ఆధారంగా రాష్ట్రానికి రూ.50లక్షల కోట్లురావాల్సి వుండగా, రూ.11వేల 677 కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం నిన్నా, మొన్న ఢిల్లీలో నిర్వహించిన ఏఐసీసీ ప్లీనరీ సమావేశంలో తీర్మానించామన్నారు. సాధన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా మలిదశ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకుగాను వర్తక, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు.ఇంజనీరింగ్, వైద్య, జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులతో చర్చించాలన్నారు. అన్ని రాజకీయ పక్షాలతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించాలని కోరారు. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.పార్థసారథి మాట్లాడుతూ, ప్రత్యేక హోదా అంశం రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుతో ముడిపడి వుందన్నారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ, పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన హోదా హామీని బీజేపీ ప్రభుత్వం అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. రాజకీయ నేతలంతా జెండాలను పక్కనపెట్టి ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి అనుసంధానంగా వున్న అన్ని కేంద్ర సంస్థల్ని దిగ్బంధించి, హోదా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సూచించారు.ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రొఫెసర్ సదాశివరెడ్డి, జర్నలిస్టు యూనియన్ నాయకులు కృష్ణాంజనేయులు మాట్లాడుతూ, వెంటనే ఉద్యమానికి కార్యాచరణ రూపొందించాలని కోరారు. జనసేన పార్టీ నాయకులు అద్దేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తరపున సమావేశానికి హాజరయ్యానని చెప్పారు. సాధన సమితితో కలిసి హోదా కోసం పనిచేస్తామని పవన్ చెప్పారన్నారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక నేత, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, మోడీ ప్రజాస్వామ్య ద్రోహిగా ప్రజల్లో నిలిచిపోయారని అన్నారు.

హోదా కోసం అన్ని పార్టీలు ఒకే నినాదంతో పనిచేయడం శుభపరిణామమని అన్నారు. భవిష్యత్తులో అధికార పార్టీతోపాటు అన్ని పార్టీలు ఒకే వేదికపైకి వచ్చిఐక్యంగా హోదా కోసం మలి దశ ఉద్యమాన్ని నిర్మించాలని సూచించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరినాథ్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్య క్షులు వి.బాబ్జీ మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీలు సైతం ఒకే వేదికపై రావాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, హోదా ఉద్యమం మలిదశకు వచ్చిందన్నారు. ఈ ఉద్యమాన్ని అందరి సూచనలతో మరింత ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుదామని పేర్కొన్నారు. తొలుత సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ స్వాగతం పలికారు.

**తీర్మానాలు :** రౌండు టేబుల్ సమావేశంలో నాలుగు అంశాల అజెండాను సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ ప్రతిపాదించగా, ఏకగ్రీవంగా అందరూ ఆమోదించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జాతీయ రహదారులను దిగ్బంధించాలని, ఇక నుంచి అన్ని చోట్లా హోదా కోసం సమిష్టిగా ఉద్యమించాలని, అన్ని జిల్లాల్లోనూ ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి జేఏసీలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు.ప్రత్యేక హోదా ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను తొలగించేలా సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవాలని, ఉద్యమ కారులపై కేసులు నమోదు అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది.

ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీజే చంద్రశేఖరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవీ), రాష్ట్ర నాయకులు పిన్నమనేని మురళీకృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్), ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు రామారావు, హరినాథ్, శివయ్య, జనసేన రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి చెన్నుపాటి వజీర్, న్యాయవాదుల సంఘం నాయకులు మట్టా జయకర్, రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ జార్జి విక్టర్, ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథ్, ప్రత్యేక హోదా సాధన సమితి ఉపాధ్యక్షులు అప్పలనాయుడు తదితరులు హాజరయ్యారు. కృష్ణా, గుంటూరు జిల్లాల సీపీఐ కార్యదర్శులు అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు సయ్యద్ అఫ్సర్, ఎన్.లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, ఏపీ ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నాయకులు జాఫర్, ఐద్వా నాయకులు రమాదేవి, సత్యనారాయణరాజు(అల్లూరి సీతారామరాజు మేనల్లుడు)విద్యార్థి సంఘాల నాయకులు నరేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వివిధ ప్రజాసంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, మేధావులు, ప్రొఫెసర్లు, సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు వందన సమర్పణ చేశారు.

విశాలాంధ్ర

# క్రీడలు



## కామెంటరీ బ్యాక్సులో నాగిని డ్యాన్స్

కొలంబో:

ముక్కోణపు టోర్నీలో భాగంగా ఆతి థ్య శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో అనూహ్య విజయం సాధించిన బంగ్లా ఆటగాళ్లు పట్ట రాని ఆనందంతో మైదా నంలోకి దూసుకొచ్చి నాగిని నృత్యం చేసి అందరి దృష్టి ఆకర్షిం చారు. దీంతో ఒక్క సారిగా నాగిని నృత్యం పాపులర్ అయ్యింది. తాజాగా కామెంటరీ బాక్సులో భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ నాగిని నృత్యం చేశారు. ఇప్పుడు ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. టోర్నీలో భాగంగా ఆదివారం భారత్-బంగ్లాదేశ్ మధ్య ఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్‌కి మాజీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, బ్రెట్ లీ, చారుశర్మ టీవీ వ్యాఖ్యాతలుగా నిర్వహించారు. భారత్ బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో కామెంటరీ బాక్సులో ఉన్న సన్నీ నాగిని డ్యాన్స్ వేస్తూ కెమెరా కంటికి చిక్కారు. ఐతే, ఈ వీడియో చూసిన భారత అభిమానులు 'చాలా బాగా చేశావు' అంటూ కామెంట్లు పెడుతుంటే.. 'సన్నీ... నాగినిలా కనిపించడం లేదు. జూ నుంచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉంది 'సిగ్గు సిగ్గు' అని బంగ్లాదేశ్ అభిమానులు పేర్కొన్నారు. ఎందుకంటే వారు ఓడిపోయిన బాధలో ఉన్నారు కదా.

## శ్రీలంక జెండాతో రోహిత్



కొలంబో:

శ్రీలంక 70 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నిర్వహించిన నిదహాస్ ట్రోఫీలో భాగంగా ఆదివారం జరిగిన ఆఖరి టీ-20లో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఓడిపోతుందని అనుకున్న దశలో కీపర్ దినేశ్ కార్తీక్ విజృంభించి ఆడి జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. అయితే మ్యాచ్ అనంతరం గ్రౌండ్‌లో రోహిత్ శర్మ చేసిన ఓ పని అందరి దృష్టిని ఆకట్టుకుంది. మ్యాచ్ గెలిచిన తర్వాత మైదానంలోని అభిమానులకు అభివాదం చేస్తున్న సమయంలో రోహిత్ భారత్ జెండాకి బదులు శ్రీలంక జెండాతో తిరిగాడు. శ్రీలంక దేశ స్వాతంత్ర్యనికి గౌరవంగా రోహిత్ ఈ పని చేశాడు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పొరుగు దేశానికి అత్యంత గౌరవాన్ని ఇచ్చిన రోహిత్‌పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. రోహిత్ చేసిన ఈ చర్య మొత్తం క్రికెట్‌కే అందాన్ని తెచ్చిందని కామెంట్ చేస్తున్నారు. ఇంకొంతమంది బంగ్లాదేశ్ పొగరుకు రోహిత్ చేసిన ఈ పని చెంపపెట్టులా ఉందని అంటున్నారు.

## అదో అద్భుతమైన రాత్రి : దినేశ్



కొలంబో:

నరాలు తెగెంత ఉత్కంఠ మ్యాచ్‌లో చివరి బంతిని సిక్సుకు తరలించి భారత్‌కు విజయాన్నందించిన టీమిండియా వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ తన జీవితంలో ఈ రాత్రిని ఓ అద్భుతమైన రాత్రిగా అభివర్ణించాడు. నిదహాస్ ట్రోఫీలో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దినేశ్ కార్తీక్ అద్భుత ప్రదర్శనతో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో కార్తీక్‌పై అటు క్రికెట్ దిగ్గజాలు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నుంచి ఇటు సామాన్య అభిమాని వరకు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈనేపథ్యంలో కార్తీక్ సైతం ట్విటర్ వేదికగా తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. 'బహుశా నా జీవితంలో ఇది ఓ గొప్ప రాత్రి. ఇలాంటి అవకాశం మరోసారి రాకపోవచ్చు' అని ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఇక ధోని వల్లే తనకు ఈ శక్తి వచ్చిందని, ఎంతటి క్లిష్ట సమయాల్లోనైనా టెన్షన్ లేకుండా, కూల్‌గా ఉండగలగడం ఒక్క ధోనీకే సాధ్యమని, మ్యాచ్‌ను విజయవంతంగా ఫినిష్ చెయ్యడం ధోనీ నుంచే నేర్చుకున్నానని మ్యాచ్ అనంతరం కార్తీక్ చెప్పుకొచ్చాడు. ఈ సిరీస్ ముందు సీనియర్ వికెట్ కీపర్ ధోనికి విశ్రాంతి ఇవ్వడంతో అతని స్థానంలో యువ క్రికెటర్ రిషబ్ పంత్‌కు అవకాశమివ్వాలని పలువురు అభిప్రాయపడ్డారు. కానీ కెప్టెన్ రోహిత్ కార్తీక్‌పై ఉన్న నమ్మకంతో తొలి రెండు మ్యాచుల్లో ఈ ఇద్దరి ఆటగాళ్లకు అవకాశమిచ్చాడు.

## నన్ను క్షమించండి : రుబెల్

కొలంబో:

నిదహాస్ ట్రోఫీలో భారత్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఓటమిపై బంగ్లాదేశ్ పేసర్ రూబెల్ హొస్సెన్ పశ్చాతాపం వ్యక్తం చేశాడు. తాను ధారళంగా పరుగులివ్వడంతోనే తమ జట్టు ఓటమి పాలైందని, ఈ విషయంలో అభిమానులు క్షమించాలని విజ్ఞప్తి చేశాడు. ఓటమికి తానే కారణమవు తానని ఊహించలేదని ఈ బంగ్లా బౌలర్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమ జట్టు విజయానికి దగ్గరగా వచ్చిందని, కానీ చివరకు తన వల్లె ఓడిపోయిందన్నాడు. దీంతో ఈ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నానని, ఈ ఒక్కసారికి వదిలెయ్యాలని అభిమానులకు రూబెల్ బంగ్లా మీడియా ద్వారా విజ్ఞప్తి చేశాడు.

## నేనలా అనలేదు : జహాన్



కోల్‌కతా:

టీమిండియా పేసర్ మహమ్మద్ షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు తాను అనలేదని చెబుతోంది షమి భార్య హసీన్ జహాన్. పది రోజుల క్రితం హసీన్.. షమికి పలువురు మహిళలతో సబంధాలున్నాయని, మ్యాచ్ ఫిక్సింగ్‌కి పాల్పడ్డాడని సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొనడం గమనార్హం. 'షమిపై నేను ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేయలేదు. నాకు క్రికెట్ గురించి ఏమాత్రం అవగాహన లేదు. అలాంటిది నేను అలా ఎలా ఆరోపణలు చేస్తాను. అంతేకాదు నాపై అత్యాచారం జరిగిందని కూడా నేను అనలేదు. మీడియాలో ఏవేవో వార్తలు వస్తున్నాయి. కావాలంటే నా ఎఫ్ఐఆర్ కాపీ చూసుకోండి. ఎప్పుడైతే మా ఇద్దరికీ పెళ్లి అయ్యిందో అప్పుడే మాకు సమస్యలు మొదలయ్యాయి. రెండేళ్ల నుంచి విడాకులు కావాలని కోరుతున్నాడు. ఒకవేళ ఇప్పుడు నాకు షమి క్షమాపణలు చెప్పి, తప్పులన్నింటినీ ఒప్పుకున్నట్లయితే అంతా మంచే జరుగుతుంది. లేదంటే ఇక తామిద్దరం కోర్టులోనే కలిసేది' అని ఆమె స్పష్టం చేసింది. షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని, ఈ క్రమంలోనే దుబాయ్‌లో పాకిస్థాన్‌కు చెందిన అలీబ్‌షా అనే మహిళ నుంచి డబ్బులు తీసుకున్నట్టు హసీన్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ ప్రారంభించిన బీసీసీఐ జహీన్‌ను ప్రశ్నించింది.

### షమిని కలిసింది నిజమే..కానీ! : అలీబ్‌షా

టీమిండియా పేసర్ మహమ్మద్ షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని, పాకిస్థాన్‌కు చెందిన అలీబ్‌షా అనే అమ్మాయి నుంచి డబ్బులు తీసుకున్నాడని షమి భార్య హసీన్ జహాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై అలీబ్‌షా మీడియాతో మాట్లాడింది. హసీన్ చేసిన ఆరోపణలను కొట్టిపారేసింది. 'నేను ఇన్‌స్టాగ్రాంలో షమి ఫాలోవర్లలో ఒకర్ని. గతేడాది ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ అనంతరం నేను మొదటిసారి షమికి మెసేజ్ చేశాను. దుబాయ్‌లో మేమిద్దరం కలిసి రూమ్ తీసుకున్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. షమిని దుబాయ్‌లో కలిసింది నిజమే. కానీ, ఇదో సాధారణమైన మీటింగ్. షార్జాలో నా సోదరి ఉంటుంది. ఆ రోజు షమిని కలిసేందుకు నేను నా సోదరి ఇంటి నుంచి నేరుగా హోటల్‌కు వచ్చాను. షమి దుబాయ్ వచ్చిన మరుసటి రోజు ఉదయం సుమారు 9గంటల ప్రాంతంలో అతడితో కలిసి నేను బ్రేక్‌ఫాస్ట్ చేశాను. అంతేకానీ, మా ఇద్దరి మధ్య ఎలాంటి నగదు లావాదేవీలు జరగలేదు. అబద్దాలు చెప్పే అలవాటు లేని ఓ వ్యక్తి దేశానికి ద్రోహం చేస్తాడని ఎలా అనుకుంటున్నారు. ఎక్కడికి వచ్చి ఈ విషయం చెప్పమన్నా ధైర్యంగా చెబుతా. ఎవరికీ భయపడేది లేదు' అని అలీబ్‌షా తెలిపింది.

## అది ముమ్మాటికీ తప్పే : బీసీబీ

కొలంబో: మైదానం బయటా, లోపలా అసహనాన్ని ప్రదర్శించి, క్రీడాస్ఫూర్తినే దెబ్బతీసేలా తమ జట్టు ఆటగాళ్లు ప్రవర్తించిన తీరుపై చింతిస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. శుక్రవారం రాత్రి బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్‌లో గందరగోళం చెలరేగిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ బౌండరీ లైన్ దగ్గర నిల్చొని ఆడకుండా వచ్చేయాలంటూ తమ ఆటగాళ్లకు సంజ్ఞలు చేయడం, మరోవైపు రిజర్వు బెంచ్ ఆటగాడు నూరుల్ హసన్ సైతం నేరుగా శ్రీలంక కెప్టెన్ పెరీరాను వేలు ఎత్తి చూపిస్తూ దూకుడుగా వ్యవహరించడంతో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లో గందరగోళ వాతావరణం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో క్రీడా స్ఫూర్తి దెబ్బతినేలా ప్రవర్తించినందుకుగానూ తమ జట్టు ఆటగాళ్లను మందలించినట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పేర్కొంది. అదేవిధంగా మైదానంలో తమ జట్టు ఆటగాళ్ల ప్రవర్తన తీరు అంగీకార యోగ్యంగా లేదంటూ బీసీబీ ఓ ప్రకటనలో తెలిపింది. 'మ్యాచ్‌కు ఉన్న ప్రాధాన్యత మూలంగా ఆటగాళు హద్దులు మీరి ప్రవర్తించి ఉండవచ్చు. కానీ, క్రీడాస్ఫూర్తి దెబ్బతినేలా ప్రవర్తించడం మాత్రం అంగీకరించలేని అంశం. మైదానంలో తమ జట్టు ఆటగాళ్లు చేసింది తప్పేనని' బీసీబీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఇకపై క్రీడాస్ఫూర్తి దెబ్బతినేలా ప్రవర్తించరాదని ఆటగాళ్లకి బీసీబీ ఆదేశించినట్లు తెలిసింది.

## కేటగిరీలు.. వారు కోరినవే : వినోద్



న్యూఢిల్లీ: బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులో ఏ ప్లస్ కేటగిరీని కెప్టెన్ కోహ్లి, ధోనీ గట్టిగా సమర్ధించారని పరిపాలక కమిటీ చీఫ్ వినోద్ రాయ్ స్పష్టం చేశాడు. అన్ని ఫార్మాట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచే ఆటగాళ్ల కోసం ప్రత్యేకంగా ఏ ప్లస్ కేటగిరీని ఏర్పాటు చేయా లని విరాట్, ధోనీ ప్రతిపాదించారని, ఆటగాళ్లు కూడా అదే ఆశించారని పేర్కొన్నారు.

## ప్చ్.. ఆ సిక్స్ చూడలేకపోయా : రోహిత్

కొలంబో: ముక్కోణపు టోర్నీలో భాగంగా ఆదివారం భారత్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన ఫైనల్లో చివరి బంతికి సిక్స్ బాది భారత్‌కు మరపురాని విజయాన్ని అందించాడు దినేశ్ కార్తీక్. ఐతే, చివరి బంతికి కార్తీక్ కొట్టిన సిక్స్‌ను తాను ప్రత్యక్షంగా చూడలేకపోయానని చెప్పాడు భారత సారథి రోహిత్ శర్మ. అందేంటి.. అక్కడే డ్రస్సింగ్ రూమ్‌లోనే ఉన్నాడు కదా మరి ఎందుకు చూడలేదు అనే కదా మీ సందేహం.! మ్యాచ్ అనంతరం రోహిత్ శర్మ మీడియాతో మాట్లాడుతూ తాను ఎందుకు ఆ సిక్స్ చూడేలేకపోయాడో చెప్పాడు. 'చివరి ఓవర్లో ఆఖరి రెండు బంతుల్లో ఐదు పరుగులు చేయాలి. ఐదో బంతికి శంకర్ ఔటయ్యాడు. అప్పటికి మా జట్టు స్కోరు 162. ఇక మిగిలింది ఒకటే బంతి. స్ట్రైకింగ్‌లో కార్తీక్ ఉన్నాడు. ఎలాగైనా ఫోర్ కొడతాడు.. దీంతో మ్యాచ్ డ్రా అవుతుంది. సూపర్ ఓవర్ ద్వారానే ఫలితం దక్కుతుంది అని భావించి డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్లి ప్యాడ్ కట్టుకుంటున్నాను. ఆ సమయంలోనే కార్తీక్ సిక్స్ బాదేసి భారత్‌కు విజయం ఖరారు చేసేశాడు. దీంతో నేను ఆ సిక్స్‌ను చూడలేకపోయా' అని వివరించాడు రోహిత్ శర్మ.

## జాతీయస్థాయి తైక్వాండో కోచ్‌గా కొమర



విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం:

సిక్కోలుకు చెందిన కొమర భాస్కర్ జాతీయస్థాయిలో నిర్వహించే తైక్వాండో పోటీలకు కోచ్‌గా ఎంపికయ్యారు. మహారాష్ట్రలో పూణేలోని రాజారామ్ బిక్ పతారే స్టేడియంలో ఈనెల 22 నుంచి 25 వరకు జాతీయస్థాయి తైక్వాండో పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర టీమ్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి కొమర భాస్కర్‌ను ఎంపికచేసినట్టు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. అచ్యుతరెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 10,11 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా కోచ్ భాస్కరరావు మాట్లాడుతూ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ టీమ్ క్రీడాకారులను మంచి ప్రతిభ కనబరిచేలా తన వంతు కృషి చేస్తానన్నారు. శ్రీకాకుళం నుంచి కె.హేమలత, అండర్-38 కిలోల భాగంలో జాతీయస్థాయిలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కోచ్‌గా నియమితులైన భాస్కర్‌ను తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జిల్లా ఒలింపిక్ ప్రధాన కార్యదర్శి పి. సుందరరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. శ్రీనివాస్‌కుమార్, ఎస్‌వీసత్యప్రసాద్, పలు క్రీడాసంఘాల వారు అభినందనలు తెలిపారు.

# ఉద్యమం.. ఉధృతం

### రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు, విద్యార్థి, యువజన సంఘాల నిర్ణయం

విశాలాంధ్ర-అమరావతి:

ప్రత్యేక హోదా ఉద్యమం ఉధృత రూపం దాల్చింది.. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక తరగతి హోదా విభజన హామిల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలతో పాటు, విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు పోరాటం తీవ్ర తరం చేయాలని నిర్ణయించారు. కేంద్రానికి నవ్యాంధ్ర వాసుల నిరసన సెగ తగిలేలా పోరాటాలు చేపట్టాలని తీర్మానం చేశారు.

### మలిదశ పోరు ప్రారంభం

**చలసాని శ్రీనివాస్, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు**



మలిదశ పోరాటం ప్రారంభమైంది. ఏపీని కష్టాలపాల్జేసిన వారిలో కేంద్రం మొదటిదైతే, రాష్ట్రం రెండోది. కేంద్రానికి చెల్లించే పన్నులు నిలిపివేయాలి. చిత్తశుద్ధి లేని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాడు చేస్తున్నారు. జాతీయస్థాయిలో తెలిసేలా ఉద్యమం ఉధృతం చేయాలి. రైల్‌రోకో, రహదారుల దిగ్బంధనంవంటి నిరసనలు తెలపాలి

### ఇదే.. అంతిమ పోరాటం

**కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి**



ప్రత్యేక హోదా జాతీయ సమస్యగా మారింది. అవిశ్వాసం చర్చకు వచ్చిన రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తీవ్రతరం చేయాలి. కేంద్రంతో అంతిమ పోరాటం ఆరంభమైంది. రాష్ట్ర స్థాయిలో ఉధృత ఉద్యమాలు చేపట్టి ఢిల్లీకి షాక్ కొట్టేలా చేయాలి. ప్రస్తుం జరిగే ఆందోళనకు కూడా ప్రభుత్వం సహకరించాలి. హోదా పోరు హోరెత్తించాలి.

### ప్రజల్లోకి వెళ్లాలి

**మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి**



ప్రత్యేక హోదా ఉద్యమం ప్రజల్లోకి తీసుకెళ్లి కేంద్రానికి తెలిసేలా చేయాలి. గ్రామాల్లో, పట్టణాల్లో కమిటీలు ఏర్పాటు కావాలి. ప్రధానంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలి. ఈ ఉద్యమం కొత్త పుంతలు తొక్కాలి. అంతా కలసి ప్రత్యేక హోదా సాధన కోసం ఉద్యమించాలి.

### సంపూర్ణ సహకారం

**తులసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు**



ప్రత్యేక హోదా సాధన సమితి చేసే ప్రతి పోరాటానికి కాంగ్రెస్ మద్దతు ఉంటుంది. విభజన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. 198 నిబంధన కింద అవిశ్వాస తీర్మానం పెడితే పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరు అవిశ్వాసం పెట్టిన కాంగ్రెస్ మద్దతు ఇస్తుంది.

### ప్రాణ త్యాగానికైనా సిద్ధం

**శివాజీ, సినీ నటుడు**



తెలుగుతల్లికి అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదు. హోదా ఉద్యమం చేస్తున్న నాకు ప్రాణహాని ఉంది. అయినా రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధం. నవ్యాంధ్ర జోలికేస్తే చేతులు నరికి పారేస్తాం. రాష్ట్ర ప్రజలు బీజేపీని ఓ తొక్కు తొక్కితే కనపడకుండా పోతుంది. ఆపరేషన్ గరుడవేగ చేయటానికి ఇది సినిమా కాదు.

### టీడీపీ కలసి రావాలి

**ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి**



హోదా ఉద్యమంలో అధికార పార్టీ కలసి రావాలి. అఖిల సంఘాల సమావేశం నేటికి ఏర్పాటు చేయకపోవటం శోచనీయం. అన్ని వర్గాల మద్దతు కూడగట్టాలి. విద్యార్థి యువజన సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి పోరాటం తీవ్రతరం చేయాలి. హోదా సాధన సమితి చేసే ఉద్యమం ఉధృత రూపం దాల్చాలి.

### ఉద్యమంలోనే ఉన్నాం

**కేపీ పార్థసారథి, వైఎస్సార్ సీపీ నేత**



రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే పోరాటం వైసీపీ ఎప్పటి నుంచో చేస్తోంది. చలసాని శ్రీనివాస్ సారథ్యంలో చేస్తున్న హోదా ఉద్యమానికి పూర్తిగా సహకారం అందిస్తాం. ప్రత్యేక హోదా కోసం జగన్ నేతృత్వంలో వైసీపీ పోరాడుతుంది. ఐక్య ఉద్యమాలతో కేంద్రానికి రాష్ట్ర ప్రజల నిరసన తెలియచేయాలి.

### హోదా సాధించి తీరాలి

**కత్తి నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ**



ప్రత్యేక హోదా కోసం ఉద్యమం తీవ్రతరం చేయాలి. ఒకే వేదికగా పోరాడాలి. జాతీయ రహదారులు దిగ్బంధించాలి. సినీ రంగ ప్రముఖులను పోరాటంలోకి తీసుకురావాలి. ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందిస్తాం.

### హోదా ఉద్యమంలో మేము సైతం

**అద్దేపల్లి శ్రీధర్, జనసేన నేత**

ప్రత్యేక హోదా విషయంలో సాధన సమితి చేపట్టే ప్రతి పోరాటంలో జనసేన సంపూర్ణ సహకారం అందిస్తుంది. హోదాతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రజలే మా డైరెక్టర్లు. ప్రజా చైతన్యంలో పోరాటం చేసేందుకు జనసేన ఎప్పుడూ ముందుంటుంది. ఇదే విషయం పవన్ స్పష్టం చేశారు.



### వైరుధ్యాలు అధిగమించాలి

**హరినాథ్, సీపీఐ(ఎంఎల్) నాయకులు**

రాజకీయ పార్టీలు వైరుధ్యాలు అధిగమించి పోరాడాలి. వామపక్ష పార్టీల పోరాటంతో రాష్ట్రంలో ప్రత్యేక హోదాకు ప్రజల నుంచి పూర్తిస్థాయి మద్దతు లభిస్తోంది. పాలక వర్గాలు పరుగులు పెట్టించాలి. టీడీపీ కలసి రాని పక్షంలో ప్రజలే తిరస్కరిస్తారు. హోదా సాధన సమితి చేసే పోరాటంలో భాగస్వామ్యులుగా ఉంటాం.

కేంద్రంపై ఒత్తిడి బాగా పెంచాలి. రైల్ రోకోలు, జాతీయ రహదారులు నిర్బంధించాలి. డూ బిఫోర్ డై అనే మాదిరిగా పోరాటం చేస్తాం. సైనికులు మాదిరి పోరాడితే కేంద్రం హోదా ఇచ్చే తీరుతుంది. బహిరంగ సభలు పెట్టి ప్రజలను భాగస్వామ్యులు చేయాలని ఆమాద్మీ పార్టీ నాయకులు పోతిన రామారావు తెలిపారు. ప్రభుత్వం హోదా సాధనలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనీ, బడిని వదిలేసిన ప్రిన్సిపాల్ మాదిరిగా చంద్రబాబు వ్యవహరి స్తున్నారు లోక్‌సత్తా నేత బాబ్జి ఆరోపించారు. విద్యార్థి యువజన నాయకులను భాగస్వామ్యులను చేసి ఉద్యమం ఉధృతం చేయాలని, జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలనీ మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. హోదా సాధనలో యువత ప్రధాన పాత్ర పోషించాలనీ, రాజకీయ పక్షాలన్నీ ఒక్కటిగా పోరాటం చేసి, రాష్ట్ర బంద్‌తో కేంద్రానికి నిరసన తెలియజేయాలని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు తెలిపారు. న్యాయవాదుల సంఘం నాయకులు జయకర్, సీపీఐ నేత శివయ్య, సాధన సమితి నాయకులు జగదీష్, పలు విద్యార్థి యువజన నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.